తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

వికసిత్ భారత్ స్వప్నాలకు కేంద్ర బడ్జెట్ నో గ్యారంటీ

అణగారిన వర్గాల చైతన్య రవికిరణం... మఖ్దూం

కేంద్రానిది రాజకీయ బడ్జెట్

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 226 | మంగళవారం | 04-02-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

రాష్ట్రపతి ప్రసంగంలోనూ 'చాకలి పద్దు'లే

- వరుస ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించలే
- ఉద్యోగాలపై యువతకు స్పష్టమైన సమాధానం చెప్పలేదు
- 'మేక్ ఇన్ ఇండియా' మంచి ఆలోచనే.. కానీ ఆచరణలో విఫలం
- దేశం ఉత్పత్తి మానేసి మార్కెట్లను చైనాకు ఇచ్చేసింది
- మహారాష్ట్రలో ఐదు నెలల వ్యవధిలోనే 70 లక్షల మంది ఓటర్లు ఎలా పెరిగారు?
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభ చర్చలో రాహుల్ గాంధీ

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలకు, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే 70 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఈ సంఖ్య దాదాపు హిమాచల్ ప్రదేశ్‌లో రాష్ట్ర జనాభా అంత ఉంది. గత ఏడాది జూన్‌లో లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ 70 లక్షల మంది ఓటర్లూ లేరు. అందుకే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో నిజాయితీ, చిత్తశుద్ధిపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి.

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిత్యం వల్లించే 'చాకలి పద్దు' అంశాలే రాష్ట్రపతి ప్రసంగంలోనూ పునరావృతమయ్యాయని లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. రాష్ట్రపతి ప్రసంగం ఈ విధంగా ఉంటుందని తాను ఊహించలేదన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభ సూచనగా ఉభయసభలనూ ఉద్దేశించి జనవరి 31న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమక్షంలో సోమవారం నాడు లోక్‌సభలో చర్చ జరిగింది. రాహుల్‌గాంధీ ఈ చర్చలో పాల్గొంటూ, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వరుస ప్రభుత్వాలు అంటే యుపిఎ కావచ్చు లేదా ప్రస్తుత ఎన్‌డిఎ పాలకులు కావచ్చు ఎవరైనాగానీ దేశంలో నిరుద్యోగాన్ని సమర్థవంతంగా పరిష్కరించలేకపోయారనీ, ఉద్యోగాలు ఇచ్చే విషయంలో దేశ యువతకు స్పష్టమైన సమాధానం చెప్పలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ''మేక్ ఇన్ ఇండియా'' కార్యక్రమం ఎంతో మంచి ఆలోచనే అనీ, కానీ ప్రధాన మంత్రి ఆచరణలో విఫలమయ్యారని విమర్శించారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం విఫలం కావడానికి కారణం ఏమిటంటే, చైనా (వ్యాపారం)వచ్చి భారత దేశం లోపల పీఠం వేసుకుని (చైనా ఉత్పత్తుల ప్రవాహం)కూర్చుంది, ఈ కారణంగానే ''మేక్ ఇన్ ఇండియా'' కార్యక్రమం విఫలమైంది,ఈ కారణంగానే ఉత్పత్తి చేసేందుకు భారతదేశం తిరస్కరిస్తోంది, ''నా బాధంతా ఏమిటంటే భారతదేశం మరోసారి ఈ ఉత్పత్తి విప్లవాన్ని చైనా దేశానికే వదులుకోబోతోంది'' అని విమర్శించారు. భారతదేశం ఉత్పత్తులు చేయడం మానేసి మన మార్కెట్లను చైనాకు అప్పగించేసిందని విమర్శించారు. భారతదేశం పూర్తిగా వస్తూత్పత్తులపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉందని చెబుతూ దేశంలో సామాజిక ఉద్రిక్తతలు కూడా రోజు రోజుకూ పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్‌పార్టీ భవిష్యత్ ఆలోచనలను రాహుల్‌గాంధీ వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మేం ఎప్పుడూ ఇలా అమెరికా అధ్యక్షుడి పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి మా ప్రధానమంత్రిని ఆహ్వానించమని కోరుతూ మా విదేశాంగమంత్రిని అమెరికాకు పంపించబోమని రాహుల్‌గాంధీ అనండంతోనే పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి కిరెణ్ రిజిజు ఆయనపై ఎదురుదాడికి దిగారు. ప్రభుత్వ విదేశాంగ విధానంపై ఆయనకు ఉన్న అభ్యంతరాలు, ఆరోపణలు ఏమిటో చెప్పాలని కోరారు. ''మీరు ఈ విధమైన నిరాధార ఆరోపణలు చేయకూడదు'' అని హెచ్చరించారు. ''నేను రాష్ట్రపతి ప్రసంగం విన్నాను, అసలు రాష్ట్రపతి తన ప్రసంగంలో ఏం చెబుతున్నారో తరువాయి 2లో



ప్రవేశ పరీక్షలకు షెడ్యూల్ రిలీజ్

- టిజి ఇఎపిసెట్‌కు ఈ నెల 20న, టిజి ఐ-సెట్‌కు మార్చి 6న, టిజి ఇ-సెట్‌కు మార్చి 12న నోటిఫికేషన్ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పలు ప్రవేశ పరీక్షలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలలో ప్రవేశాల నిమిత్తం టిజిఇఎపిసెట్ (ఎప్‌సెట్2025), టిజి ఐసెట్, పిసి ఇసెట్ షెడ్యూల్‌లను ఉన్నత విద్యామండలి ప్రకటించింది. హైదరాబాద్‌లోని తరువాయి 2లో

కుల గణనపై విమర్శలు బిసిలపై దాడే!

- అధికారంలో ఉండగా బలహీనవర్గాలను పట్టించుకోని బిఆర్ఎస్
- ఇప్పుడు కుల సర్వేను అడ్డుకోవాలని చూస్తే ఊరుకోం
- కవిత ఒక్కరే వివరాలు ఇచ్చారు, ఆ కుటుంబంలో ఎవరూ ఇవ్వలే
- బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్

అధికారంలో ఉండగా బలహీనవర్గాలకు న్యాయం చేయని బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కుల సర్వేపై విమర్శలు చేస్తూ అడ్డుకోవాలని చూస్తే తాము చూస్తూ ఊరుకోబోమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఎన్నికలకు ముందు చెప్పినట్లు కుల సర్వే పూర్తి చేశామని, తరువాయి 2లో

సికింద్రాబాద్‌లో కవచ్ అభివృద్ధి కేంద్రం

- తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్
- రాష్ట్రంలోని ఏడు జిల్లాల గుండా ఐదు వందేభారత్ రైళ్లు
- రైల్వే నెట్‌వర్క్‌లో వంద శాతం విద్యుద్దీకరణ
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి ఈ ఆర్థిక (2025-2026) సంవత్సరానికి గాను రికార్డు స్థాయిలో రూ.5,337 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి తరువాయి 2లో

12

నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

- సమగ్ర కుటుంబ సర్వే, ఎస్‌సి వర్గీకరణ నివేదికపై చర్చ
- స్థానిక సంస్థలలో బిసిల కోటా, విద్య, ఉద్యోగ రంగాలలో ఎస్‌సి ఉపకులాలకు రిజర్వేషన్లపై నిర్ణయం

ఫైల్ ఫొటో

12

డిఎస్‌సి 2008 అభ్యర్థులకు ఊరట

- ఆర్హులైన వారిని 1,382 కాంట్రాక్టు టీచర్లుగా నియమించాలి
- మరో సారి హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ
- ఎన్నికల కోడ్ పేరుతో నియామకాలు వాయిదా వేయొద్దని ఆదేశం

కుంభమేళా తొక్కిసలాటపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

- చర్చ జరపాల్సిందేనని పట్టుబట్టిన ఎంపిలు
- లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులు
- స్పీకర్ ఓం బిర్లా అసహనం
- రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపిల వాకౌట్

05

జర్మనీ మితవాద ఎఎఫ్‌డి పార్టీకి వ్యతిరేకంగా బెర్లిన్‌లో భారీ ప్రదర్శన

02

మంత్రివర్గ ఉప సంఘానికి ఎస్‌సి వర్గీకరణ నివేదిక

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ ఏక సభ్య కమిషన్ సమర్పణ
- నేడు క్యాబినెట్ ముందుకు నివేదిక

ప్రజాపక్షం/హైదరాబాద్

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ ఏక సభ్య కమిషన్ 'ఎస్‌సి వర్గీకరణ నివేదిక'ను రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘానికి సమర్పించింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో సోమవారం మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉప సంఘం సమావేశమై నివేదికపై చర్చించింది. కాగా 'ఎస్‌సి వర్గీకరణ నివేదిక'ను మంత్రివర్గ ఉప సంఘం మంగళవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమర్పించనుంది. అనంతరం ప్రభుత్వం ఈ నివేదికను శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఇదిలా ఉండగా 2024 ఆగస్టు1వ తేదీన ఎస్‌సి వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా తీర్పునిచ్చిన విషయం తెల్సిందే. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ అమలు విషయమై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2024 అక్టోబర్ 11న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అఖ్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు తరువాయి 2లో

సమాజ అభివృద్ధికి మహిళా సాధికారత ముఖ్యం

- మహిళా సాధికారత లేకుంటే భవిష్యత్తు ఊహించలేం
- రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మహిళా పారిశ్రామిక వేత్తలు కీలక భాగస్వాములు
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్య
- వి హబ్‌ను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు, గవర్నర్

ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా సాధికారత సమాజ అభివృద్ధికి చాలా ముఖ్యమైనదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం స్థాపించిన ఉమెన్ ఎంట్రెప్రెన్యూర్స్ హబ్ (వి హబ్)ని ఐటి మంత్రి డి.శ్రీధర్‌బాబుతో కలిసి గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ..'మహిళా సాధికారత లేకుండా స్థిరమైన భవిష్యత్తును ఊహించలేమని, సమాన అవకాశాలు కల్పించేందుకు, మహిళలకు సుస్థిర బవిష్యత్తును అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన భాగస్వాములు అని గవర్నర్ అన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల తరువాయి 2లో

సమ్మె చేయొద్దని కార్మికులకు బెదిరింపులు

- ఆర్‌టిసి యజమాన్యం తప్పుడు ప్రచారం మానుకోవాలి
- టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి డిమాండ్
- ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులతో ప్రమాదమని ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్

సమ్మె చేయకూడదని ఆర్‌టిసి యజమాన్యం కార్మికులను బెదిరింపులకు గురిచేయడాన్ని టిజిఎస్ఆర్‌టిసి జెఎసి తీవ్రంగా ఖండించింది. ఆర్‌టిసి యజమాన్యం సమ్మెపై తప్పుడు ప్రచారం మానుకోవాలని జెఎసి డిమాండ్ చేసింది. హైదరాబాద్ అజామాబాద్‌లోని ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) కార్యాలయంలో సోమవారం టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. సమావేశంలో సమ్మె నోటీసు నేపథ్యంలో చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై నేతలు చర్చించి పలు తరువాయి 2లో

ఖాళీ చిప్పలతో సిపిఐ వినూత్న నిరసన

03

పోచంపల్లి చేనేత ఇక్కత్ కళాకార్మికులు 'టెక్స్ టైల్, హ్యాండ్లూమ్'కే తలమానికం

- ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజ్ ఆఫ్ మేజర్ ఆర్మీ త్రీ ఇన్‌ఛార్జి సామ్రాట్ ప్రశంస
- పోచంపల్లిలో మ్యూజియం, చేనేత కళాపునర్వియూనిట్, చేనేత కో-ఆపరేటివ్ సొసైటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ మార్కెట్ సముదాయం సందర్శన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి

యావత్తు దేశంలోని టెక్స్ టైల్ అండ్ హ్యాండ్లూమ్ పరిశ్రమకే యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణ ఇక్కత్ చేనేత కళాకార్మికుల సృజనాత్మక వస్త్రాల తయారీ తలమానికంగా నిలుస్తున్నదని ఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కాలేజ్ ఆఫ్ మేజర్ ఆర్మీ త్రీ ఇన్‌ఛార్జి సామ్రాట్ ప్రస్తుతించారు. ఆయన తరువాయి 12లో

ప్రచార హోరుకు తెర

- ఢిల్లీ అసెంబ్లీ పరిధిలో స్తబ్దత
- ముగిసిన ర్యాలీలు, రోడ్ షోలు
- రేపు ఓటింగ్, శనివారం ఫలితాలు

న్యూఢిల్లీ : బుధవారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఆర్భాటానికి తెరపడింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు పార్టీల రోడ్ షోలు, ప్రచార సభలు, పాదయాత్రలు, బైక్ ర్యాలీలు సద్దుమణిగాయి. బుధవారం ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభం కానుండగా, శనివారం ఫలితాలు వెల్లడిస్తారు. ఆమ్ ఆద్మీ పార్టీ మరోసారి అధికారం చేజిక్కించుకోగలన్న నమ్మకంతో ఉంది. తమ ప్రజాహిత పాలన, సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్న విశ్వాసంతో ఉంది. ప్రచారానికి చివరిరోజైన సోమవారం ఆప్ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ముఖ్యమంత్రి ఆతిశీతో కలిసి కాల్కాజీ ప్రాంతం సహా మూడు ర్యాలీలను ఉద్దేశించి ప్రసంగించారు. బిజెపి పార్టీ 25 యేళ్ల తరువాత తిరిగి అధికారం చేజిక్కించుకునేందుకు సోమవారం 22 రోడ్ షోలను నిర్వహించింది. అందులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా, పలువురు బిజెపి ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. గత రెండు ఎన్నికలలో ఓటమి చవిచూసిన కాంగ్రెస్ సైతం తరువాయి 12లో

జర్మనీ మితవాద ఎఎఫ్‌డి పార్టీకి వ్యతిరేకంగా బెర్లిన్‌లో భారీ ప్రదర్శన

బెర్లిన్ : జర్మనీలో పచ్చిమితవాద ఎ ఎఫ్ డి, సి డి యు పార్టీలకు వ్యతిరేకంగా బెర్లిన్‌లో లక్షమందిపైగా భారీ ప్రదర్శన జరిపారు. ఈనెల 23న జర్మనీలో ఎన్నికలు జరుగనున్నాయి. జర్మనీ పార్లమెంటు బుందేస్టాగ్‌లో వలసల వ్యతిరేక బిల్లును సమర్థించేందుకు సిడి యు (క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ ఆఫ్ జర్మనీ) పార్టీ పచ్చిమితవాద ఎ ఎఫ్ డి పార్టీ మద్దతు కోరింది. దీనిని తీవ్రంగా ప్రతిఘటిస్తూ సుమారు 1.60 లక్షలమంది ప్రదర్శకులు అన్ని వైపులనుండీ ఒకేసారి సిడియు కేంద్ర కార్యాలయాన్ని చుట్టుముట్టారు. తీవ్ర నిరసన తెలియజేశారు. పచ్చిమితవాద నాజీ పార్టీతో కలిసి పనిచేయకూడదని జర్మనీలో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అన్ని రాజకీయపార్టీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. కానీ గడచిన బుధవారంనాడు పార్లమెంటులో ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించే చర్యలకు పాల్పడిన సిడియును వ్యతిరేకిస్తూ ఈ ప్రదర్శన జరిగింది.

ఉత్తరసిరియాలో మరో బాంబుపేలుడు

18 మంది వ్యవసాయ కార్మికులు మృతి

డమాస్కస్ : ఉత్తర సిరియా నగర శివారు ప్రాంతం మన్‌బిజ్‌లో సోమవారం మరో బాంబు పేలుడు జరిగింది. ఈ పేలుడులో 18 మంది వ్యవసాయ కార్మికులు మరణించారు. వీరిలో 14 మంది మహిళా కార్మికులే. మరో 15 మంది మహిళా కార్మికులు గాయపడ్డారు. వ్యవసాయ కార్మికులను తీసుకువెళుతున్న లారీ వెనుక వస్తున్న మరో వాహనంలో పేలుడు పదార్థాలు ఉన్నాయి. గాయపడినవారిలో కొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. గడచిన మూడు రోజుల్లో వరుసగా మూడు బాంబుపేలుళ్ళ జరిగాయి. ఉత్తర సిరియాలోని మన్‌బిజ్‌లో గడచిన నెలరోజుల్లో ఆరు బాంబు పేలుళ్ళు జరిగాయి. సోమవారం ఏడోసారి బాంబుపేలుడు సంభవించిందని పౌర రక్షణ విభాగం (వైట్ హెల్మెట్) డిప్యూటీ డైరెక్టర్ మునిర్ ముస్తాఫా తెలిపారు. సిరియా రాష్ట్రం అలెప్పోలో జరుగుతున్న బాంబుపేలుళ్ళ కారణంగా అభివృద్ధి ఆగిపోతున్నదన్నారు. సిరియాలో రెండవ అతి పెద్ద నగరం అలెప్పో. 14 సంవత్సరాలపాటు అస్సాద్ పాలనలో దారుణమైన మానవతా విషాదం సిరియాలో నెలకున్నది. పౌరులే లక్ష్యంగా అనేక దాడులు జరుగుతున్నాయి. అధ్యక్షుడు బషర్ అస్సాద్ గడచిన డిసెంబరులో దేశం వదిలి పారిపోయారు. సిరియా జాతీయ ఆర్మీ పేరుతో చలామణీ అవుతున్న టర్కీ మద్దతు ఉన్న తెగలకు, అమెరికా మద్దతు ఉన్న సిరియన్ డెమోక్రటిక్ ఫోర్సెస్ పేరుతో చలామణీ అవుతున్న కుర్దిష్ తెగలకు మధ్య జరుగుతున్న హింసకు అలెప్పో రాష్ట్రం ప్రత్యక్ష వేదికగా మారింది. తాజా కారుబాంబు పేలుడుకు ముందు గడచిన శనివారం నాడు మన్‌బిజ్‌లో జరిగిన బాంబు పేలుడులో నలుగురు పౌరులు మరణించారు. మరో తొమ్మిదిమంది గాయపడ్డారు.

గాజాలో కాల్పుల విరమణ పొడిగింపు?

వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో నేతన్యాహూ చర్చ

వాషింగ్టన్ : ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ అమెరికా చేరుకున్నారు. నిర్ణీత ప్రకారం వైట్‌హౌస్‌లో సోమవారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. రెండో విడత కాల్పుల విరమణ అమలులో భాగంగా గాజా నుండి ఇజ్రాయెల్ సైనికులు పూర్తిగా ఖాళీ చేసి కనిపించకుండా వెళ్ళిపోవాలి. దీంతోపాటు 42 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం మార్చి 1వ తేదీతో ముగుస్తుంది. తదుపరి కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే విషయంపై కూడా ప్రధానంగా వారిద్దరిమధ్య చర్చ జరిగింది. తదుపరి మధ్యవర్తుల ద్వారా హమాస్‌తో చర్చలు కొనసాగించడానికి ఇజ్రాయెల్ ఒక అధికారిక బృందాన్ని ప్రకటించాల్సి ఉంటుంది. ఈ విషయంపైనే ట్రంప్‌తో నేతన్యాహూ ప్రధానంగా చర్చించారు. తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న విషయంపై ఉత్కంఠ నెలకుంది. గాజాలో కాల్పుల విరమణ తన ఘనతేననీ, తాను గెలవడంవల్లనే హమాస్‌తో ఇజ్రాయెల్‌కు ఒప్పందం కుదిరిందనీ ట్రంప్ పదేపదే చెబుతున్న తరుణంలో నేతన్యాహూతో ఈ తొలి సమావేశం జరిగింది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయనను వైట్‌హౌస్‌లో అధికారికంగా కలుసుకున్న మొట్టమొదటి విదేశీ నాయకుడు నేతన్యాహూ. వీరిద్దరిమధ్యా గాజాలో రెండోదశ కాల్పుల విరమణ ఒప్పందం అమలు చర్యలపై చర్చ జరిగింది. మొదటిదశ ఒప్పందంలో భాగంగా హమాస్ – ఇజ్రాయెల్ మధ్య బందీలను, ఖైదీలను పరస్పరం ఇచ్చిపుచ్చుకున్నారు. ఇంకా 79 మంది ఇజ్రాయెల్‌కు చెందిన పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారనీ, వారిని విడిపించేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్ పౌరులు నేతన్యాహూపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదిలా ఉండగా, పాలస్తీనాను పూర్తిగా తుడిచిపెట్టాలని, వారిని పొరుగు దేశాలకు తరలించాలని కుట్రలు చేస్తే సహించబోమని నేతన్యాహూ అమెరికా పర్యటన నేపథ్యంలో ఇరాన్ ఒక హెచ్చరిక జారీ చేసింది.

యుద్ధ మృతులు 61,700 మంది అంకెలు సవరించిన పాలస్తీనా ప్రభుత్వం

గాజా : గాజాలో గడచిన 15 నెలలుగా కొనసాగిన మానవ మారణహోమంలో మరణించిన పాలస్తీనా ప్రజలసంఖ్యను గాజా ప్రభుత్వం సవరించింది. ఇంతకుముందు చెప్పినట్లుగా ఈ మృతులసంఖ్య 47 వేల మంది కాకుండా 61,700కు పైగా ఉందని పాలస్తీనా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అదేవిధంగా 14,222 మంది జాడ తెలియకుండా పోయారని, అంటే వారంతా ఇజ్రాయెల్ చేసిన గగనతల దాడులలో ధ్వంసమైన ఇళ్ళశిథిలలో ఉండి ఉంటారని స్పష్టం చేసింది. లాన్సెట్ పరిశోధనా సంస్థ ఈమధ్య తన నివేదికలో గాజా మృతుల సంఖ్య తప్పుల తడకఅనీ, ఈ మృతులు పాలస్తీనియన్లు భావించినట్లుగా 46,000 కాదనీ, ఇంకా చాలా ఎక్కువగా ఉంటుందని, ఈ సంఖ్య దాదాపు 67 వేల మేరకు ఉంటుందని తన నివేదికలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రచురితమైన తర్వాత మధ్యవర్తుల చర్చల ద్వారా గాజాలో యుద్ధవిరమణ జరిగింది. యుద్ధవిరమణ మూడు దశలుగా అమలు చేస్తారు. జనవరి 19 నుండీ 42 రోజులపాటు గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా 33 మంది ఇజ్రాయెల్ బందీలను హమాస్ విడుదల చేస్తుంది. 2000 మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేస్తుంది. ఈ యుద్ధంలో 76 శాతం గాజా ప్రజలు హతులయ్యారని హమాస్ ఉగ్రవాదుల సారథ్యంలో ఉన్న పాలస్తీనా ప్రభుత్వం ప్రకటించింది. 460 రోజులపాటు గాజా దారుణ విధ్వంసాన్ని, నాశనాన్ని మూటకట్టుకున్న తర్వాత ఈ ఒప్పందం కుదిరింది.

ప్రపంచం

జిమ్మీ కార్టర్‌కు మరో గ్రామీ అవార్డు

లాస్‌ఏంజెల్స్ : అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కు మరణానంతరం గ్రామీ అవార్డు లభించింది. గతనెలాఖరున తన 100వ ఏట మరణించిన అమెరికా మాజీ అధ్యక్షుడు జీవించి ఉండగా మూడు గ్రామీ అవార్డులు తన సొంతం చేసుకున్నారు. మరణించిన రెండు నెలల్లో ఐదోసారి మరో గ్రామీ అవార్డు ఆయనకు లభించింది. ఆయన తన జీవితకాలంలో మొత్తం తొమ్మిదిసార్లు గ్రామీ అవార్డులకు ఎంపిక కాగా, జీవించి ఉండగా మూడు గ్రామీ అవార్డులు, మరణానంతరం మరో గ్రామీ అవార్డు తన సొంతం చేసుకున్నారు. 2006, 2015, 2018 సంవత్సరాలలో ఆయనకు గ్రామీ అవార్డు రాగా తాజాగా సోమవారంనాడు నాలుగో అవార్డు ఆడియో బుక్ విభాగంలో ఉత్తమ అవార్డు లభించింది. చిట్టచివరిగా ఆదివారాలలో జార్జియాలోని పాఠశాలల్లో చెప్పిన ఉత్తమ కథలను ఆడియో రికార్డింగ్ చేశారు. ఈ కథాసంవిధానం, ఉత్తమస్థాయిలో కథలు చెప్పినందుకుగాను ఈ అవార్డు వచ్చింది. సుమారు 50 సంవత్సరాల పాటు ఆయన ఆదివారాలలో పాఠశాలల్లో విద్యార్థులకు నెలకు ఒకటి కంటే ఎక్కువసార్లు ఎంతో చక్కగాకథలు ద్వారా విజ్ఞానాన్ని అందించేవారు.

శ్వేతజాతీయుల భూములు లాక్కోలేదు

ట్రంప్‌కు దక్షిణాఫ్రికా నేత రామఫోసా వివరణ

ప్రిటోరియా : దక్షిణాఫ్రికా ప్రభుత్వం దేశంలో ఉన్న శ్వేతజాతీయుల భూములు స్వాధీనం చేసుకోలేదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు దక్షిణాఫ్రికా దేశాధ్యక్షుడు సైరిల్ రామఫోసా వివరణ ఇచ్చారు. దక్షిణాఫ్రికాలో చట్టాలను దుర్వినియోగం చేయడంలేదనీ, కేవలం భూములు అందరికీ సమానంగా అందుబాటులోకి వచ్చేవిధంగా రాజ్యాంగబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. శ్వేతజాతి రైతులను దక్షిణాఫ్రికా ప్రభుత్వం నానా ఇబ్బందులూ పెడుతోందనీ, వారిపట్ల అనుచితంగా ప్రవర్తిస్తోందని, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందనీ, దీనికి పరిహారంగా అమెరికా నుండి దక్షిణాఫ్రికాకు అందుతున్న సహాయాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఐతే అదంతా అబద్ధమని పేర్కొంటూ ఎక్స్ వేదికగా రామఫోసా సోమవారంనాడు ఒక పోస్టింగ్ పెట్టారు. ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం అక్రమంగా శ్వేతజాతీయుల భూములను స్వాధీనం చేసుకోవడానికి రాజ్యాంగ చట్టాలను ఒక ఆయుధంగా వాడుకోవడంలేదని అన్నారు. ట్రంప్ అచ్చంగా ఇదే ఆరోపణ చేశారు. కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వకుండా శ్వేతజాతీయుల భూములు అక్రమంగా లాక్కుంటున్నారన్న ఆరోపణలపై పైవిధంగా రామఫోసా ప్రతిస్పందించారు. దక్షిణ ఆఫ్రికాలో 80 శాతంగా ఉన్న స్థానిక ఆఫ్రికా జాతీయులు స్వాతంత్ర్యం వచ్చిన 31 సంవత్సరాల తర్వాత కూడా నిరుద్యోగం, దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ఎక్కువశాతం భూములు ఇంకా శ్వేతజాతీయుల చేతుల్లోనే ఉన్నాయి.

ఇక ఇయుపై టారిఫ్‌ల గురి...

బలహీనపడిన ఆసియా మార్కెట్లు చైనా, మెక్సికో, కెనడాలపై టారిఫ్‌ల పెంపు చర్యల తర్వాత ఇక యూరోపియన్ యూనియన్‌పై కూడా టారిఫ్‌ల భారం తప్పదని ట్రంప్ హెచ్చరించారు. ఆయన మొదటినుండీ యూరోపియన్ యూనియన్‌పై కూడా టారిఫ్‌ల భారం తప్పదని చెబుతూ వచ్చారు. ''యూరోపియన్ యూనియన్ నుండి అమెరికాలోకి వచ్చే దిగుమతులపై టారిఫ్‌ల పెరుగుదల తప్పదు, ఐతే బ్రిటన్ విషయంలో మాత్రం కొంత బేరసారాలకు అవకాశం ఉందని ఊరట కలిగించారు.ఇదిలా ఉండగా టారిఫ్‌ల భయంతో ఆసియా మార్కెట్‌లు సోమవారంనాడు బలహీనపడ్డాయి. ముఖ్యంగా జపనీస్ కార్ల మార్కెట్‌పై ట్రంప్ ప్రకటన తీవ్ర ప్రభావం చూపించింది. ఆసియావ్యాప్తంగా మార్కెట్లలో షేర్లు పడిపోయాయి. శాగ్జోలోని ఇన్వెస్టిమెంట్ బ్యాంక్‌కు చెందిన పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త చారూ చనన మాట్లాడుతూ, ట్రంప్ అనుసరించిన ఈ టారిఫ్‌ల పెంపు విధానం స్వల్పకాలిక విధానం కాకుండా దీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ మార్కెట్లకు మరిన్ని కష్టాలు సమస్యలు తప్పవని హెచ్చరించారు. కెనడా, మెక్సికో కూడా ప్రతికార చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో తాము విభేదాలకంటే చర్చల ద్వారా పరిష్కారానికి సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ట్రంప్ కూడా ఈ విషయంలో వారితో నేరుగా మాట్లాడతానన్నారు.

బిసిలపై దాడే! (మొదటి పేజీ తరువాయి)

కులగణనపై విమర్శల దాడిని బిసిలపై దాడిగా భావిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను ఓఉద్యమం మాదిరిగా తీసుకుని విజయవంతం చేసి ఇచ్చినమాటను నిలుపుకుందని మంత్రి అన్నారు. బిసిలకు మేలు కోసం చేసే ప్రయత్నాలను అడ్డుకోవద్దని, కుల సర్వేపై ప్రతిపక్ష పార్టీలు కూడా వారి అభిప్రాయాన్ని మంగళవారం అసెంబ్లీలో తెలపాలని మంత్రి కోరారు. బిసి కుల గణన వివరాలను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో సోమవారం కాంగ్రెస్ ఒబిసి సెల్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన సంబురాలలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుల గణనతో రాష్ట్రంలో ఎవరుఎంత అనే లెక్క తేలిందన్నారు. మంగళవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. 'కవిత ఒక్కరే సర్వేకు వివరాలు ఇచ్చారు. వారి కుటుంబంలో ఎవ్వరు వివరాలు ఇవ్వలేదని, మరోవైపు ప్రధాన పార్టీల నేతలు కూడా కుల సర్వేకు వివరాలు ఇవ్వలేదని, మండల స్థాయి అధికారులకు ఇప్పటికైనా వివరాలు ఇవ్వవచ్చని మంత్రి చెప్పారు. ప్రతిపక్ష నాయకులు కె.చంద్రశేఖరరావు మంగళవారం జరిగే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలకు రావాలని కోరుకుంటున్నామని తెలిపారు. బిసిలకు న్యాయం జరిగే సమయం వచ్చిందని, దానిని ఎవరు అడ్డుకోవాలని చూసినా ఊరుకోబోమని మంత్రి హెచ్చరించారు. ఇది ఒక చరిత్రాత్మక కార్యక్రమమని, అన్ని జిల్లా కేంద్రాల్లో బలహీనవర్గాల నాయకులు, మేధావులు, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు సంబరాలు చే యాలని కోరారు. కులగణన పార్టీ పరంగా జరిగిన సర్వే కాదని, ప్రభుత్వ పరంగా జరిగిందని, ఈవిషయంలో ఎక్కడైనా పొరపాట్లు జరిగాయని అనిపిస్తే, ఏదైనా సలహాలు సూచనలు ఇస్తే ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ వినడానికి సిద్ధంగా ఉందన్నారు. సర్వే వివరాలు పబ్లిక్ డొమైన్‌లో పెడతామని, ఇందులో దాపరికం ఏమీ ఉంటుందని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు.

బెదిరింపులు (మొదటి పేజీ తరువాయి)

తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ మాట్లాడారు. టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు ఇచ్చినప్పటి నుండి తాము యజమాన్యం ముందుపెట్టిన డిమాండ్‌ల అంశాలను పక్కనబెట్టి కార్మికులకు సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ ప్రతిరోజూ డిపోలలో గేట్ మీటింగ్‌లు పెట్టి వారిని భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఆర్‌టిసి పుట్టినప్పటి నుండి ఏర్పడని ప్రమాదం ప్రస్తుతం ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్ళు తమరక్తాన్ని ధారపోసి కట్టుకున్న డిపోలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పచెప్పుతున్న దృశ్యాలు అధికారులకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. 3040ఏళ్ళ నుండి తమ ఇళ్ళుగా భావించి విధులు నిర్వహించిన కార్మికులను బలవంతంగా ఆ డిపోల నుండి గెంటివేస్తుంటే కన్నీరుమున్నీరుగా విలపిస్తూ భారమైన హృదయాలతో వెళ్ళిపోతున్న కార్మికుల ఆవేదన కనిపించడంలేదా? అన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలపైనే జెఎసి పోరాటం చేస్తోందన్నారు. తమన్యాయమైన డిమాండ్‌లను అధికారులు పరిష్కరిస్తారా? లేదా ?,ఈ ప్రభుత్వాన్ని ఒప్పించి నెరవేరుస్తారా? అని ప్రశ్నించారు. 2025లో 2,800 ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని, ఇవే కాకుండా రాబోయే రోజుల్లో 3,000బస్సులు తీసుకువస్తామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించినప్పటికీ దానిని తేలికగా తీసుకుని కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఒక పక్క రవాణా శాఖమంత్రి మహిళా సంఘాల ద్వారా 600 ప్రైవేట్ బస్సులు కొంటామని బహిరంగంగా చెప్పడం అంటే ఈ ప్రభుత్వం ఈ ఆర్‌టిసిని ప్రైవేట్ పరం చేయడానికి కంకణం కట్టుకున్నట్లు ఉందని మండిపడ్డారు. సంస్థను కాపాడుకోవడానికి, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించుకోవడానికి, ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి జెఎసి పోరాడుతున్నందున అధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాలని కోరారు. సమావేశంలో జెఎసి కోశాధికారి బి.యాదయ్య, నాయకులు ఎన్.బాల్‌రెడ్డి, ఎన్.కమలాకర్‌గౌడ్, సయ్యద్ రహీముద్దీన్, జి.రాములు, బి.శ్రీనివాస్‌గౌడ్, కెఎస్‌పాల్, ఎంఎమాజీద్, కె.వి. రవికుమార్ పాల్గొన్నారు.

చాకలిపద్దు'లే

(మొదటి పేజీ తరువాయి)

అర్థం చేసుకోవడానికి నేను చాలా ప్రయత్నం చేశాను, నా దృష్టంతా కేంద్రీకరించాను, ఎందుకంటే ఆ ప్రసంగంలో చాలా విషయాలు ఇంతకుముందు నేను విన్నవే, ఇప్పుడు రాష్ట్రపతి ప్రసంగంలో కూడా అదే జాబితాను ప్రభుత్వం పునరావృతం చేసింది'' అని లోక్‌సభలో రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ విధమైన రాష్ట్రపతి ప్రసంగాన్ని తాను ఊహించలేదన్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికి ఐదునెలల్లో 70లక్షల ఓటర్లు ఎలాపెరిగారు?

మహారాష్ట్రలో ఐదునెలల వ్యవధిలో 70 లక్షలమంది ఓటర్ల సంఖ్య పెరిగిందనీ, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, గణాంకాలను మహారాష్ట్రలో ఉన్న ప్రతిపక్షాలకు భారత ఎన్నికల సంఘం సమకూర్చాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బిజెపి అలవోకగా విజయం సాధించే రాష్ట్రాలలోనే ఈవిధంగా ఓటర్లసంఖ్య గణనీయంగా పెరుగుతోందని ఆయన విమర్శించారు. తి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో సోమవారంనాడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ, మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికలకు, ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే ఓటర్లు 70 లక్షలమంది పెరిగారని, ఈ పెరిగిన ఓటర్ల సంఖ్య దాదాపు హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జనాభా అంత ఉందని, వీరంతా వచ్చి ఓటర్ల జాబితాలో చేరారని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత ఏడాది నవంబరు 20వ తేదీన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది. అంతకుముందు అదే ఏడాది జూన్‌లో లోక్‌సభ ఎన్నికల నాటికి ఈ 70 లక్షలమంది ఓటర్లూ లేరనీ, అందువల్ల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో నిజాయితీ, చిత్తశుద్ధిపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నాయకత్వానగల అధికార మహాయుతి కూటమి భారీ విజయం సాధించిందనీ, ఐతే ఇప్పుడు ప్రతిపక్షాలు కోరినవిధంగా భారత ఎన్నికల సంఘం సంబంధిత వివరాలను ఇవ్వదని కూడా తాను గట్టిగా విశ్వసిస్తున్నానని విమర్శించారు. రాజ్యాంగ ప్రతిని ఒకచేతితో పట్టుకుని ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ, మన దేశ ప్రజల ఓటు, భద్రతలేని ఓటు వల్ల రాజ్యాంగానికి అర్థమే ఉండదని అన్నారు. ''మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కొన్ని గణాంకాలను నేను ఈ సభ దృష్టికి తీసుకురావాలనుకుంటున్నాను, లోక్‌సభ ఎన్నికలలో 'ఇండియా' కూటమి విజయం సాధించింది, తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి, ఆ ఎన్నికల సమయంనాటికి హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జనాభాకు సమానమైనంత మంది ఓటర్లు మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో చేరారు'' అని రాహుల్‌గాంధీ చెప్పారు. లోక్‌సభ–అసెంబ్లీ ఎన్నికలకు మధ్య ఐదు నెలల కాలంలో మహారాష్ట్రలో ఆకస్మికంగా అంతమంది ఓటర్లు కొత్తగా ఎలా వచ్చి చేరారని ప్రశ్నించారు. ఐదేళ్ళకాలంలో అసెంబ్లీ ఎన్నికలలో లేనంతగా ఐదు నెలల వ్యవధిలోనే షిర్డిలోని ఒక భవంతిలో 7000 మంది కొత్త ఓటర్లు పుట్టుకువచ్చారని ఆయన ఒక సాక్ష్యంగా ఉదహరించారు. ''నేను కేవలం ఆరోపణలు చేయడం లేదు, అక్కడ ఏదో సమస్య ఉందని ఈ సభ దృష్టికి తీసుకువస్తున్నాను, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర జనాభాకు సమానమైన ఓటర్లు లోక్‌సభ ఎన్నికల తర్వాత మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎలా పుట్టుకొచ్చారు, ఆ మాయాజాలం ఎలా జరిగింది?'' అని ప్రశ్నించారు. ''ఎన్నికల సంఘానికి మేం పదే పదే విజ్ఞప్తి చేస్తున్నాం, మేం ఆరోపణలు చేయడం లేదు, లోక్‌సభ ఓటర్ల సంఖ్య, ఆ జాబితా మాకు ఇవ్వండి, ఆ తర్వాత విధానసభ ఎన్నికలకు ఉపయోగించిన ఓటర్ల జాబితాను ఇవ్వండి, దయచేసి ఆ పేర్లు మాకు ఇవ్వండి అని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నాం, ఓటర్ల ఇంటి అడ్రసులు మాకు ఇవ్వమని అడుతున్నాం, అలా ఇస్తే ఈ ఓటర్లు ఎవరో, ఎక్కడి నుండి వచ్చారో మేం తెలుసుకుంటాం'' అని రాహుల్‌గాంధీ అన్నారు. ''అందువల్ల మళ్ళీ ఈ సభలో ఉండి అడుగుతున్నాను, మహారాష్ట్ర ఎన్నికల ఓటర్ల గణాంకాలను ప్రతిపక్షాలకు ఇవ్వండి, మహారాష్ట్రలో ఉన్న కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌సి)లకు ఇవ్వండి, ఈ ఓటర్లు ఎక్కడి నుండి వచ్చారో ప్రతిపక్షాలు కనిపెడతాయి'' అన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిలతో కూడిన కమిటీని ఎన్నికల కమీషనర్ సాధారణంగా ఉపయోగించుకుంటారనీ, కానీ ఈ కమిటీ నుండి బిజెపి ప్రభుత్వం భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించిందని గుర్తుచేశారు. ''ఇలాంటి మార్పు ఎందుకు చేశారనే కీలకమైన ప్రశ్న ఇప్పుడు ముందుకు వచ్చింది, కొద్దిరోజుల్లో నేను అమిత్ షా, మోదీలతోకలిసి ఈ కమిటీ సమావేశంలో పాల్గొనబోతున్నాను, ఇది ఒక అసాధారణమైనది, ప్రభుత్వం తరపున ఇద్దరు, ప్రతిపక్షం తరపున ఒక్కరు మాత్రమే ఈ సమావేశంలో ఉండటంవల్ల ఇందులో సమాన ప్రాతినిధ్యం లేదు, అలాంటప్పుడు నేను పాల్గొనడంలో ఉపయోగం ఏముంది? నేను ఆ కమిటీలో ఒక రబ్బరు స్టాంపుగానే మిగిలిపోతాను, మోదీజీ, అమిత్ షా జీ చెప్పినదానికి తలూపేస్థితిలో ఉండిపోతాను'' అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి గనుక ఈ త్రిసభ్య కమిటీలో ఉంటే మరింత సమతుల్యంతో కూడిన చర్చకు దోహదపడుతుంది, భారత ప్రధాన న్యాయమూర్తిని ఆ కమిటీ నుండి తొలగించారంటే అది ఉద్దేశపూర్వక వ్యూహంగానే ఉంది'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. ''ఇంకా చెప్పేదేమిటంటే, లోక్‌సభ ఎన్నికలకు కొద్దిరోజుల ముందుగా ఎన్నికల కమిషనర్‌ను మార్చారు, ఉన్న కమిషనర్ స్థానంలో మరొకరు వచ్చారు, ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు యావత్ ప్రతిపక్షం కోరుతున్నది ఏమిటంటే, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల గణాంకాల వివరాలు తెలియజేయమని అడుతున్నది'' అన్నారు. ఇక మూడో విషయం ఏమిటంటే, భారత వ్యవస్థలను, ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించే కృతనిశ్చయాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించాలి, యావత్ ప్రజాస్వామ్య వ్యవస్థ చట్రాన్ని రాష్ట్రపతి ప్రసంగం పునఃపరిశీలన చేయాలి, భారతదేశ ప్రజల నుండి సకల ప్రజాస్వామ్య వ్యవస్థలను దూరంగా లాక్కుపోయిన పరిస్థితులను పునఃపరిశీలించేదిగా రాష్ట్రపతి ప్రసంగం ఉండాలి'' అని రాహుల్‌గాంధీ అన్నారు.

అభివృద్ధి కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

అశ్విని వైష్ణవ్ తెలిపారు. తెలంగాణలో రైల్వే నెట్‌వర్క్ ఇప్పుడు 100 శాతం విద్యుదీకరణ జరిగిందన్నారు. కవచ్ ఏర్పాటులో తెలంగాణ ముందంజలో ఉందని, కవచ్ అభివృద్ధి కేంద్రం సికింద్రాబాద్‌లో ఉందని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్‌లో రైల్వే శాఖకు నిధుల కేటాయింపులపై సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ న్యూఢిల్లీ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన కేటాయింపుల ముఖ్యాంశాలపై వర్చువల్‌గా మీడియా సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ 200914 సంవత్సరాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వార్షిక సగటు బడ్జెట్ వ్

కేంద్రానిది రాజకీయ బడ్జెట్

ఆర్థిక అంతరాలు పెంచుతున్న బిజెపి విధానాలు
స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి
సిపిఐ జిల్లా సమితి సమావేశంలో కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ బిజెపి బడ్జెట్ అని బిజెపి రాజకీయ అవసరాలను తీర్చేవిధంగా బడ్జెట్ ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. బిజెపి రాజకీయ అవసరాలకు అనుగుణంగా కేటాయింపులున్నాయని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా సమితి సమావేశం సోమవారం కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ బిజెపి విధానాలతో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, పేదలు మరింత పేదలవుతుంటే.. సంపన్నులు మరింత సంపద పోగేసుకునే అవకాశాన్ని బిజెపి కల్పిస్తుందని ఆయన అన్నారు. బడ్జెట్ తర్వాత సామాన్య ప్రజలకు సైతం బిజెపి విధానాలు అవగతమవుతున్నాయని, వేతన జీవులకు ఊరట అన్న ప్రకటన సోమవారం నిర్మలా సీతారామన్ ప్రకటనతో వేతన జీవులను సైతం ఆలోచింపజేస్తుందన్నారు. ఒక పక్క మత విశ్వాసాలను రెచ్చగొడుతూ మరోపక్క ప్రైవేటీకరణను వేగవంతం చేస్తూ దేశంలో శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు బిజెపి ప్రమాదకరంగా మారిందన్నారు. ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం పట్టుకోల్పోయిందని రైతులు, వ్యవసాయ కూలీలు కార్మికులను పూర్తిగా విస్మరించారని ఆయన తెలిపారు. తెలంగాణలోని రేవంత్ సర్కార్ సైతం ప్రజల ఆలోచనలకనుగుణంగా పథకాలను అమలు చేయాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నదని పంచాయతీలు, ఎంపిటిసి, జెడ్పిటిసిలలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు పార్టీ కృషి చేయాలన్నారు. పార్టీ బలానికి అనుగుణంగా ఫలితాలొచ్చేలా నేతలు కృషి చేయాలన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాల సభ డిసెంబర్ 26న ఖమ్మంలో జరగనుందని ఇందు కోసం పార్టీ క్యాలెండర్ ఏర్పాటు చేసుకుని తదనుగుణంగా పార్టీ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు సంతాప తీర్మానాన్ని రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు ప్రవేశపెట్టారు.

ఖాళీ చిప్పలతో సిపిఐ వినూత్న నిరసన

బడ్జెట్‌లో తెలంగాణ పట్ల వివక్షపై కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలి
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణా పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపై సోమవారం హనుమకొండ కాళోజీ సెంటర్‌లో సిపిఐ చేతిలో ఖాళీ చిప్పలతో వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణా పట్ల సవతి తల్లి వైఖరిని ప్రదర్శిస్తోందన్నారు. ఎపి పునర్విభజన చట్టం అమలును బిజెపి నిర్లక్ష్యం చేసిందని, నిర్లక్ష్యానికి గురైన కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులోని తెలంగాణ గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదన్నారు. లక్షలాదిమంది యువకులకు ఉపాధి కల్పించే బయ్యారం ఉక్కు పరిశ్రమ ప్రాజెక్టును మూలకుపడేయడం దారుణం అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న అసమానతలు, ప్రాంతీయ అసమానతలు భారత ప్రజలు ఎదుర్కొంటున్న కొన్ని ప్రధాన సమస్యలు అయినప్పటికీ బడ్జెట్ వాటిని పరిష్కరించడంలో విఫలమైందన్నారు. పింఛన్లు, సామాజిక భద్రత, రైతులు డిమాండ్ చేస్తున్న ఎంఎస్పీ వంటి ప్రధాన సమస్యలను బడ్జెట్లో ప్రస్తావించలేదన్నారు. లింగ సమానత్వం, సామాజిక న్యాయ సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని, బడ్జెట్‌లో పేదరికం శూన్యం అని చెప్పినా వాస్తవానికి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఇప్పటికైనా తెలంగాణాకు బడ్జెట్‌లో సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, యేష బోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, రాసమల్ల దీనా, బత్తిని సదానందం, కండె నర్సయ్య, ఎదునూరి వెంకట్రాజం, మాలోతు శంకర్ నాయక్, కామెర వెంకటరమణ, గోకన రాజయ్య, దామెర సుదర్శన్, రాజారపు రత్నం పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపుతో ఉపశమనం

ట్యాక్స్ నిపుణులు పివిఎస్ఎస్.ప్రసాద్

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయంపై పన్ను చెల్లింపు మినహాయింపుతో మధ్యతరగతి వర్గాలకు, వేతన జీవులకు, పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలగనుందని ట్యాక్స్ నిపుణులు పివిఎస్ఎస్.ప్రసాద్ చెప్పారు. '2025–26 కేంద్ర బడ్జెట్‌పై చర్చ కార్యక్రమం తెలంగాణ, ఎపి ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్యానెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. ఈ చర్చకు పివిఎస్ఎస్.ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల ట్యాక్స్ నిపుణులు, చార్టెడ్ అకౌంటెంట్‌లు, ట్యాక్స్ కన్సల్టెంట్‌లు, ట్యాక్స్ అడ్వకేట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పివిఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ 'వికసిత్ భారత్' సాధించే లక్ష్యంతో భారతదేశ వృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రదేశపెట్టిన బడ్జెట్‌తో ఆర్థిక పరిస్థితి బలోపేతం అవుతుందని తెలిపారు. తెలంగాణ, ఎపి ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు హితేష్ జైన్ మాట్లాడుతూ 2025–26 కేంద్ర బడ్జెట్ దేశంలో సులభతర వ్యాపారానికి ఊతమివ్వడంతోపాటు విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తుందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేముల చంద్రశేఖర్, అసోసియేషన్ సలహాదారు రాందేవ్ బూత్డా, పూర్వ అధ్యక్షుడు అమృత్‌కుమార్ కోట, కోశాధికారి ఆశిష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతను విస్మరించిన కేంద్ర బడ్జెట్

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి విమర్శ

ప్రజాపక్షం / హైదరాబాద్ : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో మహిళా సాధికారతను మర్చిపోయినట్లు ఉందని, మహిళా అభివృద్ధికి అతి తక్కువ నిధులను కేటాయించడం పట్ల భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాదాపు రూ.50లక్షల కోట్ల బడ్జెట్‌లో కేవలం మహిళా సాధికారతకు అన్ని రంగాలలో కలిపి రూ.15లక్షల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్‌లో మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు కొద్దిపాటి ఉపశమనం తప్ప మహిళలకు, పేద ప్రజలకు ఒరిగిందేమీలేదని ఆమె విమర్శించారు. స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.4.49లక్షల కోట్లు, మహిళా సాధికారిత కోసం మిషన్ శక్తికి రూ.3,150 కోట్లు, నారీ అదాలత్‌లు, మహిళా హెల్ప్ మహిళా పోలీసు వాలంటరీ సంకల్ప పథకానికి రూ.629 కోట్లు, ప్రధానమంత్రి మాతృ వందన యోజన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ కోసం రూ.2521 కోట్లు మాత్రమే కేటాయించడం మహిళా అభివృద్ధి పట్ల బిజెపి పాలకులకు చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ నివారణ, రూపాయి పతనంపై ప్రస్తుత బడ్జెట్ ఏమాత్రం ప్రభావం చూపకపోవడం సోచనీయమన్నారు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ధర్మభిక్షం జయంతిని, వర్ధంతి వేడుకలను..

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపి, అఖిల భారత గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు బొమ్మగాని ధర్మభిక్షం జయంతి (ఫిబవరి 15), వర్ధంతి (మార్చి 26) వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గీతపనివారల రాష్ట్ర సమితి సమావేశం సంఘం అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం హైదరాబాద్‌లోని ధర్మబిక్షం భవన్‌లో జరిగింది. సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ పెండింగ్ ఉన్న గీత కార్మికుల రూ.9 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే చెల్లించడంతో పాటు, వృత్తి పెన్షన్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గీత వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాటమయ్య కిట్స్ నామమాత్రంగా సరఫరా అయ్యాయని, వాటిని అందరికీ అందించడంతో పాటు 560జిఒ ప్రకారం వన పెంపకానికి సొసైటీలకు భూములు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి డిజి.సాయిలుగౌడ్ మాట్లాడుతూ గీత వృత్తిదారులకు ప్రభుత్వం మెడికల్ బోర్డ్ విధానాన్ని రద్దు చేయకపోవడం, కొత్త లైసెన్స్ ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్టేట్ కోఆర్డినేటింగ్ సెక్రెటరీ బి. నాగభూషణం మాట్లాడుతూ గీత వృత్తిదారుల ఆర్థిక కార్పొరేషన్‌కు పాలక మండలిని ఏర్పాటు చేసి, సహకార సంఘాలు, టిఎఫ్‌టిలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్కిల్స్ యూనివర్సిటీలో గీత వృత్తిదారులకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు మారగాని ప్రవీణ్, పబ్బు వీరాస్వామి, వి.రామ్మూర్తి, చింతపల్లి పుల్లయ్య, కె.జయరాములు, రాయికింది సైదులు, చాపల అంజయ్య, పబ్బు యాదయ్య, డొంకెన యాదయ్య గౌడ్, డి.జి.నాగేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడుతూ సహకార సంఘాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి గీత వృత్తిదారులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధర్మభిక్షం జయంతిని నిర్వహించాలి : ధర్మభిక్షం 103వ జయంతిని ఫిబ్రవరి 15న, మార్చి 26న వర్ధంతిని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం సంఘం శ్రేణులకు పిలుపునిచ్చింది. గీత వృత్తిదారుల సమస్యపై ఫిబ్రవరి, మార్చి నెలల్లో జిల్లాల్లో అధికారులకు విజ్ఞాపన పత్రాలను అందజేయాలని కోరింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర స్థాయిలో సదస్సు నిర్వహించి భవిష్యత్తు కార్యక్రమం రూపొందించాలని సమావేశం నిర్ణయించినట్లు బొమ్మగాని ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపముఖ్యమంత్రితో బిసి కమిషన్ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ బిసి కమిషన్‌కు మరిన్ని అధికారాలు కల్పిస్తూ చట్ట సవరణ చేయాల్సిన విషయంపై, ఇందుకు సంబంధించిన పలు ప్రతిపాదనలపై రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, కమిషన్ సభ్యులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో చర్చించారు. మహాత్మా జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లో సోమవారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి భేటీ అయ్యారు. బిసి కమిషన్ 10 ఉమ్మడి జిల్లాల పర్యటనల తరువాత వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొన్ని కులాల పేర్లు మార్పు, అభ్యంతరాలను స్వీకరించిన తరువాత వచ్చిన అన్ని అంశాలను బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్కకు వివరించారు. వివిధ విజ్ఞప్తులను వాటి పర్యవసానాలను కూలంకుషంగా చర్చించారు.

సంస్కరణల ద్వారా మెరుగైన పోలీసింగ్

డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజా సంక్షేమం కోసం మెరుగైన పోలీసింగ్‌ను నిర్ధారించడానికి పోలీస్ శాఖలో అవసరమైన సంస్కరణల కోసం చర్యలు చేపడతామని పోలీస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. 'పోలీస్ సంస్కరణల ద్వారా మెరుగైన పోలీసింగ్' అనే అంశంపై సోమవారం హైదరాబాద్‌లో ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపిఎఫ్) ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఈష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిజిపి జితేందర్ మాట్లాడుతూ పోలీసింగ్ పద్ధతులను క్రమం తప్పకుండా సమీక్షించడం, మెరుగుపరచడం ప్రాముఖ్యతను గుర్తుచేశారు. పోలీసు సంస్కరణలపై పరిశోధనలో ఐపిఎఫ్ తన వంతు కృషి చేసిందన్నారు. ఐపిఎఫ్ ఆరు కీలక రంగాలపై పరిశోధనలు నిర్వహిస్తుందన్నారు. అంతర్గత పోలీసు సంస్కరణలు, సాంకేతికత ఆధారిత పోలీసింగ్, జైలు సంస్కరణలు, ఫోరెన్సిక్ సైన్స్ పరిశోధన, మహిళలపై నేరాలు, పోలీసు ఆరోగ్యం, పోలీసు శ్రేయస్సుపై అధ్యయనం చేయడం విశేషమన్నారు. సీనియర్ అధికారులు పోలీస్ స్టేషన్, కార్యాలయాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వల్ల పనితీరు మెరుగుపడుతుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ కొత్త విధానాలను అవలంభించడానికి, ప్రముఖ చట్ట అమలు సంస్థగా తన స్థానాన్ని నిలబెట్టుకోవడానికి, దాని వ్యూహాలను సమీక్షించడానికి కట్టుబడి ఉందని డిజిపి చెప్పారు. బాధిత కేంద్రీకృత విధానం, నైపుణ్యం కలిగిన దర్యాప్తులు, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రొఫెషనల్ పోలీస్ ప్రవర్తన ప్రాముఖ్యతను డాక్టర్ జితేందర్ తెలిపారు. బాధితులకు మెరుగైన సేవలను అందించడానికి పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యం, సమగ్రతతో వ్యవహరించాలని ఆయన కోరారు. ప్రజా ఫిర్యాదులపై వెంటనే ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని, మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, శాఖ ప్రతిష్టను మరింత పెంచడానికి కృషి చేయాలని డిజిపి అధికారులను ఆదేశించారు. ఐపిఎఫ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఈష్‌కుమార్ మాట్లాడుతూ, అంతర్గత పోలీసు సంస్కరణల ప్రాజెక్టును ప్రస్తుతం పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్ (డిజిపి) అఖిలాష బిస్ట్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. రిటైర్డ్ ఎస్‌పి ఎం.మల్లారెడ్డి ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఐపిఎస్ అధికారులు సుజాత, శిఖాగోయెల్, సంజయ్ కుమార్ జైన్, స్వాతిలక్రా, ఎం.రమేష్, ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వి.సత్యనారాయణ, రమేష్ నాయుడు, గజరావు భూపాల్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

గ్రాడ్యుయేట్ స్థానానికి 6, టీచర్స్ స్థానానికి 3 స్వీకరించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం సోమవారం ప్రారంభమైంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో గ్రాడ్యుయేట్ స్థానానికి ఆరుగురు, టీచర్ స్థానానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఇందులో ఇద్దరు అభ్యర్థులు గ్రాడ్యుయేట్, టీచర్స్ స్థానానికి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 12 సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయి. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన చాంబర్‌లో నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులకు తగిన సూచనలు, సలహాలు అందించేందుకు అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. టీచర్స్ ఎమ్మెల్సీకి నామినేషన్లు వేసిన వారిలో సిలివేరు శ్రీకాంత్ (జమ్మికుంట) రెండు సెట్లు, కూర రఘోత్తం రెడ్డి (గోనెపల్లి, చిన్నకోడూర్, సిద్దిపేట జిల్లా), చంద్రశేఖర్ చలిక (కూకట్‌పల్లి, మేడ్చల్, హైదరాబాద్) రెండు సెట్లు నామినేషన్ దాఖలు చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి నామినేషన్లు వేసిన వారిలో శ్రీకాంత్ సిలివేరు (జమ్మికుంట) రెండు సెట్లు, దూడ మహిపాల్ (ధర్మపురి), గవ్వల లక్ష్మి (దేవునిగూడ, జన్నారం, మంచిర్యాల జిల్లా), చంద్రశేఖర్ చలిక (కూకట్‌పల్లి, మేడ్చల్, హైదరాబాద్) రెండు సెట్లు, కంటి సాయన్న (దమ్మిగూడ, కీసర, హైదరాబాద్), మంచికట్ల ఆశమ్మ (యాపాలగూడ, ఆదిలాబాద్ జిల్లా)లు నామినేషన్లు దాఖలు చేశారు.

తెలంగాణ సమాజాన్ని మభ్య పెట్టే ప్రయత్నం

భువనగిరి ఎంఎల్ఎ కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : మాజీ మంత్రులు హరీష్ రావు, కెటిఆర్ తమ మాయమాటలతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ పడిపోయిందని అపోహలు సృష్టిస్తూ తెలంగాణ సమాజాన్ని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ భువనగిరి ఎంఎల్ఎ కుంభం అనిల్ కుమార్‌రెడ్డి విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికలకు 6 నెలల ముందే రియల్ ఎస్టేట్ పడిపోగా, గత రెండు, మూడు నెలలుగా బాగా కోలుకుందని తెలిపారు. రిజిస్ట్రేషన్లు పెరగడమే ఇందుకు నిదర్శనమని, సిఎం రేవంత్‌రెడ్డిపై అక్కసుతోనే హరీష్‌రావు రియల్ ఎస్టేట్ రంగాన్ని అప్రతిష్ట పాలు చేస్తున్నారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌ను ఒక గాలి బుడగలా తయారు చేసిందని, కెసిఆర్ ప్రభుత్వం రేరా అథారిటీని కూడా ఏర్పాటు చేయలేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి చైర్మన్‌గా రేరా అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ కంపెనీలపైనియంత్రణ లేకపోవడంతో ప్రీ సేల్స్ పేరుతో మధ్యతరగతి వర్గాలు వేల కోట్లను గత ప్రభుత్వ నిర్వాకం వల్ల పెద్ద ఎత్తున మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని సరిదిద్దుతోందని, గత ప్రభుత్వం తమ దగ్గరి వాళ్లతో కోకాపేటలో ఎకరం రూ.100 కోట్లతో కొనుగోలు చేయించి హైప్ క్రియేట్ చేసిందన్నారు. ప్రస్తుతం విల్లాలు, అపార్ట్‌మెంట్లు, వెంచర్ల అమ్మకాలు భారీగా పెరిగాయని ఆయన వివరించారు. బిఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లోని సగం చెరువులు మాయం కాగా, బాధ్యత కలిగిన ప్రభుత్వంగా హైడ్రాను తీసుకొచ్చామని, అన్ని అనుమతులు ఉన్న ఏ ఒక్క భవనాన్ని కూడా హైడ్రా కూల్చలేదన్నారు. ఎంఎల్ఎలు కలుసుకోవడం సహజమని, గతంలో కూడా అనేక సార్లు తాము కూడా కలిశామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గాలకు ఇస్తున్న నిధులతో తాము సంతోషంగా ఉన్నామని ఆయన వెల్లడించారు.

ఈనెల 6వ తేదీన జాబ్‌మేళా

టెక్ మహీంద్రలో 100 ఉద్యోగాలు భర్తీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేట్ రంగంతో ఉద్యోగ అవకాశాల్పించేందుకు గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.వందన తెలిపారు. మల్లెపల్లి ఐటిఐలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న ఈ జాబ్ మేళా ద్వారా టెక్ మహీంద్ర కంపెనీలోని 100 ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఆమె వెల్లడించారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసై ఆసక్తి గల అభ్యర్థులు తమ తమ బయోడెటా, విద్యార్హతల ధృవీకరణ పత్రాలతో నేరుగా జాబ్ మేళాకు హాజరు కావాల్సిందిగా కోరారు. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్ www.employmemt.telangana.gov.in లేదా, సెల్ నంబర్ 83284288933 ద్వారా సంప్రదించవచ్చాని సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో సూచించారు.

నిర్మాత కెపిచౌదరి ఆత్మహత్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ సినీ నిర్మాత కృష్ణప్రసాద్ చౌదరి (కెపి చౌదరి) సోమవారం గోవాలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు గోవా పోలీసులు పాల్పంచలో ఉంటున్న అతని తల్లికి సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగు చూసింది. దీంతో సినీ పరిశ్రమలో విషాదఛాయలు అలుముకున్నాయి. 2023లో డ్రగ్స్ కేసులో కెపి చౌదరిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో కెపి చౌదరి ప్రస్తుతం బెయిల్‌పై బయట ఉన్నారు.

సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కబాలి చిత్ర తెలుగు వెర్షన్ నిర్మాతల్లో కెపి చౌదరి ఒకరు. కాగా కెపి చౌదరి తల్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఉంటున్నారు. కెపి చౌదరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే, కబాలి సినిమా నష్టాలతో ఆయన తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్టు తెలుస్తోంది.

నేటి నుంచి గ్రూప్-డి రైల్వే ఉద్యోగాలపై టి-సాట్ ప్రత్యేక పాఠ్యాంశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ఆర్ఆర్‌బి ఆధ్వర్యంలో నిర్వహించునున్న గ్రూప్ డి ఉద్యోగాలపై టిసాట్ ప్రత్యేక డిజిటల్ పాఠ్యాంశాలను నేటి నుంచి ప్రసారం చేయనుందని టిసాట్ సిఇవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్‌డి ఎగ్జామినేషన్స్‌లో భాగంగా టెక్నికల్ పోస్టుల భర్తీకి సంబంధించి గత నెలలో సుమారు 32,438 ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఆ ఉద్యోగాలకు సంబంధించి మార్చి నెలలో ఆర్ఆర్‌బి పరీక్ష నిర్వహించబోతోందన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 32,438 ఉద్యోగాల భర్తీలో భాగంగా సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే జోన్‌లో 3,992 ఉద్యోగాల నియామకం జరగనున్నాయని, తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన నిరుద్యోగ యువత కోసం టిసాట్ ప్రసారం చేసే డిజిటల్ కంటెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.. పరీక్ష నిర్వహించే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ విభాగాలకు హాజరయ్యే అభ్యర్థులకు ఈ పాఠ్యాంశాలు ఉపయోగపడతయన్నారు. జనరల్ సైన్స్, మ్యాథ్స్, జనరల్

ప్రజాపక్షం
మంగళవారం, ఫిబ్రవరి 04

ఇది మధ్యతరగతుల బడ్జెట్టా!

ఆర్థిక మంత్రి శనివారం పార్లమెంటుకు సమర్పించిన 2025–26 వార్షిక బడ్జెట్ మధ్యతరగతి ప్రజలను ఉద్ధరించే బడ్జెట్‌గా మీడియా, బిజెపి ప్రచారక ప్రతినిధులు రెండ్రోజులుగా ఊదరబెడుతున్నారు. ఆదాయపు పన్ను చెల్లింపు మినహాయింపుకు వార్షికాదాయ పరిమితిని ఒకే గెంతులో రూ. 7 లక్షల నుంచి రూ.12లక్షలకు పెంచటం ఆ ప్రచారానికి ప్రాతిపదిక. రూ.12లక్షల వ్యక్తిగత ఆదాయం వరకు ఒక్కపైసా పన్ను కట్టాల్సిన పనిలేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రకటించగానే ప్రధాని మోదీ సహా బల్లలు అదరగొట్టారు. ఆమె ఆ వెనువెంటనే ప్రకటించిన ఆదాయ శ్లాబుల ప్రకారం రూ.4లక్షల ఆదాయం మించిన దగ్గరనుంచి అంచెలంచెలుగా పెరిగే పన్ను రేట్లను ప్రకటించి గందరగోళానికి తెరతీశారు. ఆదాయపుపన్ను చట్టాన్ని సరళతరం చేస్తూ కొత్త చట్టాన్ని వారం రోజుల్లో సభకు సమర్పిస్తామన్నారు. ఈ లోపు ఢిల్లీ ఎన్నికల ఓటింగ్ ముగుస్తుంది కాబట్టి అప్పుడైనా స్పష్టత వస్తుందో లేదో ! ఆదాయపు పన్ను చెల్లింపుదారుల్లో 80 శాతం పన్ను వలనుండి బయటపడతారని ప్రచారం జరుగుతోంది. ఈ మినహాయింపువల్ల ప్రభుత్వం రూ.1లక్ష కోట్ల ఆదాయం వదులుకుందని, ఇది వస్తువుల కొనుగోలుకు, పొదుపు చేసేందుకు వెసులుబాటు ఇస్తుందని, పెట్టుబడులకు ప్రోత్సాహకంగా పనిచేస్తుందంటున్నారు. మరోవైపున, ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో వచ్చే సంవత్సరం కూడా మందగమనం కొనసాగుతుందని ఎకనామిక్ సర్వే చెప్పింది. 2024లో 8.2శాతంగా ఉన్న జిడిపి వృద్ధి, 2025లో 6.4శాతానికి పడిపోతుందని అంచనా. 2026లో అది 6.3–6.8శాతం మధ్యనే ఉంటుందని సర్వే అంచనా వేసింది. ఇదిలావుండగా, ఆర్థికమంత్రి ఆదివారం నాడు పిటిఐకిచ్చిన ఇంటర్వ్యూలో వచ్చే ఏడాదిలో పన్ను వసూళ్ల లక్ష్యం రూ.26లక్షల కోట్లను చేరుకోవటమే కాదు, మరో రూ.1లక్షకోట్లు అదనంగా జమఅవుతుందని చెప్పారు. పన్నుల జమ లక్ష్యం ఎలా మించుతారో ఆసక్తిదాయకం. రూ.12లక్షల ఆదాయ రేఖను ఒక్క రూపాయి మించినా 4,00,001 రూపాయిలనుంచి శ్లాబుల ప్రకారం పన్ను కట్టాల్సి వుంటుందని ఓ వ్యాఖ్యాత అన్నారు. కాని తలపండిన ఛార్టెడ్ అక్కౌంటెంట్‌లు సైతం స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. రూ.12లక్షలలోపు ఆదాయంపై పైసా పన్ను కట్టాల్సిన పనిలేదంటూ ప్రధానమంత్రి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో మధ్యతరగతులకు భరోసా యిచ్చారు. ఇక ఓట్ల వర్షమే తరువాయి!

> ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురిచేయబడిన కార్మికులు, రైతాంగం బుధవారం దేశవ్యాప్త నిరసన పాటించనున్నారంటే అత్యధిక మెజారిటీ ప్రజల ప్రయోజనాలను బడ్జెట్ విస్మరించినట్లే కదా!

ఏ బడ్జెట్ అయినా ఏ ఒక్క తరగతి ప్రజలకు మాత్రమే మేలు చేయదు. దేశంలో వినిమయం తగ్గి ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడినందున ప్రజల కొనుగోలు శక్తి పెంచటం ప్రాథమిక ఆర్థిక సూత్రం. 2025–26 బడ్జెట్‌లో ప్రధాన ఆర్థిక, సామాజిక, సంక్షేమ రంగాలకు కేటాయింపులను చూస్తే అవి వర్తమాన సంవత్సరం రివైజ్డ్ అంచనాలకు కాస్త అటుఇటుగా ఉన్నాయి. ద్రవ్యోల్బణానికి సర్దుబాటు చేస్తే తగ్గుతాయి కూడా. ధరల నియంత్రణ, ఉపాధి కల్పనను మార్కెట్‌కు విడిచిపెట్టారు. మధ్య, చిన్నతరగతి పరిశ్రమలపై ప్రధానంగా ఆశపెట్టుకున్నారు. రిలయెన్స్ అంబానీ, గౌతమ్ అదానీలాంటి బహుకొద్దిమంది ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారులు తప్ప భారతీయ పరిశ్రమల్లో అనేకం ''లాభాల మాంద్యం''లో ఉన్నాయి. విదేశీ పెట్టుబడిదారులు 'మాంద్యం' ఆందోళనతో స్టాక్ మార్కెట్ నుంచి నిధులు ఉపసంహరించుకుంటున్నారు. ఏ ఒక్క ప్రభుత్వరంగంలోనూ భారీ పెట్టుబడులను ప్రభుత్వం ప్రకటించలేదు. మాంద్యం పరిస్థితులు కనిపిస్తున్నప్పుడు ప్రభుత్వం విరివిగా పెట్టుబడులు పెట్టి ప్రజలకు ఉపాధులు కల్పించి వారిని ఆర్థికంగా నిలబెట్టి తద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వటం కీన్స్ ఆర్థిక సూత్రం. అలా కాకుండా పెట్టుబడుల వృద్ధికి మోదీ ప్రభుత్వం ప్రధానంగా ప్రైవేటు రంగంపై, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యంపై ఆధారపడింది. 2025 ఫిబ్రవరి 3న 30రోజుల సగటు ప్రాతిపదికపై దేశంలో 7.7శాతం నిరుద్యోగం ఉన్నట్లుగా సిఎంఐఇ డేటా తెలుపుతుండగా, 2024 జులై వరకు నిరుద్యోగం 3.2 శాతమే అని బుకాయిస్తే ప్రభుత్వ ఆర్థిక పండితులు సరైన అంచనాలకు ఎలా రాగలుగుతారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురిచేయబడిన కార్మికులు, రైతాంగం బుధవారం దేశవ్యాప్త నిరసన పాటించనున్నారంటే అత్యధిక మెజారిటీ ప్రజల ప్రయోజనాలను బడ్జెట్ విస్మరించినట్లే కదా!

వికసిత్ భారత్ స్వప్నాలకు కేంద్ర బడ్జెట్ నో గ్యారెంటీ

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

లోక్‌సభలో ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025–26 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ వికసిత్ భారత్ కృషిలో భాగంగా అర్థవంతమైన ఉద్యోగాలలో 100శాతం మంది నైపుణ్య కార్మికులు; 100 శాతం నాణ్యమైన, మంచి పాఠశాల విద్య; అందుబాటులో నాణ్యమైన, అందుబాటు ధరలో, సమగ్ర ఆరోగ్యరక్షణ అనే అంశాలను నొక్కి చెప్పారు. అయితే, ఇలాంటి ఆర్భాటపు కార్యక్రమం అనే స్వప్నం సాకారం కోసం తీసుకుంటున్న చర్యలు, కేటాయిస్తున్న నిధులు మోతాదు చాలా తక్కువ.

2025–26లో 10 శాతంగా ఉండనున్న నామమాత్రపు జిడిపి వృద్ధిరేటు ఆధారంగా వనరులను అంచనా వేశారు. జిడిపి వృద్ధి రేటు 2024–25లో ప్రస్తుత ధరల ప్రకారం 9.7శాతం ఉండగా, 2023–24తో పోల్చినప్పుడు వాస్తవ జిడిపి కేవలం 6.4 శాతం మాత్రమే. ఆర్థిక వ్యవస్థ మందగిస్తున్నది అనేది సుస్పష్టం. ఫలితంగా కొత్త ఉద్యోగాల కల్పన కష్టతరంగా మారుతుంది.

కేంద్ర ప్రభుత్వం 2025–26లో ప్రధాన పథకాలకు చేసిన కేటాయింపులను పరిశీలించినట్లయితే, ప్రస్తుత పరిస్థితులలో తక్కువ నిధులతో భారీ మెరుగుదలను దేశ కార్మికులు, ప్రజలు ఆశించలేరు. విద్యారంగానికి 2025–26లో రూ.1,28,650కోట్లు కేటాయించగా, 2024–25లో రూ.1,25,638కోట్లు కేటాయించి, దానికి కోత విధించి రూ.1,14,054కోట్లకు సవరించారు. ఆరోగ్య రంగానికి కూడా ఎక్కువే నిధులేమి ఇవ్వడం లేదు. 2025–26లో రూ. 98,311 కోట్లు కేటాయించగా, 2024–25 బడ్జెట్‌లో రూ.89,287 కోట్లు కేటాయించి, దానిని రూ.88,032 కోట్లకు సవరించారు. ఇదే విధంగా ఆర్థిక మందగమనం నేపథ్యంలో ప్రస్తుత కేటాయింపుల వాస్తవ వ్యయానికి కోత పడే అవకాశం లేకపోలేదు.

కేంద్ర ప్రభుత్వ పథకాల బడ్జెట్ వ్యయం కూడా ఇందుకు మరో ఉదాహరణ. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ ఇచ్చే భారతదేశం లోని ఏకైక పథకం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఈ పథకానికి అచ్చంగా 2024–25 బడ్జెట్ అంచనాలు, సవరించిన అంచనాల మాదిరిగానే 2025–26లో కూడా రూ.86,000 కోట్లే కేటాయించబడ్డాయి. కానీ, 2023–24లో రూ.89,154 కోట్లు ఖర్చయింది.

అయినప్పటికీ నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో అనేక అస్పష్ట వాగ్దానాలను చేశారు. వృద్ధి వేగవంతానికి, సమ్మిళిత అభివృద్ధి సాధనకు, ప్రైవేటు రంగ పెట్టుబడులకు ఉత్తేజం కల్పించేందుకు, భారతదేశంలో ఎదుగుతున్న మధ్య తరగతి వర్గం వినిమయ శక్తిని పెంపొందించేందుకు ప్రయత్నాలను తాజా బడ్జెట్ కొనసాగిస్తుందని పేర్కొన్నారు. అయితే, ఇందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్, సరిపడ నిధులు లేవు.

సమగ్ర బహుళరంగాల 'రూరల్ ప్రాస్పరిటీ అండ్ రిసిలియెన్స్' కార్యక్రమాన్ని రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రారంభించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఇది నైపుణ్యం పెంపు, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, గ్రామీణ ఆర్థిక రంగానికి ఉత్తేజం కల్పించడం వంటి చర్యల ద్వారా వ్యవసాయ రంగంలో తక్కువ ఉపాధి సమస్యను పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో సరిపడ అవకాశాలను సృష్టించడం ద్వారా వలసలు ఒక ప్రత్యామ్నాయమే తప్ప అవసరం కాదనేది దీని ఉద్దేశ్యం. ఇది వాస్తవరూపం దాల్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు, వాటి ఖర్చు పైనే ఆధారపడి ఉంటుంది.

ఎంఎస్ఎంఇ వర్గీకరణను సవరించాలి. దేశవ్యాప్తంగా నమోదైన ఒక కోటి ఎంఎస్ఎంఇల ద్వారా 7.5 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. సామర్థ్యాన్ని భారీగా పెంచుకోవడం, సాంకేతికంగా మెరుగుపరుచుకోవడం, పెట్టుబడి మరింత అందుబాటులోకి రావడమే వర్గీకరణ సవరణ లక్ష్యం. ఇందుకు పెట్టుబడుల పరిమితిని 2.5 రెట్లు, టర్నోవర్ పరిమితిని 2 రెట్లకు పెంచుతారు. మరింత వృద్ధికి, యువతకు మరింత ఉపాధిని సృష్టించేందుకు తాము విశ్వాసం కల్పించామని ప్రభుత్వం భావిస్తుంది. చిన్న వ్యాపారాలకు (మైక్రో ఎంటర్‌ప్రైజెస్) ప్రత్యేకించి రూ.5లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు ప్రవేశపెట్టనున్నారు. వాగ్దానాలను పక్కనపెడితే, కార్మిక ఆధారిత పరిశ్రమల కోసం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా రూ.10వేల కోట్లతో నూతన నిధిని, మొదటిసారి వ్యాపారం చేసేవారికి కొత్త పథకాన్ని ప్రవేశపెట్టనున్నారు.

చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలకు జాతీయ మ్యానుఫాక్చరింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసి, ''మేకిన్ ఇండియా''ను మరింత విస్తృతపరిచి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో విధానపరమైన అందదండలు, రోడ్‌మ్యాప్‌ల అమలు, పరిపాలన, పర్యవేక్షణ కోసం చట్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. మందగమనంతో ఆర్థిక వ్యవస్థకు పరిమితులు ఏర్పడినప్పటికీ ప్రజలపై, ఆర్థిక వ్యవస్థపై, వినూత్నతపై పెట్టుబడి పెడుతున్నట్లు బడ్జెట్ పేర్కొంటోంది.

2024 జులై బడ్జెట్‌లో ప్రకటించిన కార్యాచరణల ఆధారంగా ''మేకిన్ ఇండియా'', ''మేకిన్ వరల్డ్''కు అవసరమయ్యే నైపుణ్యాన్ని యువతలో పెంపొందించేందుకు అంతర్జాతీయ నైపుణ్యాలు, భాగస్వామ్యాలతో ఐదు నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ స్కిల్లింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. భాగస్వామ్యంలో పాఠ్యాంశాల రూపకల్పన, శిక్షకులకు శిక్షణ, నైపుణ్యాల సర్టిఫికెషన్ ప్రక్రియ, నిర్ణీత కాల సమీక్షలు ఉంటాయి.

ఐఐటిల సామర్థ్యం పెంపుదల, రూ.500 కోట్లతో కృత్రిమ మేధ విద్యకోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు, ఐదేళ్ళలో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులలో 75వేల సీట్ల పెంపులో భాగంగా వచ్చే ఏడాది 10 వేల అదనపు సీట్లు వంటి హామీలను బడ్జెట్ ఇచ్చింది.

వచ్చే మూడేళ్ళలో అన్ని జిల్లా ఆసుపత్రులలో డే కేర్ క్యాన్సర్ సెంటర్‌ల ఏర్పాటులో భాగంగా 2025–26లో 200 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. కోటిమంది గిగ్ వర్కర్‌లకు గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన ద్వారా ఆరోగ్య రక్షణ ఇవ్వనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు.

శ్రామిక శక్తి అవసరాలు, ఉద్యోగ కల్పన, సామాజిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం సహా సామాజిక రంగాలలో అవసరాలకు, 2025–26 బడ్జెట్‌లో కేటాయింపులకు అత్యంత భారీ వ్యత్యాసం ఉంది. అన్నిటికి మించి వాస్తవ కేటాయింపులు, వికసిత్ భారత్ పేరుతో దేశ ప్రజలకు చూపిస్తున్న స్వప్నాలకు మధ్య అస్సలేమాత్రం పోలికే లేదు.

(ఐపిఎ సర్వీస్)

పెరగని నిధులు : తగ్గిపోతున్న 'నరేగా' పని దినాలు

వామపక్షాల చొరవతో యుపిఎ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం(నరేగా) పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏటా కుటుంబానికి సగటునవంద రోజుల ఉపాధి గ్యారెంటీ కల్పించాలనే ఈ బృహత్తర కార్యక్రమంతో గ్రామాలలో అటు ఉపాధి, ఇటు ప్రభుత్వానికి ఆస్తులు సమకూరుతున్నాయి. అయితే మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ పథకం పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్నచూపే చూస్తోంది. కరోనా సమయంలో ఈ పథకమే గ్రామీణ భారతానికి ఊపిరిలూదిన విషయం విదితమే. కాని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నిధులు కేటాయించకపోగా, కేంద్రం తగ్గిస్తోంది. ఆ ప్రభావం గ్రామీణ ప్రజలకు కల్పించాల్సిన పనిదినాలపై పడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద కుటుంబానికి సగటు పని దినాలు 44.62 రోజులకు పడిపోయింది. అంతకుముందు (2023–24లో) 52.08 పని దినాలు ఉండేవి. అంతే కాకుండా 2023–24లో ఈ పథకం కింద మొత్తం పని దినాలు 312.37 కోట్లుగా, 2024–25లో 239.67 కోట్లకు పడిపోయింది. ఇందుకు నిధుల కేటాయింపు పెంచకపోవగా, తగ్గించడమే కారణం. ఎన్ఇజిఎ సంఘర్ష్ మోర్చ ఈ వివరాలను విడుదల చేసింది. 2024–25లో నరేగా పథకానికి రూ. 86వేల కోట్లు కేటాయించగా, 2025–26లో కూడా రూ.86వేల కోట్లే కేటాయించారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఈ పథకం కింద రూ.10,223 కోట్లు బకాయిలుగా చెల్లించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రెండు నెలలు మిగిలాయి. తాజాగా ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్‌లో కేటాయించిన రూ.86వేల కోట్లలో సుమారు 20 శాతం వరకు పాత బకాయిల చెల్లింపునకు పోతే, మిగిలేది రూ.70వేల కోట్లుమాత్రమే. దీనిని కూడా ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేస్తే, గత కేటాయింపుల కంటే రూ.4 వేల కోట్లు తక్కువే అవుతుంది. జిడిపిలో నరేగా కేటాయింపు గత ఆర్థిక సంవత్సరంలో 0.26 శాతం ఉండగా, తాజాగా అది 0.24శాతానికి తగ్గిపోయింది. సరిపడ బడ్జెట్ కేటాయించకపోవడంతో వేతన చెల్లింపు బకాయిలు భారీగా పేరుకుపోవడం, గ్రామీణ కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు పెరగడం, పని డిమాండ్‌ను తగ్గించడం, ప్రజలకు పని హక్కును తిరస్కరించడం,సృష్టించే సంపద నాణ్యత తగ్గిపోవడం, గ్రామీణ మౌలిక వసతులు బలహీనమవడం వంటి పరిణామాలు పెరుగుతాయి.

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ అంచనా (కోట్లలో)	సవరించిన అంచనా (కోట్లలో)	వాస్తవ వ్యయం (కోట్లలో)	ఒక్కొక్క ఇంటికి సగటు పనిదినాలు
2020– 21	61,500	1,11,500	1,11,719.55	51.52
2021–22	73,000	98,000	1,06,489.92	50.07
2022–23	73,000	89,400	1,01,120.08	47.83
2023–24	60,000	86,000	1,05,229.4	52.08
2024–25	86,000	86,000	89,488.85(ఫిబ్రవరి 3 వరకు)	44.62

శ్రీలంక సంక్షోభాల అయోమయం

హిందూ మహాసముద్రం, బే ఆఫ్ బెంగాల్ సముద్రాల సరిహద్దులతో ఏర్పడిన ద్వీప దేశంగా భారతదేశ తీరానికి 50కిమీ దూరంలో ఉన్న శ్రీలంక 04 ఫిబ్రవరిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లలో మునిగి ఉన్నది. 1972 వరకు ఈ ద్వీపాన్ని 'సిలోన్'గా పిలవడం జరిగేది. 1948లో పాక్షిక స్వాతంత్ర్యం పొంది, 22 మే 1972లో పూర్తి స్వాతంత్రం పొందిన తర్వాత 1978, 04 ఫిబ్రవరి రోజున బ్రిటీష్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది అధికారికంగా ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంకగా రూపాంతరం చెంది ప్రెసిడెన్షియల్ పార్లమెంటరీ మిశ్రమ వ్యవస్థగా తనదైన రాజ్యాంగంతో అనేక ఒడుదుడుకులు మధ్య నేడు 77వ స్వాతంత్ర్య దినోత్సవాలను 04, ఫిబ్రవరి 2025న నిర్వహించుకోనున్నది. పశ్చిమ ఈశాన్య భారత బెంగాల్, ఒడిసాలో నుంచి వలస వచ్చిన ఆధునిక ఇండో ఆర్యన్ సెట్లర్స్‌ను సింహలీస్ అని పిలవడం జరుగుతున్నది.

శ్రీలంక వైవిధ్యభరిత జనాభా:

ప్రస్తుతం 23.5మిలియన్ల శ్రీలంక జనాభాలో 75శాతం సింహలీస్, 11 శాతం శ్రీలంక తమిళులు, 9 శాతం వరకు ముస్లిమ్ మూర్‌లు 4 శాతం భారత తమిళుల జనాభా ఉన్నది. అత్యధిక సింహలీలు బుద్ధిస్టులుగా, తమిళులు హిందువులుగా రెండు గ్రూపుల మధ్య విభేదాలతో రెండున్నర దశాబ్దాల పాటు ఎల్‌టిటిఇ, అధిక జనాభా ఉన్న సింహలీస్ (ప్రభుత్వ సహకారంతో) మధ్య వర్గ పోరు (1976–2002) కూడా జరగడం, అనేక హింసాత్మక ఘటనలు చేటుచేసుకోవడం, చివరికి ఎల్‌టిటిఈ పోరాటాలను అడ్డుకోవడం, అంతం చేయడం చూసాం. శ్రీలంక ప్రభుత్వాలు, ఆర్థిక సంక్షోభాల నడుమ కొనసాగుతున్న శ్రీలంక ప్రయాణంలో ఆహార, ఇంధన, ఔషధాల కొరతలు కూడా తోడుకావడంతో పలు ప్రజా ఉద్యమాగ్నులు ఎగిసి పడడం చూసాం.

చరిత్ర పుటల్లో శ్రీలంక – సిలోన్:

శ్రీలంక సంస్కృతి, నాగరికతను పరిశీలిస్తే దానిపై బుద్ధిస్టుల, హిందువుల, వలస పాలకుల, జాతి వైవిధ్య, ఆధునిక ప్రపంచీకరణ ప్రభావాలు ప్రస్ఫుటంగా కనుపిస్తాయి. శ్రీలంకలో సామాజిక పరంగా కులమత వ్యవస్థలు భారతదేశంలో ఉన్నట్లుగానే కనిపిస్తాయి. 16వ శతాబ్దంలో శ్రీలంక తీరప్రాంతాలు పోర్చుగీస్ అధీనంలో, 17వ శతాబ్దంలో డచ్‌ల అధీనంలో పాలన కొనసాగింది. 1796 నుంచి ఈ ద్వీప ప్రాంతం బ్రిటీష్ అధీనంలోకి క్రమంగా మారడం, 1833లో పూర్తిగా బ్రిటీష్ పాలన పగ్గాలు పట్టి ఈ ద్వీపానికి 'సిలోన్'గా నామకరణం చేసి వలస పాలన వలస పాలన 1948 వరకు కొనసాగడం చూసాం. సిలోన్ ప్రాంతం 1972లో శ్రీలంక రిపబ్లిక్‌గా పేరు మారడం, 04 ఫిబ్రవరి 1948న పూర్ణ స్వతంత్రం పొందిన తనదైన రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్య సామ్యవాద గణతంత్ర శ్రీలంకగా రూపాంతరం చెందడం జరిగింది. శ్రీలంక రాజధానిగా 'శ్రీ జయర్ధనేపుర కొట్టె (కొలంబో)' పాలన కేంద్రంగా పనిచేస్తున్నది. 2022లో నాటి అధ్యక్షుడు గొటబాయ రాజపక్సే పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేయడంతో ప్రభుత్వం రాజీనామా చేయవలసివచ్చింది. శ్రీలంక అధ్యక్షుడిని ఎన్నిక ద్వారా ఎంచుకోవడంతో పాటు 225 మంది కలిగిన లెజిస్లేటివ్ పార్లమెంట్ ద్వారా ప్రధానమంత్రిని ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అధ్యక్షుడిగా 'అరుణ కుమార దిసనాయకె', ప్రధానిగా 'హరిణి అమరసూర్య'లు సేవలు అందిస్తున్నారు. గతంలో దీర్ఘకాలం పాటు శ్రీలంకకు పెద్దన్న వలె నిలిచింది మన భారత్. ప్రస్తుత డిజిటల్ యుగంలో మారుతున్న సమీకరణాల ఆధారంగా ఆర్థిక చేయూత బూచీ చూపుతూ చైనా నాయకత్వం శ్రీలంకను మచ్చిక చేసుకోవడం చూస్తున్నాం.

2025, ఫిబ్రవరి 04న శ్రీలంక జరుపుకుంటున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవం–2025 ఇతివృత్తంగా 'జాతీయ పునరుజ్జీవనానికి ఐక్యం అవుదాం' అనే అంశాన్ని తీసుకొని ఘనంగా నిర్వహించుకోవడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకల్లో రాజధాని కేంద్రంగా జాతీయ పతాకాన్ని ఎగరేయడం, ఆకర్షణీయ రక్షణ దళాల కవాతులు, సంస్కృతి సంప్రదాయాల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ ఘన కీర్తిని చాటే ప్రదర్శనలు లాంటివి అనేకం నిర్వహిస్తారు. అనేక సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంక రానున్న రోజుల్లో శాంతియుతంగా ప్రగతి పథాన స్థిరంగా అడుగులు వేయాలని కోరుకుందాం,పొరుగు దేశవాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేద్దాం.

(04, ఫిబ్రవరి శ్రీలంక స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

అణగారిన వర్గాల చైతన్య రవికిరణం...మఖ్దూం

కార్మిక, శ్రామిక, పీడిత వర్గాల చైతన్య రవికిరణం, విప్లవోద్యమ అగ్నికణం, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, షాయిరే ఇంక్విలాబ్, షాయిరే తెలంగాణ అని ప్రసిద్ధిగాంచిన ఉర్దూ మహాకవి మఖ్దూం మోహియుద్దీన్. మఖ్దూం పూర్వీకులు ఉత్తరప్రదేశ్ నుండి హైదరాబాద్ సంస్థానానికి వచ్చి స్థిరపడ్డారు. 1908 ఫిబ్రవరి 4న సంగారెడ్డి జిల్లా ఆందోల్ గ్రామంలో మఖ్దూం జన్మించాడు. అతని పూర్తి పేరు అబూ సయ్యద్ మహమ్మద్ మోహిద్దీన్ ఖాద్రి. అతని తండ్రి గౌస్ మోహియుద్దీన్, తల్లి ఉమ్దా బేగం.



ఫిబ్రవరి 4 మఖ్దూం మోహియుద్దీన్ జయంతి

మఖ్దూం బాల్యమంతా కష్టాలు, కన్నీళ్ళతో గడిచింది. అతని నాలుగేళ్ల వయసులో తండ్రి చనిపోయాడు. తల్లి మరొకరిని పెళ్లి చేసుకుని వెళ్ళిపోయింది. మఖ్దూం చిన్నాయన బషీరుద్దీన్ వద్ద చేరాడు. హైదరాబాదులోని ధర్మవంత్ పాఠశాలలో ప్రాథమిక విద్యను, సంగారెడ్డిలో మాధ్యమిక విద్యను పూర్తి చేశాడు. పేదరికం కారణంగా మఖ్దూం విద్యార్థి దశలోనే బతకడానికి సినిమా తారల ఫోటోలు, పెయింటింగ్స్ అమ్మేవాడు. ట్యూషన్లు చెప్పేవాడు, పత్రికా కార్యాలయాల్లో పనిచేసేవాడు. ఆ విధంగా కష్టపడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరి ఎం.ఏ ఉర్దూ పూర్తి చేశాడు. ఆ తర్వాత సిటీ కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. మఖ్దూం చదువుకునే రోజుల నుంచే కవిత్వం, నాటకం, నటనలపై ఆసక్తిని కనబరిచేవాడు. యూనివర్సిటీ విద్యార్థిగా ఉన్నప్పుడు అక్కడకు విచ్చేసిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ముందు జార్జ్ బెర్నార్డ్ షా రాసిన నాటకాన్ని 'హోష్ కే నా ఖూన్' అనే పేరుతో అనువదించి ప్రదర్శించి ప్రశంసలు పొందాడు. ఉర్దూ నాటకాలపై పరిశోధన చేశారు. ఆయన రాసిన కవితలు, గేయాలు, గజల్స్‌ను సుర్ఖ్ సవేరా (అరుణోదయం), గులెతర్(తాజాపువ్వు), బిసాతెరెక్సు (నాట్య వేదిక) పేరిట మూడు సంపుటాలుగా వెలువరించాడు.

ప్రముఖ అధ్యాపకుడు, ఉర్దూ కవి మఖ్దూం 'షాయిరే ఇంక్విలాబ్' (ఉద్యమ కవి, విప్లవ రచయిత)బిరుదాంకితుడు. కవియేగాక నాటక కర్త, గాయకుడు, నటుడు కూడా. ఇతని గజల్‌లు, పాఠ్యాంశాలలోను, సినిమాలలోనూ ఉపయోగించారు. అతను రాసిన 'ఏ జంగ్ హై జంగే ఆజాదీ' 'ఏక్ చంబేలీ కె మండ్వేతలే' అనే గీతాలు ప్రసిద్ధి పొందాయి. ఉర్దూ మహాకవిగా ప్రపంచాన్ని ఉర్రూతలూగించాడు.

ప్రగతిశీల అభ్యుదయ భావాలు కలిగిన మఖ్దూం మొదట్లో ప్రేమ కవితలు రాసినా తర్వాత ఉద్యమ కవితలు రాశాడు. నిజాం నిరంకుశ పాలనపై, దోపిడీ వ్యవస్థపై పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడై పార్టీలో చేరాడు. పార్టీకి హైదరాబాద్ తొలి కార్యదర్శి అయ్యాడు. చంద్ర రాజేశ్వరరావు, గులాం హైదర్, రాజబహదూర్ గౌర్ వంటి కమ్యూనిస్టు యోధులతో కలిసి పనిచేశాడు. హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్, కామ్రేడ్స్ అసోసియేషన్, నిజాం స్టేట్ రైల్వే ఎంప్లాయిస్ యూనియన్ వంటి అనేక సంఘాలను స్థాపించి వాటికి అధ్యక్షుడిగా, కార్యదర్శిగా ఉంటూ ఆయా వర్గాల్లో చైతన్యం తీసుకువచ్చాడు. నిజాం నిరంకుశ భావాలకు తలొగ్గి ఎటువంటి హక్కులు లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్న ఉపాధ్యాయులందరినీ ఏకం చేసి హైదరాబాద్ స్టేట్ టీచర్స్ యూనియన్ (నేటి రాష్ట్రోపాధ్యాయ సంఘం) స్థాపించాడు. వారి సంక్షేమంకోసం కృషి చేశాడు. ఆ పోరాటక్రమంలో తన ఉద్యోగాన్ని వదులుకున్నాడు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకు జైలుపాలయ్యాడు. చిత్రహింసలకు గురైనాడు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అజ్ఞాత జీవితం గడిపాడు. సాయుధ పోరాట ఉధృతిని తెలుపుతూ 'అడవుల కొండల అనుంగు బిడ్డలు/పొలాల పొత్తిట పెరిగిన పాపలు/లేచిన క్రోదోద్ధత భీకరులై/తళతళ మెరిసెనె కొడవలి/ఎగిసి ఎగిసి నర్తించే నాగలి' అంటూ తెలంగాన్ అనే గేయకవితను రాశాడు. 'సారా సంసార్ హమారా హై .. ప్రపంచమంతా మేమే, ప్రపంచమంతా మాదే' అంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మిక, శ్రామిక, పేద వర్గాల బాధ ఒకటేనని.. తామంతా ఒకటేనని చాటాడు.

తన జూనియర్, హాస్టల్ మేట్ ఒకతను ఎప్పుడూ పచ్చ శాలువా కప్పుకుని తిరుగుతూ ఉండేవాడు. ఓ రోజు అతని శాలువాను

తొక్కిసలాటపై పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసన

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ప్రయోగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో మౌని అమావాస్య రోజున జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు లేవనెత్తాయి. సోమవారం ఉదయం సభలు ప్రారంభమైన వెంటనే పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఈ అంశంపై చర్చ చేపట్టాల్సిందేనని విపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. రాజ్యసభలో చర్చకు చైర్మన్ అనుమతించకపోవడంతో సభ నుండి వాకౌట్ చేశారు. ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం, బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత తొలిసారి సోమవారం లోక్‌సభ, రాజ్యసభలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభలో కాంగ్రెస్ నేతృత్వంలో ప్రతిపక్ష ఎంపిలు తమ స్థానాల్లో నుంచి లేచి నిలబడి మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత వెల్‌లోకి వెళ్లి గందరగోళం సృష్టించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్‌సభలో కాంగ్రెస్‌పక్ష ఉపనేత గౌరవ్ గగోయ్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఇతర ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నోత్తరాలను రద్దు చేసి తొక్కిసలాటపై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. సనాతన వ్యతిరేక ప్రభుత్వం గద్దెదిగాలంటూ నినదించారు. ఈ నేపథ్యంలో సభ్యుల ప్రవర్తనను లోక్‌సభ స్పీకర్ తప్పుబట్టారు. మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ విరగగొట్టేందుకు ప్రజలు గెలిపించలేదని, బల్లలు పగలగొట్టడానికే ఇక్కడికి వస్తే వాటిని ఇంకా కొట్టండి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాలశాఖమంత్రి కిరణ్ రిజిజు కూడా ప్రతిపక్ష ఎంపిల ఆందోళనను ఖండించారు. తొక్కిసలాటలో ఎంత మృతి చెందారో జాబి తా వెల్లడించాలని ప్రతిపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. అయితే సభ్యులు తమ సమస్యలను రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానం చర్చ సందర్భంగా లేవనెత్తవచ్చని స్పీకర్ పదే పదే ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి కూడా మహాకుంభ విషయాన్ని ప్రస్తావించారని, అందువల్ల చర్చ సందర్భంగా ఈ అంశాన్ని లేవనెత్తవచ్చన్నారు. ముఖ్యమైన సమస్యలపై చర్చించాల్సి ఉన్నందున ముందు ప్రశ్నోత్తరాలను చేపడుతామని చెబుతూ సభకు అంతరాయం కలిగించవద్దన్నారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్ష సభ్యులు సభకు అనుమతివ్వాలన్నారు. అయినప్పటికీ ప్రతిపక్ష ఎంపిలు తమ ఆందోళను కొనసాగించారు. నినాదాలు చేశా రు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రశ్నోత్తరాలు మొత్తం కూడా విపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని సభకు అంతరాయం కలిగించకుండా ఉండేందుకు తీర్మానం చేస్తామని హెచ్చరించారు. ఈ సారి సభను సజావుగా నడుపుతుందామని చెప్పారు. కాగా, ప్రశ్నోత్తరాలు ముగిసిన వెంటనే కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎన్‌సి సహా ఇతర ప్రతిపక్ష సభ్యులు సభను కొద్దిసేపు వాకౌట్ చేశారు. ఆ తరువాత తిరిగి సమావేశాలకు హాజరయ్యారు. సభ 18 ప్రశ్నలను చేపట్టగా, మంత్రులు స్వల్పంగా సమాధానాలిచ్చారు. సాధారణంగా రోజుకు 20 ప్రశ్నలు చేపడతారు.

రాజ్యసభలోనూ ఆందోళనలు

ఇదిలా ఉండగా, కుంభమేళాలో తొక్కిసలాట అంశంపై తక్షణమే చర్చ జరపాలని డిమాండ్ చేసఅటు రాజ్యసభలోనూ ప్రతిపక్ష ఎంపిలు ఆందోళనకు దిగారు. అయితే చైర్మన్ వారి డిమాండ్‌కు అనుమతించలేదు. దీంతో సభ్యులు సభ వాకౌట్ చేశారు. సభను ప్రారంభమైన వెంటనే చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ 267 నిబంధన కింద సభా కార్యక్రమాలను రద్దు చేయాలని తనకు 9 నోటీసులు అందాయన్నారు. ప్రమోద్ తివారీ, దిగ్విజయ్‌సింగ్ (కాంగ్రెస్, సాగరికా ఘోష్ (టిఎంసి), జావెద్ అలీ, రాంజీ లాల్ సుమన్ (సమాజ్‌వాది పార్టీ), జాన్ బ్రిట్టాస్ (సిపిఐ)లు నోటీసులు అందజేశారు. వీరిచ్చిన నోటీసులను చైర్మన్ తిరస్కరించారు. పలువురు ప్రతిపక్ష ఎంపిలు నినాదాలు చేస్తూ కుంభమేళా తొక్కిసలాట ఘటనను లేవనెత్తేందుకు ప్రయత్నంచారు. తరువాత వారు సభను వాకౌట్ చేశారు.

సంపద పన్ను వేసి ఆదాయాలు పెంచండి

సామాన్యులపై ప్రతాపం చూపించొద్దు మోదీ ప్రభుత్వానికి పది కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

రేపు దేశవ్యాప్త బడ్జెట్ వ్యతిరేక నిరసనల్లో పాల్గొనాలని ప్రజలకు పిలుపు

న్యూఢిల్లీ : కార్మికులు, పేదలు, సామాన్య ప్రజలపై పన్ను లభారం మోపి ప్రతాపం చూపించవద్దని పది కేంద్ర కార్మిక సంఘాలు సోమవారంనాడు నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని కోరాయి. కార్పొరేట్ పన్ను, సంపద పన్ను, బహుమతి పన్ను వంటివి విధించి దేశంలో ఆదాయాలు గణనీయంగా పెంచాలనీ కోరాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక–కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసన తెలియజేస్తూ ఈనెల 5వ తేదీన జాతీయస్థాయిలో తలపెట్టిన కార్యక్రమంలో సామాన్య ప్రజలు భాగస్వామ్యం కావాలని పది కేంద్ర కార్మిక సంఘాలతో కూడిన ఐక్యవేదిక పిలుపు ఇచ్చింది. భిన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహించే స్వతంత్ర సమాఖ్యలు, సంస్థలు కూడా ఈ ఐక్యవేదికలో భాగంగా ఉన్నాయి.

సామాన్య ప్రజలపై పరోక్ష పన్నులు, సుంకాలు విధిస్తే వారిపై అదనపు భారాలు పడి వారి జీవితాలు దుర్భరం అవుతాయని దానికి బదులుగా దేశంలో ఉన్న సంపన్నులు, బడా పారిశ్రామికవేత్తలపై కార్పొరేట్ పన్ను, సంపద పన్ను, బహుమతి పన్ను విధించడం ద్వారా ఆదాయాలు పెంచుకోవాలని కోరాయి. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి సంఘాలు సోమవారంనాడు ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

వ్యాపారాన్ని సులభతరం చేయాలనే పేరుతో ప్రభుత్వం యాజమాన్య అనుకూల విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ వారిని అణచివేసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని, ఇది కార్పొరేట్‌శక్తుల ఏకస్వామ్య ఆధిపత్య ప్రయోజనాలకు ఉపయోగపడతాయని, లోక్‌సభలో ప్రవేశపెట్టిన 2025–26 బడ్జెట్ ఈ విధానాలనే ప్రతిబింబించిందని కేంద్ర కార్మిక సంఘాలు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

చట్టవిరుద్ధమైన, న్యాయవిరుద్ధమైన చర్యలకు పాల్పడినప్పటికీ వాటిని చట్టబద్ధం చేసేందుకు, ఉల్లంఘనలకు పాల్పడితే అధికారికంగా మినహాయింపులు ఇవ్వడం వంటి బడ్జెట్‌లో ప్రతిపాదించిన యాజమాన్య అనుకూల విధానాలు వాస్తవానికి దేశంలో కార్మిక సంఘాలను బలహీనపరచడానికేనని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కార్మికుల కష్టాలను, వారి డిమాండ్లను ప్రభుత్వందృష్టికి, చట్టం దృష్టికి తీసుకువచ్చేందుకు దేశవ్యాప్తంగా 57 కోట్ల మంది శ్రమజీవులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక ఉద్యమాన్ని, వారి పోరాటాలను అణచివేసేందుకు బడ్జెట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'డీక్రిమినలైజేషన్ ప్రావిజన్స్‌ను, ఉల్లంఘనలకు మినహాయింపులను ప్రతిపాదించారని కేంద్ర కార్మిక సంఘాలు విమర్శించాయి. కార్మికులకు అన్యాయం జరిగితే ప్రశ్నించకుండా తనిఖీ వ్యవస్థను నామరూపాలు లేకుండా చేసేందుకు పగ–ప్రతీకారాలను కొనసాగించడమే ప్రభుత్వ ఎజెండాగా మారిందని విమర్శించాయి.

బిజెపి 'అక్రమాల' నమోదుకు స్పై కెమెరాలు పంచాం

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ బుధవారం జరగనుండగా, బిజెపి, ఆ పార్టీ 'గూండాల' 'తప్పుడు పనులు, ఎన్నికల అక్రమాల'ను నమోదు చేయడానికి మురికివాడల్లో ప్రజలకు స్పై కెమెరాలు, బాడీ కెమెరాలను తమ పార్టీ పంచిందని ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ సోమవారం వెల్లడించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు కేజ్రీవాల్ ఒక వీడియో సందేశం విడుదల చేస్తూ, ఆప్ చరిత్రాత్మక విజయం సాధించబోతున్నదని, బిజెపి తన ఆవిర్భావం తరువాత అత్యంత దారుణ పరాజయం ఎదుర్కొనబోతున్నదని, అందుకే అది 'అక్రమ ఎత్తుగడలకు' పూనుకుంటున్నదని పేర్కొన్నారు. బిజెపి గూండాల దుష్కృత్యాలను ఫోటోలు తీయడానికి గాను మేము మురికివాడల వాసులకు స్పై కెమెరాలు, బాడీ కెమెరాలు పంచాం. మేము పలు శీఘ్ర స్పందన బృందాలు (క్యుఆర్‌టిలు) కూడా ఏర్పాటు చేశాం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అడ్డుకోవడానికి, ఆ దుండగులు అరెస్టయ్యేలా చూడడానికి వారు పావు గంటలోగా అటువంటి ప్రదేశాలకు చేరుకుంటారు' అని ఆప్ చీఫ్ తెలిపారు. 'ఎన్నికల్లో విజయం కోసం బిజెపి తమ గూండాలను, ఢిల్లీ పోలీసులను విస్తృతంగా ఉపయోగించుకుంటుంది. వారు వోటర్లను, ముఖ్యంగా మురికివాడల్లోని వారిని బెదిరించే యత్నం చేస్తారు' అని ఆయన ఆరోపించారు. బిజెపి కార్యకర్తలు మురికివాడల వాసులకు రూ. 3000 నుంచి రూ. 5000 వరకు ఇవ్వజూపి, ఎన్నికల రోజు వారిని వోటు చేయనివ్వకుండా నివారించేందుకు నల్ల ఇంకుతో వారి వేళ్లపై ముద్ర వేయజూస్తారని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'వారి డబ్బు తీసుకోండి, కానీ మీ వేలిపై ఇంకు ముద్ర వేయనివ్వకండి' అని ఆయన వోటర్లకు విజ్ఞప్తి చేశారు.

సిఇసికి బిజెపి ఆఫర్..?

అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరి కొద్ది గంటల్లోనే ముగియాల్సి ఉన్న తరుణంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. బిజెపికి సిఇసి లొంగిపోవడం చూస్తుంటే ఎన్నికల కమిషన్ తన అస్థిత్వం కోల్పోయినట్టు కనిపిస్తోందని అన్నారు. ఈ నెలాఖరులతో సిఇసి రిటైర్ అవుతుండటంతో ప్రజల మనసుల్లో ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. 'రిటైర్మెంట్ తరువాత ఆయనకు ఏ పోస్ట్ ఆఫర్ చేశారు, గవర్నర్ పోస్టా, రాష్ట్రపతి పోస్టా? ఏ పోస్ట్ కావచ్చు?'' అని మీడియాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ అన్నారు. 'రాజీవ్ కుమార్‌ను ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను. మీ బాధ్యతలను మీరు న్యాయబద్ధంగా నిర్వర్తించండి. పదవి కోసం పాకులాడవద్దు. మీ పదవీకాలం చివర్లో దేశాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయవద్దు'' అని కేజ్రీవాల్ కోరారు.

కుంభమేళాలో తొక్కిసలాట ఘటన

దురదృష్టకరం..

పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : మౌని అమావాస్య సందర్భంగా మహాకుంభమేళాలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ ఘటన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. గత నెల 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా మహాకుంభమేళాలో తొక్కిసలాట ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోగా.. 60 మంది గాయపడ్డారు. అయితే, ఈ తొక్కిసలాటను నిరోధించడంలో యోగి సర్కార్ విఫలమైందంటూ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. 30 మంది ప్రాణాలను బలిగొన్న తొక్కిసలాట ఘటన దురదృష్టకరమని, నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన యూపీ అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. దేశ వ్యాప్తంగా వచ్చే భక్తుల భద్రత విషయంలో ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ పిల్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఇది దురదృష్టకరమైన ఘటన అని పేర్కొంది. ఈ ఘటనపై అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలంటూ పిటిషనర్ విశాల్ తివారీకి ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా సూచించారు. మరోవైపు తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణ కొనసాగుతోందని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ధర్మాసనానికి తెలిపారు.

బ్యాలెట్ పేపర్‌కే సై

మహారాష్ట్రలో గ్రామ పంచాయతీ తీర్మానం

పుణె : మహారాష్ట్రలోని సంగ్లి జిల్లాలోని ఒక గ్రామ పంచాయతి భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌కే ప్రాధాన్యమిస్తూ తీర్మానం చేసింది. వాల్వ తహసీల్‌లోని బాహె గ్రామ పంచాయతీ ఈవిఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)కు బదులు బ్యాలెట్ పేపర్‌నే ఇకపై ఎన్నికలలో ఉపయోగించాలని తీర్మానించింది. కాగా కరద్ (సౌత్) నియోజకవర్గంలోని కోలెవాడి గ్రామ పంచాయతీ కూడా గత డిసెంబర్‌లో బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌కే ప్రాధాన్యమిస్తూ తీర్మానించినట్టు ఆలస్యంగా వెలుగుచూసింది. 'భవిష్యత్ ఎన్నికలలో బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు బాహె గ్రామ సభ తీర్మానించింది. ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్‌ను వినియోగానికి ఆమోదం తెలిపారు. ఇతర గ్రామ పంచాయతీలను కూడా ఈ మేరకు తీర్మానాలు చేయాల్సిందిగా అభ్యర్థించాం. మా తీర్మానం నకలును తహసీల్దారుకు అందజేశాం. రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజాస్వామ్యం మనుగడకు ఈ మేరకు తీర్మానించాం' అని గ్రామ సభ సభ్యుడు ఒకరు తెలిపారు. గత నవంబరులో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఈవీఎంలను టాంపరింగ్ చేయడం ద్వారా బిజెపి విజయం సాధించిందని ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ తీర్మానం చేసినట్టు బాహె గ్రామ సభ వివరించింది.

కేంద్రానికి వ్యతిరేకంగా జెఎంఎం తీర్మానం

సిఎఎ, యుసిసి, ఎన్ఆర్‌సిలకు జార్ఖండ్ 'నో'

దుంకా(జార్ఖండ్) : కేంద్రప్రభుత్వ ప్రతిపాదిత పౌరసత్వ సవరణ బిల్లు(సిఎఎ), ఏకరీతి పౌర స్మృతి(యుసిసి), రాష్ట్రాలలోజాతీయ పౌరసత్వ నమోదు(ఎన్ఆర్‌సి) అంశాలను వ్యతిరేకిస్తూ జార్ఖండ్ ముక్తి మోర్చా(జెఎంఎం) తీర్మానాన్ని ఆమోదించింది. పార్టీ 46వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి గాంధీ మైదానంలో జరిగిన కార్యక్రమంలో జెఎంఎం 50 అంశాలతో కూడిన తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్రం ప్రతిపాదించిన పై మూడు అంశాలు అమలు చేసేందుకు జెఎంఎం పూర్తిగా వ్యతిరేకిస్తూ తీర్మానించింది. ఛోటా నాగపూర్ టెనెన్సీ చట్టం(సిఎన్‌టి), సంతాల్ పరగణ టెనెన్సీ(ఎస్‌పిటి) చట్టాలను రాష్ట్రంలో ఖచ్చితంగా అమలు చేయాలని, అంతేగాక రాష్ట్రానికి చెల్లించాల్సిన 1.36 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని జెఎంఎం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని కేంద్రాన్ని దుయ్యబట్టారు. కొంత మంది బూర్జువా మనస్తత్వ నేతలకు గిరిజన ప్రాబల్యమున్న జార్ఖండ్ రాష్ట్రం స్వశక్తిపై నిలబడేందుకు ఇష్టం లేదని, ఖనిజ ఒనరులతో అలరారుతూ కేంద్ర ఖజానాకు అధిక మొత్తాలను సమకూర్చే జార్ఖండ్ రాష్ట్రం ఇంకా వెనుకబాటు తనానికి గురవుతున్నదని విమర్శించారు. కేంద్రం అన్ని రాష్ట్రాలను సమదృష్టితో చూడాలని, ముఖ్యంగా వెనుకబడిన రాష్ట్రాలకు తోడ్పాటు ఇవ్వాలన్నారు. కేంద్ర బడ్జెట్ ధనిక రాష్ట్రాలకు అనుకూలంగా ఉందని, పేద రాష్ట్రాలు తమ హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఆదాయ పన్నులో కొంత రాయితీ కల్పించినప్పటికీ ద్రవ్యోల్బణం రాకెట్‌లా దూసుకుపోతోందని, జిఎస్‌టిలో సైతం ఎలాంటి మార్పు లేదని సోరెన్ అన్నారు. గరీబ్, యువ, అన్నదాత, నారి పథకాల ద్వారా కేంద్రం రుణాల ద్వారా ఆదుకునేందుకు హామీ ఇస్తోందని, నిధుల కేటాయింపులో మొండిచేయి చూపుతోందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 రూపాయల సహాయం అందిస్తున్న తొలి రాష్ట్రం జార్ఖండ్ అని సోరెన్ వెల్లడించారు. ఈ విధానాన్ని బిజెపి 'తాయిలాలు'గా నిందలు మోపుతోందని, ఢిల్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి ఉచితాలను ప్రకటించడం తాయిలాలు కాదా అని సోరెన్ ప్రశ్నించారు. ఉచితాలపై తమను విమర్శించే బిజెపి ఢిల్లీ ఎన్నికలలో అదే విధానాన్ని అనుసరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తాము చేస్తే ఒప్పు, ఇతరులు చేస్తే తప్పు అనుకోవడం బిజెపి ద్వంద్వ విధానాలకు నిదర్శనం అని పేర్కొన్నారు.

ఢిల్లీ ఎన్నికలకు భద్రత పెంపు

150 కంపెనీల పారామిలటరీ సిబ్బంది మోహరింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం భద్రతను పెంచారు. 150 కంపెనీల పారా మిలటరీ సిబ్బందిని దేశ రాజధానిలో మోహరించినట్టు ఎన్నికల అధికారి ఒకరు వెల్లడించారు. బుధవారం జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు భద్రతను పటిష్టం చేసేందుకు పారా మిలటరీ బలగాలను మోహరించినట్టు ఎన్నికల సెల్ ఇన్‌చార్జి దేవేష్ చంద్ర శ్రీవాస్తవ వెల్లడించారు. ఎన్నికల కోసం ఢిల్లీ పోలీసు యంత్రాంతం అప్రమత్తమైందని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లన్నీ సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో పెద్దమొత్తంలో నగదు, మద్యం, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. దాదాపు 3వేల సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించామని, వాటి పరిధిలో డ్రోన్ల అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ చేయనున్నట్టు వెల్లడించారు. అంతేగాక సత్వర స్పందన దళాల(క్యుఆర్‌టి) సహకారంతో శాంతి భద్రతలను పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. గత నెలలో దేశ రాజధానిలో ఎన్నికల సందర్భంగా భద్రత ఏర్పాట్లపై ఢిల్లీ పోలీసు ఉన్నతాధికారులు అంతర్రాష్ట్ర భద్రతా దళాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఢిల్లీ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, బిహార్, రాజస్థాన్, చండీగఢ్, జమ్ము కశ్మీర్‌కు చెందిన పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎన్నికల సందర్భంగా 150 కంపెనీల పారా మిలటరీ దళాలతోపాటు 30వేల మంది ఢిల్లీ పోలీసు సిబ్బంది ఎన్నికల విధులలో పాల్గొననున్నట్టు మరో అధికారి తెలిపారు. ఎన్నికల సందర్భంగా సంఘ వ్యతిరేక శక్తులు, ఉగ్రవాద శక్తులను నిలువరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఎన్నికల నియ మావళి అమలులోకి వచ్చిన తరువాత వెయ్యికిపైగా కేసులు నమోదైనట్టు ఢిల్లీ పోలీసు యంత్రాంగం తెలిపింది. వివిధ కేసులకు సంబంధించి 33 వేలకుపైగా కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఇంటెలిజెన్స్ అందించిన సమాచారం మేరకు సరిహద్దు ప్రాంతాలలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అన్ని జిల్లాల డిసిపిలు, సీనియర్ పోలీసు అధికారులను అప్రమత్తం చేసినట్టు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్టు డిప్యూటి కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో ప్రతి రోజు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు పోలీసు అధికారులు తెలిపారు.

ఉచితాలపై విచారణకు తొందరలేదు

ఎన్నికల పిల్‌పై హైకోర్టు అభిప్రాయం

న్యూఢిల్లీ : దేశ రాజధాని అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు అందించే ఉచి తాలు, నగదు పథకాలపై వెంటనే విచారణ చేపట్టాలన్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. దీనిపై సత్వర విచారణకు ఆదేశించాలని దాఖలైన పిల్‌ను పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావ్ గెడెల ఆధ్వర్యంలోని ధర్మా సనం విచారణపై పైవిధంగా స్పందించింది. ఈ పిల్‌ను సాధారణ రీతిలోనే లిస్ట్ అయిన ప్రాధాన్యంలోనే విచారిస్తామని తెలిపింది. పిటిషనర్ ఎస్.ఎన్.ఢింగ్రా తరఫున న్యాయవాది కేసును సత్వరమే మధ్యాహ్నం 2 గంటలకు లిస్టింగ్ చేయాలన్న అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. 'రాజకీయ పార్టీలు ఉచితాలను పంచడాన్ని మీరు చాలెంజ్ చేస్తున్నారా? నేడో.. రేపో ఎన్నికల ప్రచారం ముగుస్తున్న తరుణంలో ఇప్పటికే పంచిన ఉచితాలపై సత్వర విచారణ చేపట్టాల్సిన అవసరం ఏముంది? ఇప్పటికే ఉచితాలను, నగదు పథకా లను ఓటర్లకు అందజేసి ఉంటారు. ఇటువంటి తరుణంలో సత్వర విచారణ అవసర మేముంది' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసును లిస్టింగ్ ప్రకారం ప్రాధాన్య క్రమంలో విచారిస్తామని తెలిపింది. రాజకీ య పార్టీలు ఉచితాలను అందించడం సుప్రీంకోర్టు న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందని పిటిషనర్ ఢింగ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా భోజన విరామానంతరం ఈ పిటిషన్‌ను ఫిబ్రవరి 4వ తేదీన లిస్టింగ్ చేయాలన్న మరో సీనియర్ అభ్యర్థనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఉదయం వచ్చిన అభ్యర్థనపై అభిప్రాయం తెలిపిన తరువాత మరోసారి అదే కేసుపై అభ్యర్థన చేయడంలో అర్థం లేదని, ఇంతకు మించి తాము చెప్పేదేమీ లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం జరు గనుండగా, ఫలితాలు 8వ తేదీన వెల్లడి కానున్నాయి. 'సమయ్ యాన్(సశక్త్ సమాజ్) సంస్థ అధ్యక్షుడిగా పిటిషన్‌లో పేర్కొన్న ఢింగ్రా ఎన్నికల నేపథ్యంలో ఆప్ పార్టీ ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన, బిజెపి పార్టీ మహిళా సమృద్ధి యోజన, కాంగ్రెస్ పార్టీ ప్యారీ దీది యోజన పథకాల కింద అందిస్తున్న నగదు ప్రయోజనాలు ఎన్నికల నియమావళికి విరుద్ధమని, ఎన్నికల హామీల ముసుగులో అందిస్తున్న లంచాలని ఆరోపించారు. ఎన్నికల వేళ రాజ కీయ పార్టీలు చేసే హామీలు, అందించే సంక్షేమ పథకాలు, నగదు ప్రయోజనాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని, వాటిని నిలుపుదల చేయాలని ఎన్నికల కమిషన్ పదేపదే చెపుతున్న విషయాన్ని ఢింగ్రా తన పిటిషన్‌లో ప్రస్తావించారు. నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు, అభ్యర్థుల మధ్య స్నేహపూర్వక పోటీతత్వాన్ని నెలకొల్పేందుకు ఉచితాలపై నియంత్రణ ఉండాలని తన అభ్యర్థనలో పేర్కొన్నారు. నగదు పథకాలు రాజ్యాంగ విరుద్ధమని, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహ ణకు విఘాతమని ప్రకటించాలని కోరారు. ఈ విధానాలు ఎన్నికల ప్రభావితాలుగా వర్గీకరించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. అదే విధంగా రాజకీయ పార్టీలు ఓటర్లకు సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడంపై కూడా పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఖర్గే వ్యాఖ్యలపై రాజ్యసభలో కలకలం

కుంభమేళా తొక్కిసలాటపై వాదోపవాదాలు

న్యూఢిల్లీ : కుంభమేళా తొక్కిసలాటలో వేలాది మంది చనిపోయారన్న ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు రాజ్యసభలో కలకలం రేపాయి. జనవరి 29న పుణ్య స్నానాల సందర్భంగా వేలాదిమంది భక్తులు చనిపోయారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి. రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్‌కర్ సైతం ఖర్గే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ వేలాదిమంది చనిపోయారన్నది తన అంచనా మాత్రమేనని, తాను మాట్లాడింది తప్పయితే ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాలని, అపుడు తన తప్పును సరిదిద్దుకోడానికి తాను సిద్ధమేనని అన్

'దక్షిణభారత వరల్డ్ బుక్‌ఆఫ్ రికార్డ్స్'లో కొత్తగూడెం వాసికి చోటు

ప్రజాపక్షం/భద్రాచలం : సోషల్ మీడియా యూట్యూబ్‌లో 250 పాటలు రచించి, ఆలపించి పోస్టు చేసినందుకు గానూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన లిరిక్ రైటర్ కల్యాణ్ సుమిత్రకు దక్షిణ భారత వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను సత్కరించి సన్మానించి పురస్కారాన్ని అందించారు. అరుదైన పురస్కారాన్ని అందించిన వారిలో హైదరాబాద్ అడిషనల్ డిసిపి రాందాస్ తేజావత్ తో పాటు ప్రముఖ న్యాయమూర్తి బూర్గుల మధుసూధన్ రావు, దైవజ్ఞశర్మ, మేకప్ ఆర్టిస్ట్ చిత్తోజి రాజేష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతం కళ్యాణ సుమిత్ర మాట్లాడుతూ ఈ స్థాయికు చేరుకునేందుకు అహర్నిశలు కృషి చేశామని, ఇందుకు అందరి సహాయ సహకారాలు అందాయని చెప్పారు.

కొల్లి గోపమ్మకు నివాళులర్పించిన సిపిఐ

ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన కొల్లి గోపమ్మ దశదిన కర్మకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ హాజరై గోపమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. నాగుల్ మీరా, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గార్లపాటి వీరభద్రం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గార్లపాటి శివకృష్ణ, సిపిఐ నాయకులు వల్లమల్ల సామేలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న పార్థివదేహానికి ఎమ్మెల్యే పాయం నివాళి

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలం మొండికుంట గ్రామానికి చెందిన చాతర్ల వెంకన్న మొండికుంట గ్రామంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈవిషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి స్వగృహానికి వెళ్లి వెంకన్న పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు అండగా ఎంఎల్ఎ తెల్లం

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రమాద క్షతగాత్రులకు స్థానిక ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు కొండంత అండగా నిలిచారు. నియోజకవర్గ పర్యనలో భాగంగా సోమవారం చర్ల మండలంలో ఆయన పర్యటించేందుకు వెళుతున్న క్రమంలో టాటా మ్యాజిక్, మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్న సంఘటనలో ఇరువులు వ్యక్తులు గాయాలపాలై రోడ్డు ప్రక్కకు పడిపోయారు. రక్తమోడుతున్న వారిని గమనించిన ఎంఎల్ఏ తన వాహనాన్ని ఆపి క్షతగ్రాతుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వెంటనే తన వ్యక్తిగత సహాయకుల సహకారంతో దగ్గర్లోని సత్యనారాయణపురం ప్రభుత్వాస్పత్రికి తనకారులో తరలించారు. తన వృత్తిపై ఉన్న మక్కువతో క్షతగాత్రులను స్వయంగా పరిశీలించి ప్రాణాలు నిలిపేందుకు కృషి చేసిన తీరును పలువురు ప్రశంసిస్తున్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/భద్రాచలం: ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి కార్యమాన్ని నిర్వహించి జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. పరిష్కారించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలన్నారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అ దనపు కలెక్టర్ విద్యా చందనతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నా రు.

కోడ్ ముగియగానే అర్జీల పరిష్కారానికి కృషి

ఐటిడిఎపిఒ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం : వివిధ ప్రాంతాల నుండి వచ్చి గిరిజనులు అందించిన దరఖాస్తులను ఎన్నికల కోడ్ ముగియగానే పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారుకు హాజరైన ఆయన పలువురు గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించి పరిశీలించారు. అనంతరం ఆయా శాఖలకు సంబంధించిన యూనిట్ అధికారులకు వాటిని బట్వాడా చేశారు. అనంతరం పిఒ మాట్లాడుతూ ఎంఎల్సి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గిరిజన సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించినట్లు చెప్పారు. ఎక్కువ శాతం గిరిజనులు పోడుభూముల పట్టాలు, గిరివికాసం, స్వయం ఉపాధి ద్వారా జీవనోపాదికి సంబంధించిన దరఖాస్తులు సమర్పించినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగియగానే వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపిఒ జనరల్ డేవిడ్ రాజు, డిడి మణెమ్మ, ఆర్‌సిఒ నాగార్జునరావు, ఎస్‌డిసి, ఇఇ చంద్రశేఖర్, ఎస్ఒ భాస్కర్‌తో పాటు వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు...

తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి, నాయుడుపేటసర్కిల్, గోళ్లపాడు, ఆరెంపుల పంచాయతీలలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. అందులో భాగంగా ఆరెంపులలో మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఫైలట్ ప్రాజెక్టుగా గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి 4సంక్షేమ పథకాలు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను కలిసి వారికి అభినందనలు తెలపడంతో పాటు కొబ్బరికాయ కొట్టి నిర్మాణాలకు శంకుస్థాపన సైతం చేశారు. పెద్ద ఎత్తున తరలవచ్చి అభిమానాన్ని చాటుకున్న గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడారు...మీ ఆదర అభిమానాలు తనపై ఎల్లప్పుడు ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు. సంక్షేమ పథకాల అందజేత ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసే బాధ్యత తనదేనన్నారు. అనంతరం అక్కడి నుంచి గోళ్లపాడు చేరుకుని అక్కడ నూతనంగా నిర్మాణం చేసిన ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపనలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నాయుడుపేట సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకుడు బానోత్ భాస్కర్ ఏర్పాటు చేసుకున్న టీవరల్డ్ షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు బాలసాని లక్ష్మి నారాయణ, మద్దులపల్లి మార్కెట్‌కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, మార్కెట్ డైరెక్టర్లు పంతుల్ నాయక్, భద్రకాళి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు మద్ది మల్లారెడి, మద్ది వీరారెడ్డి, ధరావత్ రామ్మూర్తి నాయక్, బండి జగదీష్, తమ్మినేని నవీన్, చింతమళ్ల రవి, పల్లెర్ల పాండయ్య, భూక్య సురేష్ నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, తిప్పని రాజశేఖర్‌రెడ్డి, అజ్మీరా అశోక్‌నాయక్, షాబాద్ మాధవరెడ్డి, కొప్పుల ఆంజనేయులు, శేఖర్‌గౌడ్, బత్తిని యాలాద్రి, సిపిఎం నాయకులు కొండం కరుణాకర్‌పాల్గొన్నారు.

పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లాలోని పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సత్తుపల్లి, మధిర, వైరా పట్టణాల మున్సిపాలిటీల పనితీరుపై అధికారులతో సమీక్షించారు. మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూలు, చేపట్టిన అభివృద్ధి పనులు, పచ్చదనం, త్రాగునీరు సరఫరా, పారిశుధ్య నిర్వహణ, టౌన్ ప్లానింగ్ వంటి పలు విభాగాలపై వివరాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై అధిక ప్రాధాన్యత కల్పించాలని, రోడ్లను శుభ్రంగా ఉంచాలని, రోడ్లపై ఎక్కడ చెత్తాచెదారం, ప్లాస్టిక్ ఉండడానికి వీలు లేదన్నారు. పట్టణంలోని ప్రతి వార్డుకు చెత్త నిర్వహణ కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని అక్కడ అవసరాలకు అనుగుణంగా సిబ్బంది అవసరమైన వాహనాలు, యంత్రాలు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. మున్సిపాలిటీలో ఆస్తి పన్నుల వసూలు సమీక్షించుకుని వంద శాతం పన్ను వసూలయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ఎంత పన్ను వసూలు జరిగింది, గతేడాది కంటే పెరిగిందా, తగ్గిందా, పెండింగ్ ఉండటానికి గల కారణాలు, వాటి వసూళ్లకు చేపట్టే తగు చర్యల గురించి చర్చించి పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీలలో చేపట్టిన రోడ్డు విస్తరణ, డ్రైన్ల నిర్మాణం, జంక్షన్‌ల అభివృద్ధి వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ఆమె సూచించారు. మున్సిపాలిటీలో మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాకు సంబంధించి సరఫరాలో ఉన్న సమస్యలను ముందుగా గుర్తించి రాబోయే వేసవికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా అవసరమైన తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపల్ కమిషనర్‌లు వేణు, సంపత్‌కుమార్, నర్సంహా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు

ప్రజాపక్షం/ఏన్కూరు: కోడిపందాల స్థావరాలపై ఖమ్మం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన సంఘటన ఇది. మండల పరిధిలోని జన్నారం గ్రామ సమీపంలో కోడిపందాలు ఆడుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. దాడులు నిర్వహించగా కోడిపందాలు ఆడుతున్న కొందరు వ్యక్తులు అక్కడి నుండి పరారయ్యారు. దాడుల్లో ఆరుగురు వ్యక్తులు, సుమారు రూ.25160ల నగదు, 18 ద్విచక్ర వాహనాలు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను, వ్యక్తులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏన్కూరు ఎస్ఐరఫి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల తీరు సరికాదు

తెలంగాణ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి

ప్రజాపక్షం/జూలూరుపాడు: మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ కనబరుస్తున్నారని రాష్ట్ర కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి విమర్శించారు. సోమవారం మండల మహాసభ గడల మంగమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు పదివేలు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు 3000 ఇచ్చి శ్రమ దోపిడి చేస్తున్నారని ఈఎస్ఐ, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లు కల్పించాలని, వంట కార్మికులకు యూనిఫాంలో అందించాలని అన్ని పాఠశాలలకు వంట షెడ్లు నిర్మించి గ్యాస్ తదితర మౌలిక వసతులు కల్పించాలని, వంట బిల్లులు కులాల వారీగా ఎస్సి, ఎస్‌టి,బిసి, జనరల్ పేర్లతో వేరువేరుగా బిల్లులు చెల్లించటం మంచిది కాదని తప్పు పట్టారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 30 రూపాయలు చెల్లించాలి డిమాండ్ చేశారు. ఈ మహాసభలో పాల్వంచ మండల కార్యదర్శి ఎండూరు ప్రభావతి, సుజాతనగర్ మండల కార్యదర్శి వహీదా, ముదిగొండ లక్ష్మి , కొరివి ఇందిరా, సత్యవతి, మంగమ్మ, సుశీల, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాలు రద్దు చేయాలని 5న నిరసన

ఎఐటియుసి, సిఐటియు, టి.యు.సి.ఐ, ఇఫ్ట్యూ, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

ప్రజాపక్షం/మణుగూరు: మోదీ ప్రభుత్వం తెచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టలు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5 వ తేదీన జాతీయ సంఘాల ఐక్య కార్యాచరణ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేయాలని కోరుతూ సోమవారం సిపిఐ కార్యాలయం లో జరిగిన అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి, ఇఫ్ట్యూ జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేస్తుందని , కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 44 చట్టాలను నాలుగు చట్టాలుగా నాలుగు లేబర్ కోడలుగా క్రోడీకరించి అమలు చేస్తుందని, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతుల నోట్లో మట్టి పడుతుందని ఈ విధానాలను నిరసిస్తూ జాతీయ కమిటీ ఈనె ల 5వ తేదీన మణుగూరులో నిరసన కార్యక్రమం చేయనున్నామని దీనికి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్షలు రాయల భిక్షం, గౌరవ అధ్యక్షులు తోట రమేష్ ,కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, రైతు సంఘం జిల్లా నాయకులు ఎడారి రమేష్, దండగుల బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పసునూరి లక్ష్మి రెడ్డి, సిఐటియు నాయకులు రవి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బొల్లం రాజు, టి .యు. సి. ఐ. మండల నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, ఇఫ్ట్యూ జిల్లా నాయకులు నల్ల రమేష్, సాధన పల్లి రవి హాజరై మాట్లాడారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డిఆర్‌వో ఎ. పద్మజ, డిఆర్‌డివో సన్యాసయ్యలతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజావాణికి సంబంధించి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలన చేసి పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. రఘునాథపాలెం మండలం చింతగట్టు రెవెన్యూ గ్రామానికి చెందిన కె. ద్రౌపది గ్రామంలో తనకు ఎకరం 15 కుంటల వ్యవసాయ భూమి ఉందని ఆ భూమికి రైతు భరోసా డబ్బులు, ఉపాధి హామీ కూలీ డబ్బులు, గ్యాస్ సబ్సిడీ డబ్బులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్ నందు జమ కాగా బ్యాంకు వారు ఆ నగదును రుణం క్రింద నిలిపివేయడం జరిగిందని ఆ డబ్బులు తిరిగి ఇప్పించాలని కోరారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన సిహెచ్ మట్టయ్య తనకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌లో పేరు తప్పుగా నమోదైందని దీని వల్ల తనకు పింఛన్ రావడం లేదని తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ, ఖమ్మం నగరం వీడియోస్ కాలనీకి చెందిన ఎస్. ప్రసాదరెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సిబ్బంది నిర్లక్ష్యం వల్ల తనకు నాల్గవ విడతలో రుణమాఫీ కాలేదని రుణమాఫీ పూర్తి చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా అర్జీలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎ. అరుణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షకులకు శాపంగా బిజెపి ప్రభుత్వ విధానాలు

ప్రజాపక్షం/ములకలపల్లి: బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్డ్‌లను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌కేయం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం సిపిఎం కార్యాలయంలో సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక కార్మిక విధానాలను వ్యతిరేకించాలని నిరసిస్తూ ఫిబ్రవరి 5న మండల కేంద్రంలోని జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీసం వేతనం రూ 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ సంస్కరణ చట్టాన్ని సవరించాలని నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్రం సహకరిస్తామని బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సరైనది కాదని అన్నారు. బడ్జెట్‌లో కార్మికులకు రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని ఎద్దేవా చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు వూకంటి రవికుమార్, నిమ్మల మధు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథ నాయకులు యర్రగొర్ల రామారావు, శనగని వినోద్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14 టెన్నిస్ జోనల్ మీట్‌లో ప్రతిభ చూపిన చిన్నారులు

అభినందనలు తెలిపిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాపక్షం/పాల్వంచ: జోనల్ మీట్ టెన్నీస్ క్రీడల్లో ప్రతిభ చూపిన చిన్నారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. జనవరి 24, 25 తేదీల్లో ఖమ్మంలోని శ్రీచైతన్య గ్లోబల్ విస్టా స్కూల్ ఆధ్వర్యంలో జోనల్ మీట్ క్రీడలు జరిగాయి. అండర్ 14 టెన్నీస్ విభాగంలో నారాయణ స్కూల్ ఆరవ తరగతి విద్యార్థిని ప్రవసి ప్రథమ బహుమతి, నవభారత్ పబ్లిక్ స్కూల్ ఏడవ తరగతి విద్యార్థిని బొమ్మ భానుశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. అదేవిధంగా ఆలిండియా టెన్నీస్ టోర్నమెంట్ 55 ప్లస్ వయస్సు విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకున్న ఒలంపిక్ టెన్నీస్ అసోసియేషన్ చీఫ్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లును కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టెన్నీస్ కోచ్ అన్నం వెంకటేశ్వర్లుపై మరిన్ని బాధ్యతలు పెరిగాయని క్రీడలకు అవసరమైన సామాగ్రి కోసం అసోసియేషన్ సాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఫిబ్రవరి ఆరు నుంచి తొమ్మిది వరకు కొత్తగూడెం హనుమాన్ బస్తీ ఇండోర్ మైదానంలో 35 నుంచి 85 వయస్సు గల క్రీడాకారుల కోసం రాష్ట్ర స్థాయి వెట్రన్ బ్యాడ్మింటన్ పోటీలు జరగనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా ఆహ్వానించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఒలంపిక్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఆర్. రాజేంద్రప్రసాద్, టెన్నీస్ కోచ్ డేనియల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహణ

మార్చి ఐదు నుంచి 25 వరకు పరీక్షలు

72 పరీక్షా కేంద్రాలు

ఇంటర్ పరీక్షల నిర్వహణపై డిఆర్ఒ సమీక్ష

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లాలో ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మజ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మజ సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒమాట్లాడుతూ మార్చి ఐదు నుంచి 25 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి మూడు నుంచి 22 వరకు జరుగుతాయని ఆమె తెలిపారు. జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 36,660 విద్యార్థులు హాజరు కానున్నారని వారి కోసం 72 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్లు అధికారులు డిఆర్‌వోకు తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరయ్యేవిధంగా ఆర్టిసి బస్సులు నడపాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, డిఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, పోస్టల్ శాఖ బాధ్యులు ఆర్. నారాయణ, ఆర్టిసి డిఎం దినేష్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఆర్‌సిఒ విజయలక్ష్మి , మైనార్టీ శాఖ ఆర్‌సిఒ వెంకట్రామయ్య, విద్యాశాఖ బాధ్యులు భానుప్రకాష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

32 వినతులు స్వీకరణ

జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో వినతులను అదనపు కలెక్టర్లు బిఎస్ లత, గౌతమ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కార కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రాయాసలకు ఓర్చి వస్తారని, సానుకూలంగావ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు వినతులు వచ్చాయన్నారు. ఆర్డీవోలు మధుసూధన్, జీవాకర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి జీవన్‌రెడ్డిని కలిసిన నరేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : నిజామాబాద్‌ఆదిలాబాద్ కరీంనగర్ మెదక్ కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లను కలిసి తన గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.అలాగె జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను జగిత్యాలలో కలిశారు.మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, నాగభూషణం, నాయకులు గాజంగి నందయ్యా, రాజేందర్, నేహాల్, భూమేశ్వర్, లక్ష్మణ్, గుండా మధు, రఘువిర్, ధ్యావరా శ్రీనివాస్, బాల ముకుందం, రాజ్‌కుమార్, నారాయణ, ప్రభాత్‌సింగ్ తాగూర్, పోతునుక మహేష్, రామకృష్ణ రెడ్డి, మనోహర్, శశి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష డప్పులు—వేల గొంతులు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని మోరపెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి బొల్లె గంగారం ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వేల గొంతులు అనే నినాదంతో ఎస్సీ వర్గీకరణ అమలుకై ఈనెల 7న చలో హైదరాబాద్ భారీ ప్రదర్శన విజయవంతం చేయాలని అన్నారు. హైదరాబాదులో లక్ష డప్పులు వెయ్యి గొంతులు పోస్టర్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు.గ్రామ అధ్యక్షులు అనిల్, లక్ష్మణ్, గంగాధర్, ముత్తయ్య, కాంతయ్య, మాజీ సర్పంచ్ బొల్లె గంగారం, ఎమ్మార్పీఎస్ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో కెమెరాలు

ప్రజాపక్షం/రామగిరి : పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ (గుండారం) ప్రభుత్వ కళాశాలలో సీసీ కెమెరాలు సోమవారం ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాశీ మల్ల సుధాకర్ తెలిపారు. పరీక్ష ల నిర్వహణ కోసం అన్ని ప్రయోగ శాలలతో పాటు గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రాబోవు ఇంటర్ అన్ని పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాబోవు ఇంటర్ పరీక్షలు కొరకు ముందస్తు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

9న వేములవాడలో మహాసభ

ప్రజాపక్షం/వేములవాడటౌన్: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యూ జే హెచ్ 143 మూడు జిల్లాల మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. ఈనెల 9న వేములవాడ పట్టణంలోని మహాదేవ్ కళ్యాణ మండపంలో మహాసభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వాల్ పోస్టర్‌ను వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన జర్నలిస్టులు మహాసభకుతరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సీనియర్ పాత్రికేయులు తాహెర్ పాషా, రేగుల రాంప్రసాద్, కొలిపాక నర్సయ్య, తీగల మల్లికార్జున్, కనకారెడ్డి, పాశం భాస్కర్ రెడ్డి, జిల్లా రమేష్, కొత్వాల్ శ్రీనివాస్, మహమ్మద్ అజీమ్, కమలాకర్, షేక్ రియాజ్, దేవరాజు, బుర్ల సందీప్, ప్రదీప్, దుర్గం పరశురాం, అబ్బగోని రవీందర్, ప్రవీణ్, సయ్యద్ ఫహద్ పాషా, కోడం గంగాధర్, శ్రీకాంత్, ముషాహిద్, ఇమ్రాన్, షబ్బీర్, జునైద్, జబ్బార్, నాగరాజు, గంగాధర్, హరీష్, షోయబ్, శ్యామ్‌లతోపాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో సౌకర్యాల కోసం వినతి

ప్రజాపక్షం/కొత్తపల్లి: కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనం అయిన గ్రామం దుర్శేడ్‌లో ఏర్పాటు చేసిన బొడ్డురాయి ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయ్‌కి వినతి పత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ బంగారు పోచమ్మ భూలక్ష్మి శ్రీలక్ష్మి సహిత గ్రామ శిల (బొడ్డు రాయి) దేవాలయం నిర్మించామని తెలిపారు. ఉత్సవాలు ఈ నెల 5 నుంచి 10 వరకు ఉంటాయని, వార్డులో కనీస అవసరాలు ఏర్పాటు చేయాలని కోరారు.మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, మాజీ ఎంపిటిసి, ఆలయ కమిటీ చైర్మన్ కోరుకొండ వేణుమాధవ్ తదితరులున్నారు.

కార్పొరేటర్ రాజేందర్‌రావుకు సన్మానం

ప్రజాపక్షం/కరీంనగర్: నగరంలోని 56వ డివిజన్ కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్‌రావు పదవీకాలం ముగిసిన సందర్భంగా భాగ్యనగర్ కాలనీవాసులు సన్మానించారు. నర్ర నరోత్తంరెడ్డి, దొగ్గలి శ్రీధర్, వాయిల రాజ్ కుమార్, దుంపట్టపల్లి శివకుమార్, మాధవరపు నరేందర్, ఆసంపెల్లి అనిల్‌కుమార్, ఎన్.సాయివిష్ణు, డి.శివకుమార్‌తో కలిసి సన్మానించారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జీతాలు ఖాతాల్లో జమ చేయరేమి?

ప్రభుత్వ పాఠశాల స్కావెంజర్స్ స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్లప్రతినిధి : ప్రభుత్వ పాటశాలల స్కావెంజర్స్, స్వీపర్స్ వేతనాలు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా కాకుండా నేరుగా కార్మికుల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్, స్కావెంజర్స్ వర్కర్స్ యూనియన్ డిమాండు చేసింది. అంతేగాక రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. వినతి పత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్, సిపిఐ పట్టణ కార్యదర్శి పంతం రవి మాట్లాడారు. పాఠశాల గదులు,మూత్రశాలలు శుభ్రపరుస్తున్న స్వీపర్స్, స్కావెంజర్లకు ఆరు నెలల నుండి జీతాలు రాక జీవనం సాగించడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు జీతాలు ఇస్తానని చెప్పి ఈ విధంగా చేయడం బాధాకరమన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వేతనాలు చెల్లించకుండా అందరికి ఒకే రకంగా నెలకు రూ.15వేలజీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. చీపర్లు, బ్లీచింగ్ ఫౌడర్, ఫినాయిల్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫారం ఇవ్వాలని, ఇన్సురెన్స్ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఆహార భద్రత, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కో కన్వీనర్ బొడ్డు నర్సవ్వ, ఇందిరా, లక్ష్మి, ఎల్లవ్వ, పరుశురాములు, లక్ష్మయ్య, స్వప్న, లత, రాజేశేఖర్, రాజలింగం, మల్లేశం, ప్రకాష్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

పెద్దపల్లి కలెక్టర్ శ్రీ కోయ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రి లోకి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలనిజిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని, రంగంపల్లి లోని మైనారిటీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఆయుష్మాన్ భారత్‌ఓపిరిజిస్ట్రేషన్, నూతనంగా నిర్మించే ఆసుపత్రి భవనాన్ని, కూల్చివేతకు సిద్ధంగా ఉన్న మూడు వార్డులను, డయాలసిస్ జరుగుతున్న మిషనరీలను, స్కానింగ్ ఓపి రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆప్డ ల్ ఓపి సర్జరీలు బాగానే జరుగుతున్నాయని ఇవి కాకుండా ఇంకా సర్జరీలు పెరగాలని, కొత్తగా నిర్మించే ఆసుపత్రి బిల్డింగ్ పూర్త య్యే లోపు ప్రస్తుతం ఉన్న వార్డులను తీసివేసే క్రమంలో వాటిని ఎక్కడికి మార్చాలో వాటిపై వెంటనే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి సాయింత్రం సమావేశం ఏర్పాటు చేయాలని,వాటిలో బిల్డింగ్ కు సంబంధించిన వివరాలు, కూల్చివేతకు సిద్ధంగా ఉన్న వార్డు ల సంబంధిత సమాచారం తేవాలని కలెక్టర్ తెలిపారు. రంగంపల్లిలోనిమైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహాలను తనిఖీ చేశారు.

ఎనిమిది మంది ఎంపిలున్నా మొండిచెయ్యి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలో 8 మంది ఎంపిలు, అందులో ఇద్దరు మంత్రులు ఉన్నా వారి చేతకానితనంతో కేంద్ర ప్రభుత్వం దగ్గరికి వెళ్లి తెలంగాణకు నిధులు కావాలని అడిగిన పాపాన పోలేదని ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించలేదని బిజెపి వైఖరికి నిరసనగా పిసిసి పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికలు ఎక్కడ ఉంటే అక్కడ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను కేటాయిస్తూ మిత్ర పక్షాలకు ఎక్కువ నిధులు కేటాయించి తెలంగాణకు మొండి చేయి చూపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సభలో ద్వేషానికి పోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి మోదీకి పెద్దన్న పాత్ర పోషించి అన్ని రాష్ట్రాలకు సమన్యాయం చేయాలని కోరిన బ య్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి చర్చ లేదు, కానీ పక్కనున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి మాట్లాడుతారని, పాలమూరు ప్రాజెక్టు గురించి చర్చ లేదు కానీ పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయిస్తారని విమర్శించారు. విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌కు, రైతాంగానికి నిధులు కేటాయించకపోవడం దౌర్భాగ్యం అన్నారు. మహానగరాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, కలకత్తా, ముంబై, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై సరసన హైదరాబాద్ విశ్వ నగరంగా ముందుకు వెళ్తుంటే నిధులు కేటాయించకపోవడాన్ని తప్పు పట్టారు. రేవంత్ రెడిడ సర్కార్ రైతులకు 21 కోట్ల రుణమాఫీ చేసి ముందుకు వెళ్తుంటే తెలంగాణ రాష్ట్రంపై ఇంత నిర్లక్ష్య వైఖరి ఎందుకన్నారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మొండి చేయి చూపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వెళ్తామని గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగా ఆడంబరాలకు పోకుండా తెలంగాణ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సంగీతం శ్రీనివాస్, వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, జగన్మోహన్ రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, కాముని వనిత నళినికాంత్, నేరేళ్ల శ్రీకాంత్ గౌడ్, వస్తాదు కృష్ణ ప్రసాద్, వేముల రవి, ఇరువాల మల్లేశం, ఆదిల్ పాషా, రణధీర్ రెడ్డి, వెంగళ లక్ష్మి నర్సయ్య, యెల్లె లక్ష్మి నారాయణ, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, తదితరులున్నారు.

కేంద్రం నిధులు ఇచ్చేవరకు పోరాటం

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : కేంద్రబడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించటంలో వివక్ష వహించటాన్ని నిరసిస్తూ సిద్దిపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్‌ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గంఇంచార్జి పూజల హరికృష్ణ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ కెడేం లింగమూర్తి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తాలో బైటాయించి నినాదాలు చేశారు.వారు మాట్లాడుతూప్రధాని మోదీ మొద టి నుండి తెలంగాణ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు. ఇద్దరు కేంద్ర మంత్రులున్న తెలంగాణ అభివృద్ధికి తెచ్చిన నిధులు గుండు సున్నా అన్నారు. తెలంగాణ బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు కేంద్రంపై వత్తిడి తెచ్చి నిధులు తేవాలని లేని పక్షంలో తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రధాన్యత ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగావిస్మరిస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేవరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తమవైఖరి మార్చుకోకుంటే బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. బిఆర్ఎస్ గత పది ఏండ్లు అధికారంలో ఉండి కేంద్ర ప్రభుత్వం నుండి నిధుల రాబట్టడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అప్పుడు మౌనంగా ఉన్న బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాత్రం మైకుల ముందుకు వచ్చి తెలంగాణ అభివృద్ధికి నిధుల తేవటంలో విఫలమైనారని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బిఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ అభివృద్ధికి, నిధులు కేటాయింపుల కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో పాలుపుంచుకోవాలని సూచించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరు చేసేవరకు పోరాటం ఆపే ప్రసక్తి లేదని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్క సతీష్, జి.శ్రీనివాస్, అత్తుఇమామ్, బొమ్మల యాదగిరి. నరేందర్ రెడ్డి, లక్ష్మి , సంతోషి, పద్మ పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లోనూ రాణించాలి

జగిత్యాల ఎస్‌పి అశోక్‌కుమార్

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : కరీంనగర్‌లో జరిగిన థర్డ్ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2025 జనవరి 28 నుండి ఫిబ్రవరి 1 వరకు జరిగిన ఈ క్రీడలో జిల్లాకి చెందిన క్రీడాకారులు 3 రజత పతకాలు, 2 కాంస్యం పతకాలు సాధించారు. పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు సోమవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కలిశారు.ఎస్పీ మాట్లాడుతూ జిల్లా, జోనల్ స్థాయిలో ఉత్తిమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులు ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజు హామర్ త్రోలో ఒక సిల్వర్ మెడల్, ఎఆర్ కానిస్టేబుల్ టి.మల్లేశం టెన్నిస్‌లో ఒక బ్రాంజ్ మెడల్, ఎఆర్ కానిస్టేబుల్ డి.నరేందర్, వెయిట్ లిఫ్టింగ్‌లోఒక సిల్వర్, పవర్ లిఫ్టింగ్‌లో ఒక బ్రాంజ్ మెడల్, ఎఆర్ కానిస్టేబుల్ సాయి మాధవన్ యోగలో ఒక సిల్వర్ మెడల్ సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని కనబరుస్తూ రాబోయే జాతీయ స్థాయి క్రీడల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అదనపుఎస్పిబీమ్‌రావు, అర్ఐలు కిరణ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

సిటీ పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (ఫిబ్రవరి 1వ తేది నుండి 28 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని అశోక్ కుమార్ తెలిపారు. అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.

ఇద్దరు కేంద్రమంత్రులున్నా..గుండుసున్నా

ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి: కేంద్రంలోని బిజెపి ప్రభు త్వంప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపి అన్యా యం చేశారంటూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఆద్వర్యంలో నగరంలోని కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్ర వేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి పూర్తిగా అన్యా యం చేసి ందన్నారు. కేంద్రానికి తెలంగాణ రాష్ట్రం పన్నుల రూపంలో సంవత్సరానికి 26 వేల కోట్ల రూపాయలు చెల్లిస్తుంటే తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చిల్లి గవ్వ ఇవ్వకపోవడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. తెలంగాణపై బిజెపి ప్రభుత్వానికి ఉన్న చిన్నచూపు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాలతో పాటు ఏ రాష్ట్ర ంలో ఎన్నికలు ఉన్నాయో అక్కడ నిధులు కేటాయించి తెలంగాణపై వివక్ష చూపారన్నారు. తెలుగుబిడ్డ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెలుగు రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ప్రాధాన్యత తెలంగాణకు ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండి కరీంనగర్ లోక్‌సభ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాల కోసంకేంద్రం నుంచి నిధులుతీసుకురాకపోవడంచేత కానితనమన్నారు. మాజీఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జిల్లా కాంగ్రెస్ అనుబంధసంఘాలఅధ్యక్షులుఎండితాజ్, బానోతు శ్రావణ్‌నాయక్, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, పురం రాజేశం, కాంగ్రెస్ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, వెన్న రాజమల్లయ్య, కామిడి రామిరెడ్డి, పంజాల స్వామిగౌడ్, కాంగ్రెస్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా.. మారని కార్మికుల జీవితాలు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : ప్రభుత్వాలు మారినా కార్మికుల జీవితాలు మారడం లేదని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు చిలువేరు స్వామి అన్నారు. సోమవారం పెద్దపెల్లి జిల్లా ప్రెస్ క్లబ్ లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగాకార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు తిరునహరి రాజు, జనరల్ సెక్రెటరీ భైరీ శంకర్, కుంభం లక్ష్మీ నారాయణ,ఇటిక్యాల సుధాకర్, పల్లెర్ల మల్లేశం, గుంటి సంతోష్, గడ్డం శంకర్, శ్రీనివాస్, పెద్దపల్లి మండల అధ్యక్షులు మిట్టపల్లి సతీష్, ఎలిగేడు మండల అధ్యక్షులు ఏసుదాసు, కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు మధుకర్, సుల్తానాబాద్‌మండల అధ్యక్షులు కొడిపాకస్వామి, మంథని మండల అధ్యక్షులు నామని పుల్లయ్య, రామగిరి మండల అధ్యక్షులు తొగరి చంద్రయ్య, సెంట్రింగ్ సంఘం అధ్యక్షులు మాటేటి మదనయ్య, ముత్తారం మండల అధ్యక్షులుకోలనీకుమార స్వామి,నాయకులుఆరెపల్లిరత్నం,తాటిపాములనర్సయ్య,శ్రీనివాస్ ఉన్నారు.

'ఇండియన్ పబ్లిక్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.హైదరాబాదులో విశ్వం ఎడ్యూటేక్,గామా అధ్ధర్యంలో ఆదివారం నిర్వహించిన అబాకస్,వేదిక్ గణిత రాష్ట్రస్థాయి పోటీల్లో సుల్తానాబాద్ పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులుమొదటి బహుమతులు సాధించారు. ఇండియన్ పబ్లిక్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అబాకస్ వేదిక్ గణిత పోటీలకు హాజరవ్వగా కే.మాన్ వీక్ మూడవ తరగతి విద్యార్థి జూనియర్ విజువలైజేషన్ విభాగంలో మొదటి బహుమతి, ఏం రితన్య ఐదో తరగతి విద్యార్థిని సీనియర్ కేటగిరి విభాగంలో రెండవ బహుమతి, ఏం సంచిత్ రెండవ తరగతి విద్యార్థి స్టార్ పర్ఫార్మర్ అవార్డు సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెమెరాలతోనే నేరాలు నియంత్రణ

ప్రజాపక్షం/ముత్తారం:గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని ఎస్సై నరేష్ అన్నారు.సోమవారం ముత్తారం మండలం ఓడేడులో ముత్తారం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల నిర్వహణపై బస్టాండ్ ఆవరణలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నేరాలు అరికట్టవచ్చు అన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకుఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, దాతలు సహకరించాలని సూచించారు. పోలీసు కానిస్టేబుల్ అశోక్, వెంకట్ రెడ్డి,రాజ్ కుమార్,హోంగార్డు గోపాల్ తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

'బిసి కులగణనపై కాంగ్రెస్‌వి కాకి లెక్కలు'

నేడు జనగామకు కూనంనేని

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేండ్లు అయిన సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నారు. బహిరంగ సభకు సంబంది జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రిస్టన్ గ్రౌండ్ ప్రదర్శన ప్రారంభమై నెహ్రూ పార్కులోని కామాక్షి పంక్షన్ హాల్ వరకు జరుగుతుందన్నారు. కామాక్షీ పంక్షన్ హాల్‌లో బహిరంగ సభ జరగనుండగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావుతో పాటు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు,నాయకులు, కార్మికులు,కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మొట్టమొదటి విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్

2025 డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఎఐఎస్ఎఫ్ సంఘమేనని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్ఎఫ్ 2025వ సంవత్సర డైరీని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ రావు మాట్లాడుతూ, దేశంలోనే మొట్టమొదటిసారిగా విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం పని చేసిన ఏకైక సంఘం ఎఐఎస్ఎఫ్ కొనియాడారు. విద్యార్థులు చక్కగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలని కోరా రు. ఈ ప్రభుత్వం విద్య వైద్య, రంగాలకు, విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం పాటుపడుతుందని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ప్రభుత్వ విద్య పరిరక్షణకె అన్ని విద్యార్థి సంఘాలు పాటుపడాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి నేరెళ్ల జోసెఫ్, సాకేత్ రెడ్డి, కునూరి భగత్, దొంతరబోయిన హరి శివ కృష్ణ, పవన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ముఖ ద్వార తోరణ భూమి పూజ

ప్రజాపక్షం/ఖానాపూర్: మండలంలోని బుధరావుపేట గ్రామంలో భూనీల సమేత వెంకటేస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు వేణు స్వామి పూజలు నిర్వహించి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ముఖ ద్వారం తోరణం భూమి పూజను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం నిర్వహించారు.నియోజకవర్గ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షులు పెండం రామానంద్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, దుగ్గొండి మండల అధ్యక్షులు తోకల శ్రీనివాస్‌రెడ్డి, నర్సంపేట అధ్యక్షులు బానోతు లక్ష్మణ్‌నాయక్, మండల యూత్ అధ్యక్షుడు ఎలగందుల రాజు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

డబ్ల్యుపిఎస్ విద్యార్థికి ప్రపంచ రికార్డు

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : హనుమకొండ హంటర్ రోడ్ లోని వరంగల్ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి అభ్యసిస్తున్న ఇమ్మడి అభిరామ్ కు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. వరంగల్ పబ్లిక్ స్కూల్లో సీనియర్ విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక దినోత్సవంలో అభిరామ్ మహాభారతంలోని కర్ణుడి వేశదారణలో 5 నిమిషాల 30 సెకన్ల పాటు అనర్గళంగా ఏకపాత్రాభినయం ప్రదర్శించాడు. ఈ ఏకపాత్రాభినయాన్ని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ నమోదు చేసుకొని సూపర్ టాలెంట్ కిడ్ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రతిష్టాత్మక ఈ పురస్కారాన్ని అందుకున్న అభిరామ్ ను వరంగల్ పబ్లిక్ స్కూల్ కన్వీనర్ ఈరసాని వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్ శ్రీరాముల ఉమారాణి, అడిషనల్ డైరెక్టర్ గూడూరు జ్యోతి, ప్రిన్సిపల్ గౌరీ కల్యాణి, వైస్ ప్రిన్సిపల్ కవిత, ప్రాథమిక తరగతుల ఇన్‌చార్జి పుష్పలత సోమవారం పాఠశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో గురువులు సోఫియా, మధుకర్, శోభారాణి, మాధవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ కార్పోరేటర్ పల్లం పద్మ రవి సోమవారం కరీమాబాద్‌లోని గత ఏడాది నిర్మించిన మైసమ్మ దేవాలయం నేటితో ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవం నిర్వహించారు. గోనె రాంప్రసాద్ దసరా ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు సహకారంతో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పోరేటర్ పల్లం పద్మ రవి ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30వ ఆసియా అంతర్జాతీయ ఫాటోకాన్ కరాటేలో మానుకోట ప్రతిభ

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: ఈనెల ఒకటి, రెండు తేదీల్లో ఇందిరా ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్ ముంబైలో జరిగిన 30వ ఆసియా అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మానుకోట కరాటే అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపర్చారని బంగారు, వెండి పతకాలు సాధించినట్లు మానుకోట కరాటే అకాడమీ చైర్మన్ వీరునాయక్ తెలిపారు. ఈ పోటీల్లో బ్లాక్‌బెల్ట్ సీనియర్ స్పారింగ్ విభాగంలో శ్రీరామ్ గోల్డ్ మెడల్ సాధించగా, జూనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో సిద్దార్థ గోల్డ్ మెడల్ సాధించాడు. అలాగే సీనియర్ కలర్ బెల్ట్ విభాగంలో జగదీష్ ప్రీతం గోల్డ్ మెడల్ సాధించాడు. జూనియర్ కలర్ బెల్స్ విభాగంలో రిషిక్ వర్మ, ఎండి షాయిస్ట్ గోల్డ్ మెడల్ సాధించారని వీరునాయక్ తెలిపారు. ఈ అవార్డు రావడం పట్ల తెలంగాణ రాష్ట్ర షోటోఖాన్ కరాటే అకాడమీ అధ్యక్షులు ఊరుకొండ చంద్రశేఖర్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ కరాటే కోచ్ పాయం సురేష్,కరాటే సీనియర్ మాస్టర్లు సాయిచంద్, సాయి ప్రకాష్, ఇన్స్ట్రక్టర్ నిర్మల, హేమలత, రవి,బైరి మహేందర్, గోపి, విజయ్‌కుమార్ అభినందించారు.

త్వరగా ప్రజావాణి వినతులకు పరిష్కారం

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి: ప్రజావాణిలో స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డిఆర్ఒ విజయల, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణిలు, డిఆర్‌డిఒ కౌసల్య దేవి, జెజెపి సిఇఒ రామ్ రెడ్డి, హౌసింగ్ పిడి గణపతిలతో కలసి ప్ర జల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో మొత్తం దరఖాస్తులు 103 రా గా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎం డార్స్ చేస్తూ ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. అందులో భూ సంబంధిత సమస్యల పై34, కలెక్టరేట్ 16, డిఆర్‌డిఒ, జిడబ్ల్యుఎంసి 7, పోలీసు శాఖ7, దరఖాస్తులు వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపైన దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించలేని దరఖాస్తులను ఆయా దరఖాస్తుదారునికి స్పష్టంగా తెలియపరచాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ నులిపురుగుల నిర్మూలన

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: ఈ నెల 10న జరిగే జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి జాతీయ నులి పరురుగుల నిర్మూలన కార్యక్రమంపైబె అధకారులలో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆరు మాసాలకు ఒకసార ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. 10న చేపట్టే కార్యక్రమంలో అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని, ఈ మాత్రలు నులి పురుగుల్ని నివారిస్తాయన్నారు.ఈ నెల 10న మాత్రలు వేసుకోని వారు 17న మాప్ అప్ రోజుగా నిర్వయించి నిర్మూలన మాత్రలు అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ మల్లికార్జునరావు, మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వర్లు, డిఈఓ రమేష్, డిడబ్ల్యుఒ ఫ్లోరెన్స్, డిపిఒ స్వరూప, ఎస్సీ సంక్షేమ అధికారి వి క్రమ్, డిప్యూటీ డిఎంఎచ్ఓ శ్రీదేవి, పిడి సిహెచ్ఐ స్వర్ణకుమారి, డిసిడిఒ గౌసియాబేగం పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో బిసిలకు 56శాతం రిజర్వేషన్లు

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయకార్యదర్శి కుమారస్వామి

ప్రజాపక్షం / నల్లబెల్లి : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో తెలిన 56 శాతం ప్రకరమే రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ ప్రకటించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని సుమంగళి ఫక్షన్ హాల్‌లో ఓదెల రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల హామీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం కల్పించాలని బిసి సంఘాల నేతలు కోరడం సరైంది కాదన్నారు. బిసికుల గణన చేసిన తర్వాత రాష్ట్రంలో బిసిల సం ఖ్య గణనీయంగా పెరిగిందని సర్వే నివేధిక ప్రకారం మంత్రి వర్గం ఉప సంఘానికి ఇచ్చిన నివేధికలో 56 శాతం బిసిలు ఉన్నట్లు గుర్తించారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు విధ్యా ,ఉపాధి రంగాల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసి రిజర్వేషన్లు అమలు చేయలన్నారు . ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు చీకటి ప్రకాష్ ,మండల కో కన్వీనర్ మేడేపల్లి రాజు , కోల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల్ని సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజాపక్షం/ఖిలా వరంగల్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వినతులను స్వీకరించి పరిష్కార నిమ్తితం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందచేశారు. కాగా ప్రజా వాణిలో మొత్తం 64 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, హెచ్ఓ రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిపి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రస్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరాటే ఇంటర్నేషనల్‌లో ద్వితీయ స్థానం సాధించిన దీక్షిత్

ప్రజాపక్షం/నెక్కొండ: ఫిబ్రవరి 2 ముంబైలో ఓపెన్ క్యాటగిరి 30వ ఛాంపియన్షిప్‌లో కరాటే పోటీలలో ఇంటర్నేషనల్ ద్వితీయ ర్యాంకు సాధించిన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దీక్షకుంటకు చెందిన వేములపల్లి దీక్షిత్, వేములపల్లి దీక్షిత్‌గౌతమీ విద్యానికేతన్ లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి, స్వగ్రామం దీక్షకుంటకు చెం దిన కరాటే మాస్టర్ వీరేందర్ శిక్షణలో నైపుణ్యం సాధించి వీరేందర్ ద్వా రా ముంబైలో ఫిబ్రవరి 1నుండి జరిగిన కరాటే పోటీలలో ఇంటర్నేషనల్ ద్వితీయ స్థానం పొందిన దీక్షిత్‌ను మండల ప్రజలు గ్రామ ప్రజలు పలు వర్గాలు అభినందించారు. దీక్షిత్‌ను మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షు డు దేసు లక్ష్మణ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, పిఎసిఎస్ నెక్కొండ చైర్మన్ మారం రాము, టిపిసిసి సభ్యుడు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, తాళ్లూరి నరసింహస్వామి, తోట కృష్ణ, దొడ్డ నగేష్, దొడ్డ విజయ్, గౌతమీ విద్యానికేతన్ కరాస్పాండెంట్ అనంతుల మురళి తదితరులు అభినందించారు.

యువత టాస్క్ రీజినల్ సెంటర్ ద్వారా శిక్షణా తరగతులు

ప్రజాపక్షం/ములుగు టౌన్: జిల్లాలోని యువతకు ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాస్క్ రీజినల్ సెంటర్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పిజి విద్యార్థులకు శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలని దివాకర టిఎస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయంలో శిక్షణా తరగతులు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతలో ప్రతిభ నైపుణ్యాలు పెంపొందించడానికి టాస్క్ ద్వారా శిక్షణ, ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నారని అన్నారు. టెక్నికల్ శిక్షణలో భాగంగా జావా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్‌మెంట్, ఫైథాన్ ప్రొగ్రామింగ్, డేటాబేస్ అప్లికేషన్స్, సి ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్, అల్గోరిథమ్స్, సూడో కోడ్, ఫుల్ స్టాక్ అప్లికేషన్స్ మొదలగు కోర్స్‌లలో ఉద్యోగా మెళకువలు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు అనగా ఐబిపిఎస్ నోటిఫికేన్స్, ఎస్‌బిఐ, రూరల్ బ్యాంక్స్, కోఆపరేటివ్ బ్యాంక్స్ నోటిఫికేషన్స్‌కు సంబంధించి శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని స ద్వినియోగం చేసుకొని మంచి ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకోవాలని యువతను కోరారు. టాస్క్ రీజినల్ సెంటర్ ద్వారా శిక్షణ తరగతులు కోర్సులకు సంబంధించి పూర్తి వివరాలకు 9618449360 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ శిక్షణా తరగతులు హాజరైన వారికి టాస్క్ ద్వారా జాబ్ మేళా నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు నవీన్ రెడ్డి టాస్క్ రీజినయల్ సెంటర్ హెడ్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకొని మంచి జాబ్స్ తెచ్చుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని సుధీర్ క్లస్టర్ మేనేజర్ తెలిపారు.

విభజన హామీలను విస్మరించిన కేంద్రం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ అభివృద్ధికి నయా పైసా కేటాయించలేదని, తెలంగాణపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, తెలంగాణ ప్రజలు బిజెపిని ఇక ఇప్పటికీ క్షమించరని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మండిపట్టారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు జరిగిన తీవ్ర అన్యాయానికి నిరసనగా సోమవారం భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ లల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన, ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొన్నారు. భూపాలపల్లిలో జరిగిన నిరసన ధర్నా కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. భూపాలపల్లిలో జరిగిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. కొద్దిసేపు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ఈ సందర్భంగా నిరసన ధర్నాలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా అని, విభజన హామీలను బయ్యారం ఒక్క ఫ్యాక్టరీ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, లాంటి విభజన హామీలను విస్మరించారని, తీవ్ర అ న్యాయం జరిగిందని అన్నారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, టిపిసిసి సభ్యుడు చల్లూరి మధు, రూరల్ అధ్యక్షుడు సుంకరి రామచంద్రయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, జిల్లా నాయకులు బుర్ర కొమరయ్య, సాంబమూర్తి, అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, కాంగ్రెస్ నాయకులు తోట రంజిత్, మహేందర్, బీర్తి పృద్వి, మండల పార్టీ అధ్యక్షులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎస్‌పి కిరణ్ ఖరే

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : పోలీసు ఉద్యోగం శారీరక శ్రమతో పాటు మానసిక ఒత్తిడితో కూడుకుందని దానిని అధిగమించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్‌పి కిరణ్ పేర్కొన్నారు. అనునిత్యం పోలీసు విధులలో నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడంతో పాటు, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లాలోని వివిధ శాఖలకు, యువతకు క్రికెట్ పోటీలను ఎస్‌పి కిరణ్ ఖరే, జిల్లా అటవీ శాఖ అధికారి ఎం.సవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సింగరేణి జిఎం పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ మైదానంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ రత్నం ఆధ్వర్యంలో 4 బృందాలు పరేడ్‌ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేశారు. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు తెలియజేస్తున్నటువంటి శాంతి కపోతాలను, బెలూన్లను గాలిలోకి వదిలి, జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు, పోలీసు క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి కిరణ్ ఖరే మాట్లాడుతూ, క్రీడల ద్వారా ఐకమత్యం, టీమ్స్ స్పిరిట్, క్రమశిక్షణ అలవడుతాయని, ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వివిధ శాఖలు, ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పని చేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో ఆడాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా క్రీడల నిర్వహణ జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. మరో మూడు రోజులు ఈ క్రీడలు కొనసాగుతాయని అన్నారు. అనంతరం నవీన్ రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖ క్రీడలు నిర్వహించడం సంతోషమని, ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి బోనాల కిషన్, ఎఆర్ ఎఆర్ అదనపు ఎస్‌పి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి, చిట్యాల, మహాదేవ్ పూర్, సిఐలు నరేష్ కుమార్, మల్లేష్ రామచందర్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం, కిరణ్, శ్రీకాంత్ జిల్లా పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ శాఖల క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ క్రీడాకారులకు సూచించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రెండు రోజుల క్రితం ముగిసిన రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ మీట్‌లో ప్రతిభ కనబరిచి పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను వరంగల్ పోలీస్ కమిషనర్ సొమవారం అభినందించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో ఏర్పాటు చేసిన అభినందన సభకు వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను పోలీస్ వ్యక్తిగతంగా కలిసి వారికి అభినందనలు తెలిపారు. క్రీడాకారులను ఉద్యేశిస్తూ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర స్థాయిలో చక్కటి ప్రతిభ కనబరిచినందుకు ముందుగా క్రీడాకారులకు అభినందనలు తెలుపు తూ పూర్తి స్థాయిలో క్రీడలకు సమయాన్ని కేటాయించే పోలీస్ అధికారులకు పూర్తి స్థాయి సహాయ సహకారాలను అందజేయడం జరుగుతుందని. అదనపు డిసిపి రవి, ఎసిపిలు నాగ య్య, పార్థసారధి, సురేంద్ర, మధుసూధన్,అనంతయ్య, చంద్రశేఖర్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

కేంద్ర వివక్షను తెలంగాణ ప్రజలు క్షమించరు

ధర్నాలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రజాపక్షం/పరకాల : కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి నిధుల విడుదలలో చేస్తున్న వివక్ష తీరును తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రమైన పరకాలలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. పరకాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నుండి బయలుదేరి బస్టాండ్ సమీపం మొదలు అంబేద్కర్ సెంటర్ వరకు సాగింది అక్కడ కొన్ని గంటలపాటు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను మోయలేరని దానికి స్వస్తి పలక పోయినట్లయితే రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పైసా నిధులు కేటాయించకపోవడంపై ఆగ్రహంతో తీవ్రమైన విమర్శలు చ

ఫోకస్

యువతరంగం

గ్రామీణ ఉపాధి హామీపై చిన్నచూపు

కేంద్రంలోని మోదీ సర్కారుకు మొదటి నుంచి నిరుద్యోగుల పట్ల సానుకూల వైఖరి లేదన్నది పలు సందర్భాల్లో స్పష్టమైంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ సైతం ఇదే విషయాన్ని మరోసారి రుజువు చేసింది. ప్రభుత్వం ఉపాధి అవకాశాలు పెంచలేకపోతున్న తరుణంలో, ఎక్కువ మంది యువత గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడడాన్ని గత కొంతకాలంగా చూస్తున్నాం. ప్రత్యేకించి కొవిడ్ 19 మహమ్మారి తర్వాత వసల కార్మికులు చాలా మంది తమతమ స్వస్థలాలను చేరుకోవడంతో, ఈ పథకం ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ తరుణంలో, బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సిన కేంద్రం, ప్రస్తుత ఆర్థిక సంవత్సర కేటాయింపు రూ. 86,000 కోట్లను, వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ కొనసాగిస్తున్నట్టు ప్రకటించడం అన్యాయం. 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీకి కేటాయించిన మొత్తం రూ. 60,000 కోట్లు. అయితే, అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేసిన మార్పులు చేర్పులతో, ఖర్చు రూ. 89,153.71 కోట్లుగా తేలింది. కానీ, మరుసటి ఆర్థిక సంవత్సరంలో ఈ వాస్తవ ఖర్చుల కంటే బడ్జెట్ కేటాయింపు తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ రూ. 86,000 కోట్లకు మంచి ఇచ్చేది లేదని కేంద్రం తేల్చిచెప్తున్నది. పేదరిక నిర్మూలన, 2047 నాటికి ప్రపంచ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యాలను పదే పదే ప్రకటిస్తున్న మోదీ ప్రభుత్వానికి గ్రామీణ ఉపాధి హామీ పథకంపై చిన్నచూపు ఎందుకో? మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)గా పిలిచే ఈ పథకంలో చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి, వాటి చెల్లింపు కోసం 20 కేటాయింపులను వెచ్చిస్తామని కూడా కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో పేర్కోవడం ఈ పథకంపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నది.ఇండియన్ జర్నల్ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐజెఎల్ఇ) లో ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో, గ్రామీణ ఉపాధి హామీ చట్టం కార్మికులకు ఆలస్యమైన వేతనాలలో కేంద్ర ప్రభుత్వం రూ. 39 కోట్ల బకాయి ఉందని వెల్లడించింది. ఈ అధ్యయనం 2021–22లో రూ. 31.36 మిలియన్ల వేతన లావాదేవీలను విశ్లేషించింది. చెల్లింపు వేగాన్ని మెరుగుపరచడానికి బదులుగా ఆధార్ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్) వల్ల ఈ ఆలస్యం జరిగిందని గుర్తించింది. 2024లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ హామీ పథకానికి ఎబిపిఎస్‌ను తప్పినిసరి చేసింది. ఫలితంగా ఉపాధి హామీ కార్మికుల్లో సుమారు 57 శాతం మంది అర్హత కోల్పోయారు. చెల్లింపులను క్రమబద్ధీకరించడం, పారదర్శకతను పెరుగుపరచడం వంటి లక్ష్యాలతో ఎబిపిఎస్‌ను తీసుకొచ్చినట్టు కేంద్రం ప్రకటించగా, వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ఎబిపిఎస్ కారణంగా లెక్కించని లేదా జాప్యం చేసిన చెల్లింపులు దేశ వ్యాప్తంగా రూ.400 కోట్లకుపైగానే ఉండవచ్చని అంచనా. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోకపోవడం కూడా ఈ జాప్యానికి ఒక కారణమని ఐజెఎల్ఇ స్పష్టం చేసింది. 2021–22 ఆర్థిక సంవత్సరంలో, తప్పనిసరైన 7 రోజుల వ్యవధిలో కేవలం 29 శాతం మాత్రమే ప్రాసెస్ అయ్యాయి. ఇందుకు కేంద్ర ప్రభుత్వ కేటాయింపులను ఐజెఎల్ఇ హైలైట్ చేసింది. 2021–22 లో, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో కేవలం 0.41శాతాన్ని మాత్రమే ఉపాధి హామీకి కేటాయించారు. ఈ పథకం ద్వారా పనులను కోరుతున్న వారి సంఖ్యకు లేదా డిమాండ్‌కు, కేంద్ర ప్రభుత్వ కేటాయింపులకు ఎక్కడా పొంతన లేదు. కొవిడ్ మహమ్మారి కాలం (2020–21)లో ఇది కేవలం 0.56 శాతం మాత్రమే. ఈ మొత్తం 2023–24, అదే విధంగా 2024–25 ఆర్థిక సంవత్సరాల్లో 0.2 శాతానికి తగ్గింది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుంటే, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు కనీసం నాలుగు రెట్లు పెరగాలి. అంటే జిడిపిలో ఈ పథకానికి 1.2 నుండి 1.5 శాతం వరకు కేటాయింపు జరిగాలి. కాగా, 2021లో ప్రవేశపెట్టిన కుల ఆధారిత వేతన విభజన, చెల్లింపులను షెడ్యూల్ కులం (ఎస్‌సి), షెడ్యూల్ తెగలు (ఎస్‌టి), 'ఇతర' కేటగిరీలుగా వర్గీకరించడం వల్ల 'ఇతర' కులాల కార్మికుల చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. ఎస్‌టిలకు 42 శాతం, ఎస్‌సిలకు 47 శాతం చెల్లింపులు జరిగితే, ఇతరులకు చెల్లింపులు 33 శాతం మాత్రమే. ఎంజిఎన్ఆర్ఇజిఎ పథకాన్ని దేశంలో గ్రామీణ ఉపాధి హామీని అందించే లక్ష్యంతో, సామాజిక భద్రత కోసం కేంద్రం ప్రవేశపెట్టింది. 2005లో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నోడల్ మంత్రిత్వ శాఖగా రూపొందింది. నైపుణ్యం లేని మాన్యువల్ పనిని చేపట్టడానికి ఇష్టపడే నమోదిత గ్రామీణ కుటుంబాలకు కనీసం 100 రోజుల హామీ వేతన ఉపాధిని అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. 100 శాతం పట్టణ జనాభా ఉన్న జిల్లాలను మినహాయించి, ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా విస్తరించారు. డిమాండ్ ఆధారంగా ఉపాధిని కల్పిస్తారు. ఒక వేళ 15 రోజులలోపు ఉపాధి పని దక్కకపోతే, అలాంటి కార్మికులు నిరుద్యోగ భృతికి అర్హులవుతారు. ఈ భృతి మొదటి 30 రోజులలో కనీస వేతనంలో నాలుగింట ఒక వంతు, ఆ తర్వాత కనీస వేతనంలో సగం వరకూ ఉంటుంది. గ్రామసభ సిఫార్సుల ఆధారంగా గ్రామ పంచాయతీల ద్వారా కనీసం 50 శాతం పనిని అమలు చేయడం ద్వారా ఈ పథకం అట్టడుగు స్థాయి ప్రణాళిక ప్రాధాన్యతను వివరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నైపుణ్యం లేని కార్మికుల వ్యయాలను 100 శాతం, వస్తు ఖర్చుల్లో 75 శాతం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మిగతా 25 శాతం వస్తు వ్యయాలను సమకూరుస్తాయి. ఈ పథకంలో వేతనాలు రాష్ట్రనిర్దిష్ట కనీస వేతన రేట్లపై ఆధారపడి ఉంటాయి. పారదర్శకత కోసం కార్మికుల బ్యాంకు లేదా ఆధార్‌లింక్డ్ ఖాతాలకు నేరుగా చెల్లింపులు జరుపుతారు. ఇంతటి ప్రాధాన్యతగల పథకాన్ని మోదీ సర్కారు నిర్వీర్యం చేస్తున్నది. భవిష్యత్తులో ఎవోకొన్ని కారణాలు చెప్పి, పథకాన్ని ఎత్తివేసినా ఆశ్చర్యం లేదు. ఉద్యోగ కల్పనలో దారుణంగా విఫలమవుతున్న మోదీ సర్కారు, కనీసం ఉన్న పథకాలను సక్రమంగా అమలు చేయడంలోనూ నిర్లక్ష్యం వహించడం దారుణం.

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు...

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బకాయిల చెల్లింపులు కోరుతూ నిరసన చేస్తున్న ఉపాధి హామీ కార్మికులు.

వృద్ధాప్యం శాపం కారాదు..

అవుననుకున్నా.. కాదనుకున్నా... ప్రతి వ్యక్తికీ వృద్ధాప్యం అనివార్యం. ఎప్పటికీ ఒక వయసులో ఉండిపోవడం అసాధ్యం. బాల్యం, కౌమారం, యౌవనం, వార్ధక్యం... ఈ నాలుగూ జీవితంలో నాలుగు ప్రధానాంశాలు. మిగతా మూడూ దశలూ చాలా త్వరగా ముగిసినట్టు... వార్ధక్యం మాత్రం వెంటాడి వేధిస్తున్నట్టు భావించేవాళ్లు కోకొల్లలు. వృద్ధాప్యాన్ని శాపం అనుకునే వారి సంఖ్యకు కొదువ లేదు. కానీ, వార్ధక్యాన్ని భారంగానో... శాపంగానో భావించి, లోలోపల కుంగిపోవాల్సిన అవసరం లేదు. జీవితంలో ఇది సంధ్యాసమయం. ఉన్నది మరికొద్దిపాటి జీవితమే. అందుకే, ఊపిరి పీల్చుకుంటున్న ప్రతి క్షణం సానుకూల దృష్టితోనే కనబరచాలి. ఉత్సాహంతో చివరి మజిలీని పూర్తి చేయడానికి సిద్ధపడాలి. వార్ధక్య దశ అందరి జీవితాల్లోను ప్రవేశిస్తుంది. తాత్వికచింతనకు, సామాజిక సేవకు ఈ దశ ఎంతో అనుకూలమైనది. శాస్త్రీయ, జీవన ధర్మాలను ఆచరించడానికీ ఈ దశ ఉపయోగకరంగా ఉంటుంది. ఈ దశలో శాంతి మార్గంలో నడవాలని రుషులు ప్రబోధించారు. వృద్ధాప్యంలో మనిషి సమస్యల నుంచి విముక్తిని ఆపేక్షిస్తాడు. ప్రశాంత జీవనవిధానం కోరుకుంటాడు. ఈ దశను ఆదర్శంగా మలచుకుంటే ఎలాంటి వాళ్లయినా పరిపూర్ణ మనశ్శాంతిని పొందుతారు. సాధారణంగా మనిషి వృద్ధాప్య దశ గురించి ముందుగా ఆలోచించి భయంతోను, ఆందోళనలోను నిత్యం విచారగ్రస్తుడవుతుంటాడు. దీనివల్ల మానసిక స్థైర్యం కోల్పోయి ముందుగానే వృద్ధుడవుతాడు. నిజానికి వృద్ధాప్యం శరీరానికే తప్ప మనసుకు కాదు. ఎలాంటివాళ్లకైనా మనసెప్పుడూ నిత్యనూతనంగా, చైతన్యవంతంగా ఉండాలి. మనసు ఆశలకు, ఆశయాలకు నిలయం. ఆ మనసును నచ్చిన వ్యాపకంవైపు, మంచి కార్యాల వైపు మళ్ళిస్తే మనిషి తన వయసును, వార్ధక్యాన్ని కూడా మరిచిపోతాడు. ఇంక వృద్ధాప్యంలో ప్రతి మనిషీ ఓ తోడుకోసం పరితపిస్తాడు. ఒంటరితనం భరించలేకపోతాడు. ఎవరు దూరమైనా విలవిల్లాడిపోతాడు. దీనికి కారణం ఆత్మజ్ఞానం లోపించడమే. ఆధ్యాత్మిక పథంవైపు ప్రయాణించే మనిషి తన శరీరం గురించి ఏ క్షణమూ ఆలోచించడు. అంతర్ముఖుడై పరమాత్మ అన్వేషణలో నిమగ్నమవుతాడు. ఎవరు దూరమైనా చింతించడు. మానవ జన్మ సార్థకతను తెలుసుకుంటూ సన్మార్గంవైపు ప్రయాణిస్తాడు. ఆత్మవిశ్వాసం కలిగిన మనిషి వార్ధక్యంలోనూ అఖండ విజయాలు సాధిస్తాడని ఎందరో మహానుభావులు రుజువుచేశారు. ఏభైమూడో ఏట మార్గరేట్ థాచర్ బ్రిటన్ను తొలిమహిళా మేయర్‌గా ఎన్నికైంది. తన అరవై అయిదో ఏట విన్స్టన్ చర్చిల్ ప్రధానమంత్రి అయ్యాడు. హిట్లర్‌ని ఎదుర్కోగలిగాడు. ప్రతి మనిషిలోనూ అనంతమైన శక్తి అంతర్గతంగా ఉంటుంది. దాన్ని వెలికి తీయాలి. ఛార్లెస్ డికెన్స్ రచనలకు మొదట్లో ఆదరణ దక్కలేదు. అయినా అతడు నిరాశపడలేదు. ఆత్మవిశ్వాసంతో రచనా వ్యాసంగం కొనసాగించి గొప్ప రచయితగా పేరు సంపాదించాడు. థామస్ ఆల్వా ఎడిసన్కి చెందిన మిలియన్ల డాలర్ల విలువచేసే సంస్థ అగ్నికి ఆహుతి అయినప్పుడు ఆయన వయసు అరవై ఏడు. అప్పుడు ఎడిసన్ ఊహ ఎలా ఉందో తెలుసా! ఇక ముందు కొత్త విషయాలపై దృష్టి కేంద్రీకరించాలని భావించి ఫొటోగ్రఫీని కనుగొన్నాడు. ఎవరికైనా తన శక్తి యుక్తులమీద పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. అప్పుడు ఏ దశలోనైనా మనిషి ఉత్సాహభరితంగా ఉంటాడు. వృద్ధాప్యం గురించి ఏనాడూ ఆందోళన చెందడు. ఒక్కసారి ప్రకృతిని గమనించండి. ఎన్ని సంవత్సరాలైనా వృక్షాలు ఫలసంపదను ప్రాణికోటికి అందిస్తూనే ఉంటాయి. అలాగే పశుపక్ష్యాదులు తమ ఆహారాన్ని తామే సంపాదించుకుంటాయి. మనిషి కూడా ప్రకృతిని స్ఫూర్తిగా తీసుకోవాలి. వార్ధక్యాన్ని మరిచిపోయి ప్రశాంతమైన జీవన విధానం అవలంబించాలి. ఆదర్శవంతమైన కార్యాలు చేయాలి. పనిలో నిమగ్నమైన మనిషికి వార్ధక్యం గురించి ఎలాంటి ఆలోచనారాదు. అప్పుడతడు ప్రజల దృష్టిలో వృద్ధుడు కాదు. ఓ ఆదర్శపురుషుడు.

5న కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనలు

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కేంద్ర సంఘాల పిలుపు మేరకు ఈనెల 5న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్షాల రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎఐటియుసి, సిఐటియు, బికెఎంయు, ఎఐకెఎస్ రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేయడాన్ని వ్యతిరేకిస్తూ, రైతు చట్టాలను రద్దు చేయాలని, వ్యవసాయ కార్మికులకు పనిదినాలు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి అధిక నిధులు కేటాయించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్ సంస్కరణ బిల్లును రద్దుచేయాలని దేశవ్యాప్త నిరసనలో భాగంగా కరీంనగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, సమ్మయ్య, బికెయంయు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బోయిన అశోక్, కోహెడ సృజన్‌కుమార్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బండ రాజిరెడ్డి, సిఐటియు కార్యదర్శి ఎల్ల రమేష్, నాయకులు మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం సుంకర సంపతి, రాయికంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యావిధానం రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

ప్రజాపక్షం/దేవరకొండ : కేంద్రప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న జాతీయ నూతన విద్యా విధానం రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఎఐ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు అన్నారు. సోమవారం పల్లా పర్వతిరెడ్డి భవన్‌లో ఈనెల 9,10వ తేదీలలో హైదరాబాద్‌లో జరగనున్న ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాల కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం, దేశ విద్యావ్యవస్థకు గొడ్డలి పెట్టని, దీనిపై విద్యార్థులు సంఘటితమై ఉద్యమించాలన్నారు. విద్య కేంద్రీకరణ, విద్యా వ్యాపారీకరణ, విద్య కార్పోరేటీకరణ, విద్య కాషాయికరణతో పాటు యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీస్తూ వీటిని విభజించే కుట్ర చేపడుతున్నారన్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు వస్తున్న పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సూరిగి వినయ్, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషోద్దిన్, కోశాధికారి శివకుమార్, గర్ల్స్ కన్వీనర్ జ్యోతి, కోకన్వీనర్ స్వాతి, వీణ, మండల కార్యదర్శి దినేష్, పట్టణ కార్యదర్శి సిద్దార్థ్, భాను, హరీష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతు గిట్టుబాటుపై 'సిండికేట్ వేటు'!

రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం జెండాపాట అడ్డుకున్న సిపిఐ, రైతు సంఘం

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం మార్కెట్‌లో ధర రాకుండా మిర్చి రైతులను సిండికేట్ వ్యవహారం దెబ్బతీస్తున్నదని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సోమవారం సిపిఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన మిర్చి జెండాపాటను అడ్డుకున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా అడ్డుకుంటున్నారని రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆందోళనతో దిగివచ్చిన మార్కెట్ కమిషనర్ తిరిగి జెండాపాటను నిర్వహించారు. మొదట రూ.13వేలుగా నిర్ణయం జరిగిన జెండాపాట సిపిఐ, రైతుసంఘం ఆందోళన తర్వాత మరల జెండాపాట నిర్వహించగా రూ.14,200లు నిర్ణయించారు. రైతు సంఘం, సిపిఐ ఆందోళనతో వ్యాపార లావాదేవీలు రెండుగంటల పాటు నిలిచిపోయాయి. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఈ ఏడాది మిర్చి పంటకు పెట్టుబడి గణనీయంగా పెరిగిందని, అదే సమయంలో దిగుబడి తగ్గిందని తెలిపారు. వ్యాపారులు, మార్కెట్ ఉద్యోగులు కలిసి రైతులను దోపిడీ చేస్తున్నారని, ధర తగ్గేందుకు సిండికేటే కారణమన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకుండా వ్యాపారులు అడ్డుకుంటుంటే దానిని అడ్డుకోవాల్సిన ఉద్యోగులు యధాశక్తి సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధర రాకుండా అడ్డుపడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లలో గిట్టుబాటు ధర కల్పించేవిధంగా చర్యలు చేపట్టడంలో వైఫల్యం చెందుతుందన్నారు. జెండాపాటకు వ్యాపారులు కొద్ది మంది మాత్రమే హాజరవుతున్నారని, ఈ సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే మార్కెట్ కార్యకలాపాలను అడ్డుకుంటామని హేమంతరావు హెచ్చరించారు.

గిట్టుబాటు లభించేలా చర్యలు..

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటామని ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. ఆందోళన చేస్తున్న సిపిఐ, రైతు సంఘం నాయకులతో తన చాంబర్‌లో చర్చలు జరిపారు. మిర్చి ధర తగ్గడానికి కారణాలను సిపిఐ, రైతు సంఘం నేతలు చైర్మన్‌కు వివరించారు. గోనెసంచి ధర బయట మార్కెట్‌లో రూ.50లు ఉండగా వ్యాపారులు రైతులకు రూ.25లు మాత్రమే చెల్లిస్తున్నారని, రైతులకు నష్టం జరగకుండా వ్యాపార లావాదేవీలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. చర్చల అనంతరం ఎఎంసి చైర్మన్ హన్మంతరావు మాట్లాడుతూ త్వరలో రైతు సంఘం నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తామని, రైతులకు గిట్టుబాటు ధర లభించేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్,రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కెజానిమియా, రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, కృష్ణ, పగడాల మల్లేష్, రైతు సంఘాల నాయకులు పుచ్చకాయల సుధాకర్, యడ్లపల్లి శంకరయ్య, ఇటికాల రామకృష్ణ, బాగం ప్రసాద్, కూచిపూడి రవి, నూనె శశిధర్, రాసాల మోహన్‌రావు, అబ్బూరి మహేష్, ఎం.శ్రావణ్, బానోత్ రవికుమార్, పోటు పూర్ణచందర్‌రావు, మార్గం శ్రీను, కృష్ణ, నంబూరి శంకర్‌రావు, వెన్నం భాస్కర్‌రావు, మామిళ్ల సుదర్శన్, భూక్యా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు

సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : అసంఘటిత రంగ కార్మికులైన ఆటోడ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ యాదగిరిగుట్ట కార్యాలయంలో జై హనుమాన్ ఆటో డ్రైవర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) సభ్యుల జనరల్ బాడీ సమావేశం తుమ్మల ఇస్తారీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి గోద శ్రీరాములు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మహాలక్ష్మీ పథకం పేరుతో మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోలలో ప్రయాణికులు ఎక్కకపోవడంతో ఆటో డ్రైవర్లు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12000 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టడం జరిగిందని, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా నేటికీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సం వత్సరానికి రూ.12000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పెరబోయిన పెంటయ్య, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరబోయిన మహేందర్, ఎఐటియుసి యాదగిరిగుట్ట మండల కార్యదర్శి గోపగాని రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, సిపిఐ యాదగిరిగుట్ట మండల కార్యవర్గ సభ్యులు పెరబోయిన బంగారి, రాజాపేట మండల కార్యదర్శి చిగుర్ల లింగం తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. గౌరవ అధ్యక్షుడిగా గోరేటి రాములు, గౌరవ సలహాదారులు ఎస్‌కే మన్సూర్ పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుమ్మల ఇస్తరి, అధ్యక్షుడిగా కళ్లెం సిద్దులు, ఉపాధ్యక్షులుగా నర నాగరాజు, ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండ్లపల్లి శీను, సహాయకార్యదర్శులుగా మల్లెబోయిన బాబు, నల్లమాసు శ్రీను, కోశాధికారిగా తంతాలపల్లి పాండుతోపాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రెండో ఎఎన్ఎం సమస్యలు పరిష్కరించండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ వినతి

ప్రజాపక్షం/రెబ్బెన : రెండవ ఎఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. 2వ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం రెబ్బెన పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 2వ ఎఎన్ఎం పోస్టులు పెంచి, 100శాతం గ్రాస్ శాలరీ అందించడమే కాక, గ్రాట్యూటీ, హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్‌లో ఉన్న 7 నెలల పిఆర్‌సి చెల్లించాలన్నారు. రెండవ ఎఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో 6న డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. 17 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జాయింట్ కార్యదర్శి ప్రమీల, 2వ ఎన్ఎన్ఎంలు వనిత, తులసి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిఎంపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిపోలో కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్న డిపో మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. డిఎంపై చర్యలను తీసుకోవాలని కోరుతూ డ్రైవర్లతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ వేధింపులు పెరిగిపోతున్నాయని, కార్మికులను మానసికంగా ఒత్తిడి గురిచేస్తున్నారని ఆరోపించారు. కొన్ని సంవత్సరాలుగా టీమ్ డ్రైవర్లుగా పని చేస్తున్న వారు టికెట్లు ఇవ్వడం, కార్గో నిర్వహణ, రిజర్వేషన్ చెక్ చేయడం, ప్రయాణికుల ఫోన్ కాల్స్ కారణంగా పని ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీమ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకపోతే 11నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్మికులు, కర్షకులను నిరాశపరిచిన బడ్జెట్

ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల్లో కార్మిక కర్షకులకు, పేద ప్రజలను నిరాశపరచిందని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో సిపిఐ కార్యాలయం కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో రిక్షా కార్మికుల యూనియన్ అత్యవసర సమావేశం పెంద్ర కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన 202526 బడ్జెట్ పేదల ప్రజలను వంచన చేసి బడా కార్పొరేట్ శక్తులకు ఉడిగం చేసేలా ఉందన్నారు. దేశ సమ్మిళిత వృద్ధిని ఏ మాత్రం పట్టించుకున్నట్లు లేదన్నారు. ఈ బడ్జెట్ కార్మిక, రైతు, పేద వర్గాలకు అన్యాయం చేసేలా ఉందని విమర్శించారు. వ్యవసాయ అభివృద్ధికి తగిన కేటాయింపులు జరగలేదని పేదవాళ్లు మరింత పేదవారుగా, సంపన్నులు మరింత సంపన్నులుగా చేసే బడ్జెట్‌లా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ప్రాంతీయ గౌరవ అధ్యక్షులు చామల అశోక్ కుమార్, రిక్షా యూనియన్ కార్యదర్శి వాడపల్లి వెంకన్న, రిక్షా కార్మికులు బండ్ల హనుమంతు, వాడపల్లి శ్రీను, బాణోతు రంగా, రాము, గాబ్రియల్, లక్ష్మ య్య, కోటయ్య, గూడెలి రాంబాబు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లికి నిధుల విడుదలపై హర్షం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి పొందిన దురాజ్‌పల్లి జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.5కోట్లను విడుదల చేయడం పట్ల యాదవ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు పగిడి రామలింగయ్యయాదవ్ పాల్గొని మాట్లాడుతూ నిధులు విడుదలకు కృషి చేసిన ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 16 నుంచి 20 వరకు జరిగే జాతరకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, చిమట శ్రీనివాస్, వెంకన్న, గంగుల భిక్షం, మహేష్, సురేష్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్న బిసి,ఎస్‌సి,ఎస్‌టి మైనార్టీ విద్యార్థుల సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ అన్నారు. అసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ఒకవైపు విద్యార్థి లోకం అడుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాతర్ం కాలేజీ విద్యార్థులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు రాత్రికి రాత్రి విడుదల చేస్తూ వారికి దోచిపెడుతుందని ఆరోపించారు.తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల బకాయిలుగా ఉన్న 4600 కోట్ల రూపాయలను తక్షణమే విడుదల చేయాలి ఎస్‌సి,ఎస్‌టి మైనార్టీ విద్యార్థుల వలె బిసి విద్యార్థులకు కూడా పూర్తి ఫీజుల రియంబర్స్మెంట్ను అమలు చేయాలి ప్రవేట్ యూనివర్సిటీలో కూడా బిసి,ఎస్‌సి,ఎస్‌టి,మైనార్టీ సామాజిక రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు.ఈ విలేకరుల సమావేశంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా నాయకులు నర్సింగ్ శివకుమార్ ,కన్నబోయిన పరమేష్ యాదవ్ , శంకర్ ఏర్పుల శ్రవణ్ ,మహేష్ ,పృథ్వీరాజ్ ,మణికంఠ ,సతీష్ ,హరికృష్ణ ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభిషేకం

ప్రజాపక్షం/ఉండవెల్లి: అయిదవ శక్తిపీఠమైన శ్రీ జోగులాంబ అమ్మవారి నిజస్వరూప దర్శనం చేసుకునేందుకు అభిషేకం కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు చల్లా ఆగస్టారెడ్డి చండీ హోమం కళాభిషేకం తదితర కార్యక్రమాల్లో పాల్గొని వసంత పంచమి వేడుకలను సోమవారం అధికారులు భక్తులు ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా జయప్రదంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక అభిషేకాలు కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఆలయ అధికారులు అర్చకులు శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ బి.నాగేశ్వర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి సురేందర్ కుమార్, డైరెక్టర్లు, పార్టీ కార్యకర్తలు చల్లా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు

ప్రజాపక్షం/ఎర్రవల్లి: ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాల విద్యార్థులకు వసంత పంచమి శుభాకాంక్షలు పాఠశాల కరస్పాండెంట్ మధులిక రెడ్డి తెలియజేశారు. ఆ తర్వాత సరస్వతి పూజ భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన కరస్పాండెంట్ మధులిక రెడ్డి మొదటగా సరస్వతి దేవి పూజ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించి నూతన విద్యార్థులకు ఉచిత అడ్మిషన్ పొందినందుకు గాను అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం కూడా విద్యాబుద్ధులు క్రమ క్రమంగా పెంపోందించు కునేలా చూడాలని పాఠశాల కరస్పాండెంట్ మధులికరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ వీర శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్ మధులికరెడ్డి, ప్రిన్సిపాల్ నందిని కేని అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఎంసిఎంసి మీడియా సెంటర్ ప్రారంభం : ఎన్నికల రిటర్నింగ్ అధికారి

మొదటి రోజు బోణీ అయిన నామినేషన్

ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి : వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు.సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అనంతరం మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3 నుండి 10 వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, ఈనెల 8, 9 తేదీలలో ప్రభుత్వ సెలవు దినాలలో ఎలాంటి నామినేషన్లు స్వీకరించడం జరగదని ,ఈనెల 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని ,ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4:00 వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ వివరించారు .ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు తాను రిటర్నింగ్ అధికారిగా, నల్లగొండ రెవిన్యూ అదనపు కలెక్టర్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గాను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా ఏవైనా సందేహాలు ఉన్నట్లయినా లేదా క్లరికల్ సమస్యలకు సంబంధించి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం, చట్ట ప్రకారం పాటించాల్సిన నియమ నిబంధనలన్నిటిని అభ్యర్థులు , రాజకీయ పార్టీలు, తప్పకుండా పాటించాలని కోరారు.అభ్యర్థుల అఫిడవిట్ సమర్పణ, అన్నెక్సర్ 26, ఫోటోల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు.ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకొని 100 మీటర్లు, 200 మీటర్ల పరిధిలో పాటించాల్సిన నిబంధనాలను నిర్ధారించడం జరిగిందని ,రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ,అందరూ ఈ నిబంధనలను పాటించాల్సిందిగా ఆమె కోరారు. వరంగల్ ఖమ్మం నల్లగొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 200 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ముసాయిదా జాబితా ప్రకారం 24905 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు నల్గొండ సమీపంలోని అర్జాల బావి వద్ద ఉన్న మార్కెటింగ్ గోదాంలో ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ విషయమై ఎన్నికల కమిషన్ కు ప్రతిపాదనలు పంపించనున్నట్లు ఆమె తెలిపారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికలకు సంబంధించి వివిధ మాధ్యమాల ద్వారా జారీ చేసే ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు.

ఎంసిఎంసి మీడియా సెంటర్ ప్రారంభం

జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) మీడియా సెంటర్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంసిఎంసి ద్వారా ప్రతిరోజు వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ప్రచురితమయ్యే చెల్లింపు వార్తలు ,ఎన్నికల ప్రవర్తనా నియమావళి , వ్యతిరేక వార్తలు, అనుకూల వార్తలు తదితర వాటిని పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అంతేగాక ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఇచ్చే రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతిని జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి చెల్లింపు వార్తలకు అవకాశం ఇవ్వకుండా చూడాలని కోరారు. పోలింగ్ ముందు విధించే సైలెన్స్ పీరియడ్ లో సైతం నిబంధనలు అన్నింటిని పాటించాలని ఆమె కోరారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్,పాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఎంసిఎంసి సభ్యులు కోటేశ్వరరావు,సభ్యులు శేషాచార్యులు, కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్ తదితరులు ఉన్నారు.

మొదటి రోజు బోణీ అయిన నామినేషన్

వరంగల్ ఖమ్మం నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ ప్రక్రియ సోమవారం నుండి ప్రారంభమైంది మొదటి రోజే ప్రజావాణి పార్టీ తరపున అభ్యర్థి లింగిడి వెంకటేశ్వర్లు తన నామినేషన్ ఒక సెట్ ను ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి దాఖలు చేశారు.

తెలంగాణపై కేంద్రం వివక్షపై పోరాటం

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు

ప్రజాపక్షం/సూర్యాపేట: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షపై కాంగ్రెస్ పార్టీ అవిశ్రాంత పోరాటం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చకిలం రాజేశ్వర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు నామమాత్రపు కేటాయింపులు చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ వాణిజ్యసెల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వివిధ పన్నుల రూపంలో కేంద్రానికి కోట్లాది రూపాయలు చెల్లిస్తున్న రాష్ట్రానికి రావాల్సిన వాటాగా రావాల్సిన నిధులను కేటాయించకపోవడం సరైంది కాదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమ మిత్ర రాష్ట్రాలకు, సమీపంలో ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చేపట్టనున్న రీజనల్ రింగ్ రోడ్డు, రింగ్ రైల్, మూసీ పునరుజ్జీవనానికి, మెట్రో రైలు విస్తరణ, కొత్త రైల్వే లైన్‌లకు, జాతీయ రహదారులకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు తీసుకరాలేని కేంద్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్, బచ్చలకూరి శ్రీనివాస్, వేములకొండ పద్మ, నాయకులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, నాగుల వాసు, రుద్రంగి రవి, వెన్న మధుకర్ రెడ్డి, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, ఆలేటి మాణిక్యం పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి గుండు సున్నా

ప్రజాపక్షం /నల్లగొండ టౌన్: కేంద్ర బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా బిజెపి ప్రభుత్వం వివక్ష చూపించిందని డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు..కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా టిపిసిసి పిలుపు మేరకు సోమవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్ లో పార్టీ శ్రేణులు నల్ల బ్యాడ్జి ధరించి నిరసన వ్యక్తం చేశారు. . అనంతరం ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కేంద్రం బడెట్ కేటాయింపులో తెలంగాణపై వివక్షత చూపించిందని ధ్వజమెత్తారు.ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మాత్రమే ఎక్కువ బడ్జెట్ కేటాయించిందని ఆరోపించారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయించకుండా పక్షపాతం వహించిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కుల,మెతాల పేరుతో విడదీస్తుందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి. మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కుసుకుంట్ల రాజిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడిగ శ్రీను, బొజ్జ శంకర్, సమద్, కత్తుల కోటి, ఖలీల్, ఇంతియాజ్ హుస్సేన్, పోలే జయాకర్,అల్లి సుభాష్ యాదవ్, ఎండి ఇంతియాజ్, దుబ్బ అశోక్ సుందర్, బీరం కరుణాకర్ రెడ్డి,ఇటికాల శ్రీనివాస్, ఇబ్రహీం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు 'ఆల్బెండాజోల్' మాత్రలు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగ్గా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం నేషనల్ డి వార్మింగ్ డే జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 10న అన్ని పాఠశాలలు, సంక్షేమ హాస్టల్‌లలో మాత్రలు వేయించాలని, తీసుకొని వారికి తిరిగి ఈనెల 17న మాత్రలు ఇవ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 20,1560 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారి నుండి మొదలుకొని ఆశా సిబ్బంది వరకు డి వార్మింగ్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు అందించాలన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వలస వచ్చిన పిల్లలు, వివిధ కారణాలతో ఇంటి వద్ద ఉంటున్న పిల్లలను గుర్తించి మాత్రలు ఇవ్వాలన్నారు. కడుపులో నులిపురుగుల ఉండడంతో తిన్న ఆహారం వంటబట్టక పిల్లలు రక్తహీనతకు గురవుతారని, మాత్రలు వేసుకోవడంతో నులిపురుగులు చనిపోతాయని, ఆహారం జీర్ణం అయ్యి పిల్లల ఎదుగుదల బాగుటుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం, డిఈఓ అసోక్, డిడబ్ల్యూఓ నరసింహారావు, ఎంటిఈపి డాక్టర్ నజియా, డిప్యూటి డిఎంహెచ్‌ఓ కోదాడ జయమనోరి, డిఎస్‌డిఓ కె లత, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సీతారాం నాయక్, మెప్మా పిడి రేణుక, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, రమాదేవి, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

శివన్నగూడెం ఎంపిటిసి పరిధిలో ఏ గ్రామాన్ని కలపొద్దు

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని శివన్న గూడెం ఎంపిటిసి పరిధిలో ఏ గ్రామాన్ని కల్పవద్దని ,గ్రామానికి ఎంపిటిసి సరిపడు ఓట్ల శాతం ఉన్నందున ఏ గ్రామాని మా గ్రామములో కల్పవద్దని ఎంపిడిఓ కు గ్రామానికి చెందిన సిపిఐ, కాంగ్రెస్, నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు సోమవారం వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో దాసరి మమత గోపాల్, చిట్యాల రంగారెడ్డి, అయితగోని వెంకటయ్య, మోర నరసింహ, లోడే యాదయ్య, సంక బుడ్డి నరసింహ, కంబాల పెళ్లి రాజేశ్వర్ రెడ్డి, వల్లపు రాములు, ఇరగ దిండ్ల సత్తయ్య, బోయిని యాదయ్య పాల్గొన్నారు.

భరోసా అందక రైతు రంది!

ఎన్నికల ముందు రైతు భరోసా ఎకరాకు రూ. 15వేలు ఇస్తామని ప్రకటించి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ గత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు భరోసా ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీని కుదించి ఎకరాకు రూ. 12వేలు ఇస్తామని సాగుకు యోగ్యమైన భూములకే అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి అధికారులతో సర్వే చేయించింది. మొదట సంక్రాంతి నాటికి అందిస్తామని ప్రకటించి దానిని కాస్తా జనవరి 26కు మార్చింది. కేవలం మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకొని వారికి మాత్రమే బ్యాంకు ఖాతాలో నగదును జమ చేశారు. కానీ మీగతా వారికి నేటికి రైతు భరోసా అందక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి: బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సూర్యాపేట జిల్లాలో 2023లో ఖరీఫ్ సీజన్ కుగాను ప్రభుత్వం 2,76,764 మంది రైతులకు రైతు బంధు పథకం ద్వారా ఎకరానికి రూ. 5వేల చొప్పున రూ. 310.82 కోట్లు చెల్లించడం జరిగింది. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన తరువాత యాసంగి సీజన్ (202324)కు గాను 2,79,099 మంది రైతులకు రూ. 307.91 కోట్లు ఇవ్వడం జరిగింది. ఈ రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా పేరు మార్చిన ప్రభుత్వం గత ప్రభుత్వం రైతు బంధు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడిందని, సాగు చేయని భూములైన గుట్టలు, ఫాంహౌజ్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఫంక్షన్ హాల్‌లకు వేల కోట్ల రూపాయలు కట్టబెట్టిందంటూ తాము సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇస్తామని మొదట ప్రకటించింది. అనంతరం భరోసాను కుదించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాలో రైతులు, రైతు సంఘం నాయకులతో సమావేశాలు నిర్వహించి ఐదు ఎకరాలకు ఇవ్వాలా... లేదా ఎదున్నర ఎకరాలకు ఇవ్వాలా.... అంటూ అభిప్రాయ సేకరణ చేపట్టడంతోనే కాలం వెల్లదిసింది. దీంతో 2024 ఖరీఫ్ సీజన్‌లో ఇవ్వాల్సిన రైతు భరోసాను ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వని విషయం అందరికి తెలిసిందే. ఈ లోపు ఖరీఫ్ సీజన్ ముగిసి యాసంగి రానే వచ్చింది. రైతులతో పాటు ప్రతి పక్ష పార్టీలు ప్రభుత్వ తీరును ఎండగట్టడంతో దిగివచ్చి సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు భరోసా ఇస్తామని ప్రభుత్వ పెద్దలు మాట మార్చారు. ప్రభుత్వం జనవరి 20 నుండి 24వరకు హడావుడిగా అధికారులతో సర్వే చేయించింది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా సాగుకు యోగ్యం కానీ 8600 ఎకరాలకు గత ప్రభుత్వం రైతు భరోసా ఏడాదికి రూ. 10వేల చొప్పున కట్టబెట్టినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. జనవరి 26 నుండి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి ఒక గ్రామాన్ని ఫైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతు భరోసా అందజేసిన విషయం అందరికి తెలిసిందే. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 23 గ్రామాలకు చెందిన 29352 మంది రైతులను ఎంపిక చేసి వారికి రూ. 37.84 కోట్ల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేశారు.

ప్రకటనలకే పరిమతమైన ప్రభుత్వ హామీ

ఫైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాల రైతులకే కాకుండా మిగతా రైతులకు మరుసటి రోజు నుండి అర ఎకరం మొదలుకొని ఒక ఎకర, రెండు, మూడు ఎకరాలు ఇలా రోజు వారిగా రైతుల ఖాతాలో జమ చేస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగింది. కానీ రైతు భరోసా డబ్బులు మాత్రం వారం రోజులు దాటిన మిగతా ఏ ఒక్క రైతుకు కూడా నేటికి రైతు భరోసా అందని పరిస్థితి. ఇప్పటికే రైతులు రబీ పంటను సాగు చేసి రెండు నెలలు గడుస్తుంది. చేతిలో చిల్లి గవ్వలేకున్న వారు అప్పు చేసి పంట సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లోనైనా రైతు భరోసా తమకు అందుతుందనే ఆశతో రైతులు ఎదురు చూసిన ప్రయోజనం లేకుండా పోయింది. రైతు భరోసా డబ్బుల విడుదలపై గందరగోళం నెలకొంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రైతుభరోసా నిలిపివేశారనే వదంతిని మొదట ప్రచారం జరిగింది. ఇదే విషయమై అధికారులను అడిగితే ప్రభుత్వం నుండి తమకు అలాంటి ఆదేశాలు ఏమి రాలేదని, అర్హులైన ప్రతి రైతుకు ఎకరాల వారిగా రెండుమూడు రోజుల్లో నగదు భరోసా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెబుతున్నారు. ఏది ఏమైన ప్రభుత్వం చెప్తున్న మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని రైతులు, రైతు సంఘాల నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలని మంత్రికి వినతి

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: మండలంలోని అన్ని గ్రామాలకు రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ సోమ వారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనతో రవాణా సర్వీసులు ఏర్పాట్లకు స్పందిస్తూ హామీతోపాటు త్వరలో జరగ నున్న స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతి నిధులు నాయకులు చిత్తశుద్ధితో పనిచేసి విజయ ధంకా మోగించాలని మంత్రి దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే లెటర్ ప్యాడ్‌తో పోచం

రాష్ట్రానికి నిధులు నిల్ ..

బిజెపి కేంద్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజాపక్షం/ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయింపులో గాడిద గుడ్డు ఇచ్చిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద టీపీసీసీ చీఫ్ పిలుపుమేరకు నిరసన చేపట్టి దేశ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దాహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,కేంద్రం ప్రకటించిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీరని నష్టం జరిగిందన్నారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు, ఆదిలాబాద్ జిల్లా ఎంపీ బడ్జెట్ నిధుల కేటాయింపులో నోరు మెదపకపోవడం దేనికి సంకేతమని అన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఈ బడ్జెట్ బాధలను మిగిలించిందన్నారు.ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ ఎంపీలు,ఎమ్మెల్యేలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 10 ఏళ్ళు బిఆర్ఎస్ హయంలో దగా పడ్డ తెలంగాణను పునర్ నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు.ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మొండి చేయి చూపడం సరైనది కాదని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్యు నాయకులు బ్లాక్ కాంగ్రెస్ మహిళ కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధ్యక్షతన నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారిని రాజశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమన్వయ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులందరూ ముఖ్యంగా జిల్లా విద్యాధికారి జిల్లా సంక్షేమాధికారిని, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, జిల్లాస్థాయి అధికారులు అందరూ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారితో సమన్వయంగా ఉంటూ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంను ఫిబ్రవరి 10 న జిల్లావ్యాప్తంగా 119 సంవత్సరాల పిల్లలకు నులి పురుగుల నిర్మలనకు అల్బెన్డజోల్ మాత్రలు వేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, అశోక్, రమేష్, రాజు, నాగరాజు, వినీత్, రసూల్ బి నాగోరావు, విజయభాస్కర్, సచిన్, వెంకటేశ్వర్లు వెంకటేశం సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ సర్కార్ దగా

ప్రజాపక్షం/ సదాశివపేట: వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో కార్మికులు ,కర్షకులు , పేద ప్రజలకు మోడీ సర్కార్ దగా చేసినందని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ అన్నారు. సదాశివపేట లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శ్రామిక మహిళ కార్యదర్శి అనూసుజతో కలిసి జిల్లా కార్యదర్శి తాజుద్ధీన్ మాట్లాడుతూ వేతన జీవులకు ఊరట కల్పిస్తున్నామని చెప్పి అదే మాటలతో జనాలను మోసం చేసి దేశాన్ని కార్పోరేట్లకు ఆదాని ,అంబాని లకు తాకట్టు పెడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణ లో అధికారం బిజేపి కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణ రాష్ట్రానికి అభివృద్ధి కి ఏలాంటి నిధులు తేకపోవడం దుర్మార్గమని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి బండి సంజయ్ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనుసూజా బుజ్జమ్మ, విజయలక్ష్మి , ఉర్మిళ తులసి లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

మారుపేర్ల కార్మికులకు న్యాయం చేయాలి

ప్రజాపక్షం/బెల్లంపలి: మారుపేర్ల కార్మికులు, వారి పిల్లలకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి ఆపరేటర్స్ అండ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెడ్లల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కొత్తగూడెం యాత్ర సోమవారం బెల్లంపల్లికి చేరుకుంది. బెల్లంపల్లి తిలక్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సాగిన ఈ పాదయాత్రలో మారుపేర్ల సంఘం కమిటీ నాయకులను పూల మాలలతో ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా నాయకులు విజయ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యంపై, రాష్ట్ర ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. మారుపేర్ల సమస్యను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి వినతి పత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు. మారుపేర్ల కార్మికులకు న్యాయం చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి అని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చాలని లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణకు రూపొందించి పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మారుపేర్ల నాయకులు జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మొరపెట్టుకున్న బాధితుడు

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: తమ తండ్రి ఆస్తిని సమభాగాలుగా పంచి తన కుటుంబానికి న్యాయం చేయాలని దహెగాం మండలం ఇట్యాల గ్రామానికి చెందిన సందెల పోషన్న కుటుంబ సభ్యులతో కలిసి మొరపెట్టుకున్నాడు. సోమవారం జిల్లా కేంద్రంలో స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వారసత్వముగా వస్తున్న ఇల్లును, స్థలంను కాజేసేందుకు తన అన్న తమపై దౌర్జన్యం చేస్తున్నాడని ఈ విషయంపై గతంలో పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు లేవని వాపోయాడు. తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పోలీసుల సలహా మేరకు పెద్దల సమక్షంలో సమ భాగాలుగా ఆస్తిని పంచుకునేందుకు ఒప్పందం కుదుర్చుకొని పత్రాలు రాసినప్పటికీ ఇప్పటికి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/దిలావర్పూర్: దిలావర్ పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్,వోకేషన్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.ఈ పరీక్ష కేంద్రాన్ని డీఈసీ సభ్యులు జాదవ్ పరుశురామ్,సునీల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు,లాబ్స్ ఏర్పాట్లు పరీశించారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ పి.సుదర్శన్ కు సూచించారు.

ఎర్తింగ్ వైర్ తగిలి వ్యక్తి మృతి

ప్రజాపక్షం/సోన్: మండలంలోని పాక్ పట్ల గ్రామానికి చెందిన బోర నర్సయ్య (45) తోటలో అటవీ జంతువుత నుండి పంట రక్షణ కోసం కరెంటు వైర్ కు తగిలి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు నర్సయ్య కౌలుకు చేసే తోట నందు మొక్కజొన్న పంటను అటవీ జంతువుల నుండి రక్షణ కోసం తోట నందు ఎర్తింగ్ వైర్ తో బల్బును రాత్రి సమయంలో పెట్టాడని,బల్బునకు గల ఎర్తింగ్ తీద్దామని వెళ్లి ప్రమాదవసత్తు కరెంట్ షాక్ తగిలి మరణించాడని కొడుకు దీక్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ షేక్ హైమద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన డిసిపి భాస్కర్

ప్రజాపక్షం/రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగుట్ట గ్రామపంచాయతీ గాంధారి ఖిల్లా జాతర ఈనెల 14,15 ,16 తేదీల్లో జరగబోయే ప్రాంతాన్ని డిసిపి భాస్కర్ సోమవారం నాడు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రోజులు జరిపే ఆదివాసి గిరిజనులు జాతరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, జాతర వచ్చే ప్రజలు పోలీసులకు సహకరించాలని అన్నారు. జాతర పరిసరాలను రోడ్లను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పార్కింగ్ ఏరియాను, చెక్ పోస్ట్ పాయింట్లను పర్యవేక్షించారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ ఏసిపి రవికుమార్ మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకుంటే పునరావాసానికి లోటుండదు

జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా

ప్రజాపక్షం/ఎడపల్లి: నైపుణ్యాలతో పాటు వేతనాలను అందించడం ద్వారా ఖైదీల సంస్కరణ పునరావాసంలో ఈ ఉత్పాదక యూనిట్లు ఎంతగానో ఉపయోగడపతాయని తెలంగాణ రాష్ట్ర ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ డా.సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ సెంట్రల్ జైలును ఆమె సందర్శించి నిజామాబాద్ కేంద్ర కారాగారంలో నూతన వీవింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జనరల్ డా.సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. దోషి ఖైదీలు, అండర్ ట్రయల్ ఖైదీలు శిక్షణలు అనుభవిస్తున్న కాలంలో నైపుణ్యం కోసం వృత్తి విద్యలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తద్వారా బయటకు వెళ్లిన వారు దర్జాగా తమ నైపుణ్యంకు సరిపడా వృత్తులు నిర్వహించుకోవచ్చని అన్నారు. వరంగల్ సెంట్రల్ జైలుని మూసి వేసిన తరువాత జైలులోని వీవింగ్ యూనిట్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించడం జరిగిందని అన్నారు. 2021లో నిజామాబాద్ జిల్లా జైలుని కేంద్ర కారాగారంగా మార్చి అందులో స్టీల్ ఇండస్ట్రీ యూనిట్, ప్రింటింగ్ ప్రెస్ యూనిట్, టైలరింగ్ యూనిట్, ఫినాయిల్ యూనిట్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. డీజీ వెంట డీఐజీ ప్రిజన్స్ ఎం.సంపత్, సింధు శర్మ, పి.సాయి కిరణ్, ఆనందరావు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్..

''కీచక'' ఉపాధ్యాయుడు 'ప్రజాపక్షం' కథనానికి స్పందన..

ప్రధానోపాధ్యాయుడుతో సహా ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్.. ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ప్రతినిధి: కీచక ఉపాధ్యాయుడు విద్యార్థులతో అసభ్య ప్రవర్తన అనే కథనం సోమవారం రోజున వచ్చిన ప్రజాపక్షం దినపత్రికలో ప్రచరం పై అధికారులు స్పందించారు. ఉదాసీనంగా వ్యవహరించిన పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ని ఇద్దరు ఉపాధ్యాయులు,ప్రధానోపాధ్యాయిని సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆ ఉపాధ్యాయుడితో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మరో ఉపాధ్యాయుడు సహా మొత్తం ముగ్గురు సస్పెన్షన్ కు గురయ్యారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు రావడంతో వీరిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై శాఖా పరమైన విచారణ కొనుసాగుతుందని, ఘటనకు కారకులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఘటనపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

బడిలో పిల్లలను తన కన్న పిల్లల్లా చూసుకోవాల్సిన ఉపాధ్యాయుడు వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన నిర్మల్ జిల్లా గాజుల నర్సాపూర్ హైస్కూల్లో ఆలస్యంగా వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడం, వెకిలి చేష్టలు చేయడం, వారి శరీరాలను తాకడం చేస్తూ ఉండేవాడని విద్యార్థినులు తల్లిదండ్రులు దృష్టికి తీసుకెళ్లారు.గత సంవత్సరం 9వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఈ విషయమై ప్రధానోపాధ్యాయిని దృష్టికి తీసుకెళ్లినా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వచ్చాయి. నర్సాపూర్ అంజని తాండకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని లెక్కల మాస్టారు వెకిలి చేష్టలను భరిస్తూ వచ్చింది. ఈ ఏడు పదో తరగతిలో నూ పరిస్థితిలో మార్పు కినపించకపోడంతో తల్లిదండ్రులకు తెలిపింది. కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని సదరు ఉపాధ్యాయుడిని విచారించగా దాటవేసే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడిని తీవ్రంగా మందలించి చేయి చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధానోపాధ్యాయుడు స్పందించకపోవడం విద్యార్థినులకు శాపంగా మారింది. ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న విషయం బయటకు రావడంతో ఎవరి స్థాయిలో వారు తప్పించుకునే ప్రయత్నం చేశారు. సస్పెన్షన్‌కు గురైన సదరు ఉపాధ్యాయుడు గతంలో పనిచేసిన బెల్తారోడా, బీరెల్లి గ్రామాల్లోనూ ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్నాడు.



ప్రజావాణికి 141 ఫిర్యాదులు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 141 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. ఈ సందర్భంగా డివార్మింగ్ డేను పురస్కరించుకుని జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీయం అండ్ హెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి సీసీ టీవీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపర్చిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని అందుబాటులో ఉన్న బ్యాలెట్ బాక్సుల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు తదితరులున్నారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మారుతినగర్‌లో వ్యభిచార గృహంపై టాస్క్ ఫోర్స్ఏసిపి నాగేంద్రచారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ అంజయ్య, సిసిఎస్ సిబ్బంది రైడ్ చేసి ఒక నిర్వహకురాలిని, ముగ్గురు బాధిత మహిళలను, ఒక విటుడు, నగదు 3660 రూపాయలు, రెండు నిరోడ్ ప్యాకెట్లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం నిజామాబాద్ రూరల్ ఎస్హెచ్‌వోకి అప్పగించారు.

యువత భవిష్యత్ పాలకులుగా ముందుకు

ప్రజాపక్షం/నస్పూర్: యువత భవిష్యత్ పాలకులుగా ముందుకు రావాలని ఎఐవైఎఫ్ మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్ అన్నారు. సోమవారం నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో అఖిల భారత యువజన సమక్య (ఎఐవైఎఫ్) తీగలపాడు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో 2025 నూతన క్యాలెండర్‌ను మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత నేటి పాలకుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ, ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని, స్థానిక సంస్థల నుంచి దేశ స్థాయి వరకు యువత ప్రజా ప్రతినిధులుగా పోటీ చేసి, సమాజంలో మార్పుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రభుత్వ విధానాల కారణంగా ఉద్యోగ అవకాశాలు దూరమవుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోందని విమర్శించారు. ప్రజా పోరాటాల్లో యువత ముందుండి నడిపించే బాధ్యత స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తీగలపాడు ఏరియా కమిటీ నాయకులు ముత్తునూరి మహేష్, అచ్చ హరీష్, ఎం. సాయికుమార్, విజయ్ భాస్కర్, తిరుపతి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: విద్యార్థులకు రోజువారీగా నాణ్యమైన భోజనమును అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. సోమవారం ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు మధ్యాహ్న అందించే వంటలను, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. కాలం చెల్లిన సరుకులను ఉపయోగించకూడదని సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి పలు విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పది ఫలితాల్లో విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినిలను సన్నద్ధం చేయాలని సూచించారు. గురుకుల పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన ఆసుపత్రి కార్మికులు

ప్రజాపక్షం/బాన్సువాడ: బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో విదులు నిర్వహిస్తున్న కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలను చెల్లించాలని కోరుతు సోమవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాములు మాట్లాడుతూ విధులు నిర్వహించిన కార్మికులకు సకాలంలో వేతనాలు అందివ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు కార్మికులకు రావలసిన బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాములు, సంతోష్ గౌడ్, రేణుక, సురేఖ, సుశీల, గంగారాం, సాయిలు, జైలింగ్, కాశిరాం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి వైభవం

ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/గజ్వేల్: పంచమి పర్వదినాన వర్గల్ క్షేత్రం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. వసంత పంచమి మహోత్సవాన్ని పురస్కరించుకొని క్షేత్ర సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, సోమవారం తెల్లవారుజామున శ్రీవిద్యాసరస్వతి అమ్మవారికి వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల మంత్రోశ్చరణల మధ్య ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి శ్రీ పంచమి వేడుకలకు అంకురార్పణ చేశారు. అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, పల్లకి సేవ, లక్ష పుష్పార్చన, చెప్పన్ బోగ్ నివేదన, శ్రీ విద్యాజ్యోతి దివ్యదర్శనం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పర్వదిన సందర్భంగా క్షేత్రానికి 50 వేల మందికి పైగా భక్తులు తరలిరాగా, పది వేలకు పైగా అక్షరాభ్యాసాలు జరిగినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయగా, రెండు రోజులపాటు ఆలయ సముదాయం భక్తులతో కిటకిటలాడింది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు. గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి నేతృత్వంలో ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయగా, రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సైలు కరుణాకర్ రెడ్డి, విజయ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

క్రీడ

ప్రజ్ఞానంద అద్భుత విజయం.. తొలి భారతీయుడిగా ఘనత!

భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద మరోసారి తన సత్తా నిరూపించాడు. టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ లో ఛాంపియన్ గా నిలిచాడు. థ్రిల్లింగ్ గా సాగిన టై బ్రేకర్‌లో వరల్ ఛాంపియన్ గుకేష్ పై ప్రజ్ఞానంద గెలిచాడు. 2–1 తేడాతో గెలుపొంది టైటిల్ ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ విజయంతో.. 2006 (అప్పుడు విశ్వనాథన్ ఆనంద్ విజేత) తర్వాత టాటా స్టీల్ మాస్టర్స్ లో టాప్ ప్రైజ్ అందుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. అంతకుముందు తమ చివరి 13వ రౌండ్ లో గుకేశ్, ప్రజ్ఞానంద.. ఇద్దరూ ఓటమిని అందుకున్నారు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ చేతిలో గుకేష్ కంగుతినగా.. విన్సెంట్ కీమర్ చేతిలో ప్రజ్ఞానంద పరాజయం పొందాడు. దీంతో గుకేష్, ప్రజ్ఞానంద తలో 8.50 పాయింట్లతో సమంగా నిలిచారు. తద్వారా టైటిల్ కోసం రెండు గేమ్‌ల టై బ్రేకర్ లో ఆడారు. ఇందులో మొదటి టై బ్రేకర్ లో గుకేష్ విజయం సాధించగా.. రెండో ట్రై బ్రేకర్ లో ప్రజ్ఞానంద గెలుపును సొంతం చేసుకున్నాడు. ఈ రెండు రౌండ్లు చెరో మూడు నిమిషాల పాటు సాగింది. అనంతరం విజేతను తేల్చేందుకు మళ్లీ సడన్ డెత్ రౌండ నిర్వహించాల్సి రాగా.. ఇందులో ప్రజ్ఞానంద విజయం సాధించి టైటిల్ ను ముద్దాడాడు. ఇక టాటా స్టీల్ ఛాలెంజర్స్ 2025లో వియాత్నంకు చెందిన థాయ్ దాయ్ నుగెన్ విజేతగా నిలిచాడు. ప్రజ్ఞానంద సోదరి ఆర్ వైశాలి 9వ స్థానంలో నిలవగా.. దివ్య దేశ్ ముఖ్ 12వ స్థానంలో సరిపెట్టుకుంది.

మహమ్మద్ సిరాజ్ రీఎంట్రీ!

ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌తో పాటు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఎంపిక చేసిన భారత జట్టులో స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే. ఐదు టెస్టుల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో సిరాజ్ విఫలమవ్వడంతో అతనిపై టీమిండియా మేనేజ్‌మెంట్ వేటు వేసింది. సిరాజ్‌కు బదులు టీ20 స్పెషలిస్ట్ అయిన అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపిక చేశారు. మిడిల్, డెత్ ఓవర్లలో సిరాజ్ ప్రభావం చూపలేడనే అతన్ని పక్కనపెట్టామని కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. జట్టు నుంచి ఉద్వాసనకు గురైన సిరాజ్.. రీఎంట్రీ ఇవ్వడంపై ఫోకస్ పెట్టాడు. ఫిట్‌నెస్‌తో పాటు బౌలింగ్‌ను మెరుగుపర్చుకునేందుకు ట్రైనింగ్ ప్రారంభించాడు. 'రెస్ట్, రీస్టార్ట్, రీ ఫోకస్'అనే క్యాప్షన్‌తో జిమ్ వర్కౌట్ ఫొటోలను షేర్ చేశాడు. ఆ తర్వాత హైదరాబాద్ రంజీ టీమ్‌తో కలిసి ప్రాక్టీస్ చేయడంతో పాటు దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగాడు. విదర్భతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ తరఫున సిరాజ్ సంచలన ప్రదర్శన కనబర్చాడు. తొలి ఇన్నింగ్స్‌లో 18 ఓవర్లు బౌలింగ్ చేసి 7 ఓవర్లు మెయిడిన్ చేసి ఓ వికెట్ తీసాడు. ఓ ఎండ్‌లో సిరాజ్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మరో ఎండ్‌లో హైదరాబాద్ బౌలర్లు వికెట్లు దక్కించుకున్నారు. రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లు బౌలింగ్ చేసిన సిరాజ్ 4 మెయిడిన్లు వేసి 3 వికెట్లు తీసాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో అతను ఎకానమీ 3 ధాటలేదు. మిడిల్ ఓవర్లలో ప్రభావం చూపలేడన్న రోహిత్ శర్మ వ్యాఖ్యలకు సిరాజ్ తన బౌలింగ్‌తోనే బదులిచ్చాడు. బ్యాటింగ్ వైఫల్యంతో ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 55 పరుగుల తేడాతో ఓడినా.. సిరాజ్ మాత్రం అసాధారణ ప్రదర్శన కనబర్చాడు.అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకు తాను సిద్ధంగానే ఉన్నానని తన ప్రదర్శనతో తెలిపాడు. అయితే మహమ్మద్ సిరాజ్ ఛాంపియన్స్ ట్రోఫీలో బరిలోకి దిగే అవకాశాలను కొట్టిపారేయలేమని క్రికెట్ విశ్లేషకులు అంటున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా వెన్ను గాయంపై క్లారిటీ లేదని, ఒకవేళ అతను జట్టుకు అందుబాటులోకి రాకపోతే సిరాజ్ రీఎంట్రీ ఇస్తాడని చెబుతున్నారు. అదే జరిగితే షమీతో కలిసి సిరాజ్ పేస్ బాధ్యతలు పంచుకుంటాడు. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుండగా.. బంగ్లాదేశ్‌తో 23న భారత్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

సంజూ శాంసన్‌కు తీవ్ర గాయం.. ఐపిఎల్ 2025కి దూరం!

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ సంజూ శాంసన్‌కు తీవ్ర గాయమైనట్లు తెలుస్తోంది. ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన ఐదో టీ20లో సంజూ శాంసన్ ఇండెక్స్ ఫింగర్ విరిగినట్లు సమాచారం. జోఫ్రా ఆర్చర్ వేసిన బౌన్సర్ సంజూ గ్లోవ్స్‌కు బలంగా తాకడంతో చూపుడు వేలు విరిగినట్లు తెలుస్తోంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉందని, నెల రోజుల పాటు అతను ఆటకు దూరమయ్యే అవకాశాలు ఉన్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. ఈ గాయం కారణంగా అప్‌కమింగ్ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్‌కు సంజూ శాంసన్ దూరం కానున్నాడు. ఐపీఎల్ 2025 ఆరంభ మ్యాచ్‌లకు కూడా అతను దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం సంజూ శాంసన్.. తన స్వస్థలం తిరవనంతపురం వెళ్లాడు. త్వరలోనే బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో చేరి రిహాబిలిటేషన్ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎన్‌సీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత సంజూ మళ్లీ ఆటను మొదలు పెట్టనున్నాడు. 'సంజూ శాంసన్ కుడి చేతి చూపుడు వేలు విరిగింది. ఈ గాయం నుంచి కోలుకోవడానికి అతనికి ఐదు నుంచి 6 వారాల సమయం పట్టనుంది. కాబట్టి అతను రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడే అవకాశాలు లేవు. జమ్మూ కశ్మీర్, కేరళ మధ్య ఫిబ్రవరి 8 — 12 మధ్య పుణె వేదికగా జరగనుంది. ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు కూడా అతను దూరమయ్యే ఛాన్స్ ఉంది.'అని ఓ బీసీసీఐ అధికారి మీడియాకు తెలిపాడు. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో సంజూ శాంసన్ దారుణంగా విఫలమయ్యాడు. ఐదు మ్యాచ్‌ల్లోనూ పుల్ షాట్ ఆడబోయి వికెట్ పారేసుకున్నాడు. ఆఖరి టీ20లో గంటకు 150 కిలోమీటర్ల వేగంతో జోఫ్రా ఆర్చర్ వేసిన మూడో బంతినే సంజూ శాంసన్ గ్లోవ్స్‌కి బలంగా తాకింది. అయితే సంజూ శాంసన్ గాయంపై ఇప్పటి వరకు బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. సంజూ శాంసన్ సైతం స్పందించలేదు. రాజస్థాన్ రాయల్స్ సారథిగా వ్యవహరిస్తున్న సంజూ శాంసన్ దూరమవ్వడం ఆ జట్టుకు తీరని లోటే. మార్చి 21 నుంచి ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే ఆ సమయంలోపు అతను కోలుకుంటాడని సంజూ ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు

ఆ హీరోను అలా పిలుస్తాను: కీర్తి సురేశ్

మలయాళ స్టార్ హీరో దిలీప్ కి, హీరోయిన్ కీర్తి సురేశ్ కి మధ్య మంచి అను బంధం ఉంది. కారణం.. గతంలో దిలీప్ హీరోగా వచ్చిన ఓ సినిమాలో అతని కూతురు పాత్రలో కీర్తి సురేష్ నటించినట్లు ఆమె తాజాగా తెలిపారు. ఆ సినిమా తర్వాత దిలీప్ కి, హీరోయిన్ కీర్తి సురేశ్ కి మధ్య మంచి అనుబంధం ఏర్పడిందట. అప్పటి నుంచి ఆయనను కీర్తి సురేష్ అంకుల్ అని పిలుస్తోందట. చిన్నతనం నుంచి దిలీప్ ని అలా అంకుల్ అని పిలిచి, ఆ తర్వాత ఆయన పక్కనే హీరోయిన్ గా కీర్తి సురేష్ నటించింది. ఇదే విషయం గురించి తాజాగా కీర్తి సురేష్ మాట్లాడుతూ.. 'కూతురి పాత్ర చేసిన కొన్నేళ్లకు దిలీప్ సరసన గర్ల్ ఫ్రెండ్ రోల్ లో నటించాను. ఆ సమయంలో ఎప్పటిలాగే నేను దిలీప్ ను అంకుల్ పిలిచేదాన్ని. అప్పుడు ఆయనకు అది నచ్చలేదు. అంకుల్ అని కాకుండా అన్నయ్య అని పిలవాలని దిలీప్ నాకు చెప్పారు. అప్పటి నుంచి నేను ఆయనను అన్నయ్య అనే పిలుస్తాను' అని కీర్తి సురేష్ చెప్పుకొచ్చింది.

28న రాబోతున్న హారర్ థ్రిల్లర్

కోలీవుడ్ నటుడు జీవా, యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా నటిస్తున్న తాజా చిత్రం 'అగత్యా'. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ గీత రచయిత పా. విజయ్ కథ, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో పాటు మంచి థ్రిల్లింగ్ కాన్సెప్ట్తో రూపొందుతున్న ఈ సినిమాలో రాశీఖన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి రీసెంట్గా విడుదలైన సెకెండ్ సాంగ్ బాగా ఆకట్టుకుంది. 'నేలమ్మ తల్లి' అంటూ సాగే ఈ పాట అర్జున్ను హైలెట్ చేస్తూ ఉంది. జీవా నటించిన గత చిత్రం బ్లాక్ కూడా మంచి విజయం అందుకుంది. ఇప్పుడు అగత్యాతో తమిళం, తెలుగు, హిందీ ప్రేక్షకులను పలకరించేందుకు రెడీ అవుతున్నారు.

రీల్

'కన్నప్ప' నుంచి రుద్రుడు లుక్‌లో ప్రభాస్!

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా చిత్రం కన్నప్ప. ఈ చిత్రం కోసం విష్ణు కఠినంగా కష్టపడు తున్నాడు. పైగా ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్ లాంటి ఎంతోమంది అగ్ర నటీనటులు కనిపించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లుక్ రివీల్ అయింది. ప్రభాస్ రుద్ర పాత్రలో కనిపించనున్నారు. ప్రభాస్ లుక్ అదిరిపోయిందంటూ అభిమానులు పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ రుద్రుడు పాత్రలో కనిపించనున్నాడు. ఈ పాత్ర ఇంటర్వెల్ లో వస్తోందని తెలుస్తోంది. కాగా ఏప్రిల్ 25, 2025న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామాకి మహా భారత్ సీరియల్ని డైరెక్ట్ చేసిన ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవీఏ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్లో చిత్రీకరించారు. ఇది భక్తి చిత్రం మాత్రమే కాదని, అదొక చరిత్ర అని మోహన్‌బాబు ఓ సందర్భంలో అన్నారు. ఈ చిత్రానికి ఆయన నిర్మాతగా వ్యవహరించడంతో పాటు ఓ కీలక పాత్రలో నటించారు.

అల్లు అర్జున్ అందుకే రాలేకపోయాడట

అక్కినేని నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా తెరకెక్కిన చిత్రం 'తండేల్'. ఈ సినిమాకి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఐతే, చిత్రబృందం ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. శనివారమే జరగాల్సిన ఈ ఈవెంట్ అనివార్య కారణాలతో ఆదివారం జరిగింది. కాగా ఈ సినిమా జాతర ఈవెంట్ కు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా వస్తాడని మొదట టీమ్ అధికారికంగా తెలిపింది. దీంతో, బన్నీ అభిమానులు కూడా తండేల్ ఈవెంట్ పై బాగా ఇంట్రెస్ట్ చూపించారు.కానీ, చివరి నిమిషంలో తండేల్ జాతర ఈవెంట్ కి బన్నీ రాలేకపోయాడు. దీనికి గల కారణాన్ని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు.

నేడు అసెంబ్లీలో ప్రత్యేక భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్: శాసనసభ,శాసనమండలి ఉభయ సభల ప్రత్యేక సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది.ఈ ప్రత్యేక సమావేశంలో సమగ్ర కుటుంబ సర్వే నివేదిక, ఎస్ సి వర్గీకరణ నివేదికపై చర్చ జరగనుంది. ఉభయ సభల ప్రత్యేక సమావేశంలో సమగ్ర కుటుంబ సర్వే నివేదిక, ఎస్ సి వర్గీకరణ నివేదికపై లఘు చర్చ జరగనుంది. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్లను ఖరారు చేయడం, ఎస్‌సి వర్గీకరణ నివేదిక ఆధారంగా విద్యా, ఉద్యోగ రంగాలలో ఎస్‌సి ఉపకులాలకు రిజర్వేషన్లను వర్గీకరించడంపై ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. కుల సర్వే నివేదిక ప్రకారం బిసి జనాభా 50 శాతానికి మించిపోవడంతో అందుకు అనుగుణంగా రిజర్వేషన్లన పెంచాలని కేంద్రాన్ని కోరుతూ శాసనసభ, శాసనమండలి విజ్ఞప్తి చేస్తూ తీర్మానం చేసే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. అంతకుముందు మంత్రివర్గ ఉప సంఘాలు తమ నివేదికలను శాసనసభ ప్రాంగణంలోని కమిటీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమర్పిస్తాయి. ఈ నివేదికలపై మంత్రి వర్గం చర్చించి, ఆమోదించనుంది. అనంతరం ఈ రెండు నివేదికలను ప్రభుత్వం శాసనసభ,శాసనమండలిలో ప్రవేశపెడుతుంది.

డిఎస్‌సి 2008 అభ్యర్థులకు ఊరట

1382 పోస్టుల భర్తీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్: డీఎస్సీ 2008 అభ్యర్థుల్లో అర్హులైన వాళ్లతో 1,382 కాంట్రాక్టు టీచర్లుగా నియమించాలని మరోసారి హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వుల అమలుకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకి కాబోదంది. ఎన్నికల కోడ్ పేరుతో నియామకాలను మళ్లీ వాయిదా వేయడానికి వీల్లేదని చెప్పింది. ఎమ్మెల్సీ కోడ్ వల్ల నియామకాల ప్రక్రియ వాయిదా పడిందని ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి చెప్పడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. గత ఉత్తర్వుల మేరకు నియామకాలు చేసి ఈ నెల 10న జరిగే విచారణనాడు తెలియజేయాలని ఆదేశించింది. లేనిపక్షంలో ఆఫీసర్లను కోర్టుకు పిలిపించి విచారణ చేస్తామంది. సమైక్య ఏపీలో 2008 డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడింది. డీఎడ్ అభ్యర్థులకు 30 శాతం ఎస్‌జీటీ పోస్టులు రిజర్వు చేయడంతో జరిగిన న్యాయపోరాటం వల్ల పలువురు అభ్యర్థులకు ఉద్యోగాలు రాలేదు. 2009లో హైకోర్టులో దాఖలైన ఈ కేసు సుప్రీంకోర్టు నుంచి తిరిగి హైకోర్టు చేరింది. వీటిని సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ తిరుమలాదేవి బెంచ్ విచారించింది. హైకోర్టు ఆర్డర్ తర్వాత క్యాబినెట్ సబ్ కమిటీ ఏర్పాటైందని, ఏపీలో తరహాలో రిటైర్ అయ్యే వరకు కాంట్రాక్టు టీచర్లుగా కొనసాగించేందుకు ప్రభుత్వం రెడీ ఉందని ఏజీ చెప్పారు. దీనిపై న్యాయమూర్తి, ఈ నెల 10 తేదీలోగా పోస్టింగ్‌లు ఇవ్వాలని చెప్పి విచారణ వాయిదా వేశారు.

అంగన్‌వాడీలకు అదనపు నిధులివ్వండి

కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవితో మంత్రి సీతక్క భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్: అంగన్వాడీ కేంద్రాలకు అదనపు నిధులు మంజూరు చేయాలని, చిన్నారులకు అల్పాహార పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాలని తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో మంత్రి సీతక్క సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలను కేంద్రమంత్రికి సీతక్క వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35,700 అంగన్వాడీలు పనిచేస్తుండగా, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసిడిఎస్) ద్వారా మహిళలు, పిల్లలకు సంపూర్ణ పోషణను అమలు చేయడంలో తెలంగాణ అగ్రగామిగా ఉన్నదని కేంద్ర మంత్రి దృష్టికి మంత్రి సీతక్క తీసుకెళ్లారు. అంగన్వాడి చిన్నారుల పోషణను మెరుగు పరిచేందుకు అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని, అల్పాహార పథకాన్ని అమలు చేస్తే ప్రతి రోజూ చిన్నారులకు అదనపు పోషకాహారం అందుతుందని, పైగా చిన్నారులు క్రమం తప్పకుండా ప్రీ స్కూల్స్‌కు హాజరయ్యే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. ఈ స్కీమ్‌తో 8.6 లక్షల మంది అంగన్ వాడీ చిన్నారులు ప్రయోజనం పొందుతారని, ఇందుకు ఒక్కో చిన్నారికి రోజుకు అల్పాహారం నిమిత్తం రూ. 8 ఖర్చు అయ్యే అవకాశాలు ఉన్నాయని, ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఏడాదికి రూ.206 కోట్ల ఖర్చు అవుతుందని సీతక్క తెలిపారు. ఈ స్కీమును అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి స్పందిస్తూ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి, తగిన నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చినట్టు సీతక్క వివరించారు. త్వరలోనే తెలంగాణలో కేంద్ర మంత్రి పర్యటించి, మహిళా శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేస్తామని చెప్పినట్టు మంత్రి సీతక్క వివరించారు. ఈ సమావేశంలో టిజి ఫుడ్స్ ఛైర్మన్ ఎం.ఎ.ఫహీం, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ ఉన్నారు.

ఎఐ యూనివర్సిటీతో పెరగనున్న తెలంగాణ ప్రతిష్ట

రాష్ట్ర ఐటి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ యువతను కృతిమ మేధ(ఎఐ)లో నిపుణులుగా తీర్దిదిద్దాలనే సంకల్పంతో ఎఐ సిటీలో ఎఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైటెక్ సిటీలో సోమవారం ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సేవలు అందిస్తున్న డిపాజిటరీ ట్రస్ట్, క్లియరింగ్ కార్పోరేషన్ (డిటిసిసి) నూతన కార్యాలయాన్ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందన్నారు. 200 ఎకరాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎటి సిటీని నిర్మించనున్నామని, అక్కడే ఎఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ యూనివర్సిటీ నిర్వహణలో సంబంధిత పరిశ్రమలు, నిపుణులను భాగస్వామ్యం చేస్తామని, రానున్న రోజుల్లో ఎఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ గుర్తుకు వచ్చేలా దానిని తీర్చిదిద్దుతామని చెప్పారు. నిత్యం టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోందని, అదే సమయంలో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. యువత కొత్తగా ఆలోచించి వీటికి పరిష్కారాలను నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. హైదరాబాద్ అనగానే అందరికీ కేవలం సాఫ్ట్ వేర్ కంపెనీలే గుర్తుకొస్తాయని, కానీ ఇక్కడ అన్ని రంగాలకు చెందిన 100 నుంచి 120 కంపెనీలు ఇక్కడి నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సేవలందిస్తున్నాయని గుర్తు చేశారు. అన్ని రకాల పరిశ్రమలను స్థాపించేందుకు అనువైన వాతావరణం తెలంగాణలో ఉందన్నారు. డిటిసిసి భారత్‌లో తన రెండో కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు అభినందనలు తెలిపారు. ఇక్కడ సుమారు 500 మందికి కొత్తగా ఉపాధి లభించనుందని, రానున్న రోజుల్లో 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. వీటిలో అధిక శాతం తెలంగాణ యువతకు ఇవ్వాలని మంత్రి కోరగా అందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. కార్యక్రమంలో డిటిసిసి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రెనీ లారోకే మోరీస్, చీఫ్ ఇన్‌ఫర్మేషన్ ఆఫీసర్ లిన్ బిషప్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు – వేల గొంతులు'కు అనుమతివ్వండి

సిఎంకి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎస్‌సి వర్గీకరణ అమలుకు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు–చేల గొంతులు' సాంస్కృతిక ప్రదర్శనకు పోలీసు శాఖ అనుమతి నిరాకరించడం తగదని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. తమ మూలాలు, అస్తిత్వం కాపాడుకునేందుకు జరిగే ఈ సాంస్కృతిక ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలని ఆయన సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైదరాబాద్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముప్పై ఏండ్ల ఎస్‌సి వర్గీకరణ పోరాటాలు, సభలు, సమావేశాల్లో ఎంఆర్‌పిఎస్ ఎప్పుడూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందనడం విచారకరమన్నారు. అసాంఘిక శక్తుల వల్ల ఇబ్బందులుంటే వారిని గుర్తించి, ముందుగానే అదుపులోకి తీసుకోవాలన్నారు. ఆరు అంశాలను పేర్కొంటూ అనుమతి నిరాకరిస్తూ నోటీసులు ఇచ్చారని, దీనికి వివరణ ఇస్తూ మరో వినతిపత్రం ఇస్తామని మందకృష్ణ తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డితోపాటు అన్ని పార్టీల నాయకులను సాంస్కృతిక ప్రదర్శనకు ఆహ్వానిస్తామని మందకృష్ణ వివరించారు. సమావేశంలో బిసి సంఘం నేత పృథ్వీరాజ్ యాదవ్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్, కళాకారుడు దర్వు ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్'కే తలమాణికం

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో అధికారిక బృందం సోమవారం ఇక్కడకు వచ్చింది. ఈ మేరకు విదేశీ ఆర్మీ బృందం ఇండియన్ కల్చర్ అండ్ ట్రెడిషన్‌లో పోచంపల్లి చేనేత ఇక్కత్ పరిశ్రమ అందిస్తున్న భాగస్వామ్యం గురించి సవివరంగా తెలుసుకునేందుకు పోచంపల్లి టూరిజం పార్కులో చేనేత పరిశ్రమ కళాకారులు వస్త్రాలు తయారు చేసే ప్రక్రియ విధాన మ్యూజియం, చేనేత కళాపునర్వియూనిట్, చేనేత కోఆపరేటివ్ సొసైటీ, కొండా లక్ష్మణ్ బాపూజీ మార్కెట్ సముదాయాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు చేనేత కార్మికులు వస్త్రాల తయారీలో ప్రాథమికంగా నూలు వడికే దశ నుండి పలు దశలవారీగా వివిధ పద్ధతులలో చేనేత ఇక్కత్ వస్త్రాలు తయారీ అయ్యి మార్కెట్లోకి విడుదల అయ్యేంతవరకు జరిగే పూర్తి ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మాస్టర్ వీవర్స్‌ను, చేనేత కార్మిక సంఘాల నాయకులను, అధికారులను, కార్మికులను అడిగి మరీ వారు సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. హ్యాండ్లూమ్ టూరిజం అధికారులు చేనేత ఇక్కత్ వస్త్రాల చరిత్రను ప్రొజెక్టర్ ప్రదర్శన ద్వారా విదేశీ బృందానికి కళ్ళకు కట్టినట్టుగా వివరించారు. ఈ సందర్భంగా విదేశీ బృందం మ్యూజియంలో నేత కార్మికులు పట్టుపురుగుల పట్టు కాయల నుండి దారం తీసే ప్రక్రియ నుంచి మొదలుకొని మగ్గాలపై రకరకాల వస్త్రాలను నేస్తూ వివిధ చేనేత కళాత్మక వస్త్రాల నేపథ్యాన్ని సృజనాత్మకతను నైపుణ్యాన్ని పరిశీలించారు. చేనేత సింగిల్ ఇక్కత్ డబల్ ఇక్కత్ సింగిల్, మల్టిపుల్ డిజైన్లను ఏ విధంగా తయారు చేస్తారన్న విషయమై గ్రాఫ్ డిజైన్లను ఏ విధంగా చిత్రీకరించి ఆసుపై కలను, రంగులను ఏ విధంగా అద్దుతారన్న విషయమై వారికి పూర్తిగా అవగాహన కల్పించారు. మగ్గాలపై చేనేత కార్మికులు నేస్తున్న చీరల నైపుణ్య పనితీరును చూసి అదుగడుగునా సంబరపడిపోయి బృంద సభ్యులంతా మంత్రముగ్ధులయ్యారు. ప్రపంచవ్యాప్తంగా చేనేత వస్త్రాలకు ఉన్న ఆదరణను ఇంకా కావలసిన ప్రమోటింగ్ సదుపాయాలను, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించాల్సిన ప్రోత్సాహకాలను అడిగి మరీ తెలుసుకున్నారు.

చేనేత కార్మికుల నైపుణ్య కళను తిలకించి ఉబ్బితబ్బిబ్బయ్యారు :
ఆర్‌డిడి పద్మ

ఢిల్లీ ఆర్మీ డిఫెన్స్ కాలేజ్ నుంచి శిక్షణ బృందంలో విదేశీయులు అమెరికా, ఫిలిపిన్స